
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 16-2-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 302 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా. 2.16 తదుపరి పంచమి; నక్షత్రం: హస్త తె. 4.31 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ. 11.03-12.50; దుర్ముహూర్తం: సా. 4.41-5.27; అమృతఘడియలు: రా. 9.48-11.35; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 6.13 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అబ్బురపరిచే అద్భుత లోకం


3,500 ఏళ్ల కల్పవృక్షం

ఒక్క చెట్టు ఖరీదు రూ.4 కోట్లు! మరి అది ఎప్పటిదో తెలుసా!? 3500 ఏళ్లనాటిది! సినీ నటుడు ప్రభాస్, ఆసియా కుబేరుడు ముఖేశ్ అంబానీ ఇంట్లో ఇలాంటి చెట్టు ఉంది. వివిధ దేశాలకు చెందిన ఇటువంటి అరుదైన వృక్షాలు అక్కడ ఎన్నో!! అదే.. చిలుకూరులో 150 ఎకరాల్లో రూ.450 కోట్లతో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియం పార్కు!

ఆ విశేషాలు.. నవ్య పేజీలో

సమాజ సేవకు అంకితం కావాలి


మ్యూజికల్ నైట్‌లో సీఎం, డిప్యూటీ సీఎం

- మనుషులు లేకున్నా వారి ఆశయాలు కొనసాగాలి
- ఎన్టీఆర్ ట్రస్ట్, బసవతారకం ఆస్పత్రి శాశ్వతం
- యుఫోరియా మ్యూజికల్ నైట్‌లో సీఎం చంద్రబాబు
- నా వంతుగా రూ. 50 లక్షల విరాళం ఇస్తున్నా: పవన్
- ప్రజలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్: మంత్రి లోకేశ్ 11
- అమరావతిలో తలసీమియా సెంటర్: బాలకృష్ణ
- అందరూ రక్తదానం చేయాలి: నారా భువనేశ్వరి


విజయవాడలో శనివారం రాత్రి యుఫోరియా సంగీత విభావరి

రెవెన్యూ ఖాళీ!

ఆఫీసుల్లో ఉన్నది సగం మందే

350 మండలాలకు తహశీల్దార్లు లేరు

150 డిప్యూటీ తహశీల్దార్ పోస్టులు ఖాళీ

ఆర్ఐ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకూ కొరత

- ఆర్డీవో కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి
- ఫిర్యాదుల పరిష్కారానికి పెద్ద అడ్డంకి
- టార్గెట్ల ఒత్తిడితో ఉత్తుత్తి 'పరిష్కారం'



ఒకవైపు... జగన్ సర్కారు అడ్డగోలు 'రీసర్వే'లతో భారీగా పెరిగిన భూ వివాదాలు! వాటి పరిష్కారం కోసం కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న దరఖాస్తులు! మరోవైపు.. భూసమస్యల పరిష్కారాన్ని సీరియస్‌గా తీసుకున్న కూటమి ప్రభుత్వం! వాటి పరిష్కారానికి రెవెన్యూ శాఖపై ఒత్తిళ్లు! అంతా బాగానే ఉంది! కానీ.. రెవెన్యూలో ఆ స్థాయిలో సిబ్బంది ఎక్కడ? తహశీల్దార్ల నుంచి జూనియర్ అసిస్టెంట్ల వరకు పోస్టులు భారీ సంఖ్యలో ఖాళీ! మరి.. సమస్యల పరిష్కారం ఎలా?

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోంది. నిర్దిష్ట గడువులోపు వాటిని పరిష్కరించాలని స్పష్టం చేస్తోంది. అయితే సిబ్బందిలేక సతమతమవుతున్న అధికారులు.. సమస్యలను కాగితాలపైనే 'పరిష్కరిస్తున్నారు'. అధికారులిచ్చే నివేదికలు, పీపీటీలు, ఆర్టీజీఎస్ డేటా చూసి.. 'ప్రజా సమస్యల పరిష్కారం పరుగులు తీస్తోంది' అని సర్కారు భావిస్తోంది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 679 మండలాలు ఉన్నాయి. మండలానికి ఒక తహశీల్దారు చొప్పున 679 మంది ఉండాలి. కానీ.. ఉన్నది ఎంతమందో తెలుసా? 329 మంది మాత్రమే! అంటే.. 350 మండలాలకు రెగ్యులర్ తహశీల్దార్లు లేరు! ఇన్‌చార్జిలే దిక్కు! రాష్ట్రంలో రెవెన్యూ శాఖ పరిస్థితి ఇదీ! మొత్తంగా రెవెన్యూలో 45 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండల తహశీల్దార్

మిగతా 12వ పేజీలో...

ఆ మహిళా పోలీసులను ఏం చేద్దాం?

- నియామకం స్త్రీ, శిశు సంక్షేమ సేవలకు
- పని చేస్తున్నది యూనిఫాం విధుల్లో
- నాడు జగన్ నిర్ణయాల ఫలితమిది 13
- హోం, శిశు సంక్షేమ శాఖ మంత్రుల చర్చలు
- శిశు సంక్షేమ శాఖ పరిధిలోకి తేవాలని అనిత, సంధ్యారాణి యోచన


న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి ప్రయాగ్‌రాజ్ రైలు వద్ద ప్రయాణికుల రద్దీ 2

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట

15 మంది మృతి

- కుంభమేళా భక్తులతో భారీ రద్దీ
- 14,15 ప్లాట్‌ఫామ్‌లు కిటకిట
- రైలు ఎక్కే సమయంలో దుర్ఘటన


కందుకూరులోని దూబగుంటలో చెత్తను ప్రాసెస్ చేసే ప్లాంట్ ప్రారంభించి, సిబ్బందికి సూచనలిస్తున్న సీఎం

పేదల కోసం ఒకరోజు

- అదేరోజు పింఛన్లు పంపిణీ చేస్తున్నాం
- నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్రకు
- ఆ రోజు శుభ్రత కోసమే కేటాయింపు 13
- స్వచ్ఛాంధ్ర అందరి బాధ్యత కావాలి
- 85 లక్షల టన్నుల చెత్త వదిలిపోయిన వైసీపీ
- కందుకూరు స్వచ్ఛాంధ్ర సభలో చంద్రబాబు

నేతలు.. నేల విడిచి సాములు



అధికారంలోకి వచ్చిన వారు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల అధినేతలు తమ చుట్టూ ఇనుప తెరలను ఏర్పాటు చేసుకొని ప్రజల మనోభావాలను తెలుసుకొనే ప్రయత్నం చేయరు. ఎవరెవరితోనో సర్వేలు చేయించుకొని అంతా బాగుందని తమను తాము మోసం చేసుకుంటుంటారు.

2019లో చంద్రబాబు ఓడిపోవడానికి కానీ... ఆ తర్వాత కేసీఆర్, జగన్మోహన్ రెడ్డి ఓటమికిగానీ స్పష్టమైన కారణాలు ఉన్నాయి. ఆ కారణాలు ప్రజలకు తెలుసు.

2019కి ముందు చంద్రబాబు పాలనలోని వాసనలు ఇప్పుడు కూడా వస్తున్నాయన్నది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అభిప్రాయంగా ఉంది. ఏఐ అంటే ఏమిటో 90 శాతం ప్రజలకు తెలియదు. వాటివల్ల కలిగే ప్రయోజనాలేమిటో అంతకంటే తెలియదు. 90 శాతానికి పైగా ప్రజలకు తెలియని అంశాన్ని పదేపదే వల్లెవేయడం వల్ల ప్రయోజనం ఏమిటో ఆయనకే తెలియాలి.

బటన్లు నొక్కి డబ్బులు పంచితే చాలు- తాను ఏమి చేసినా ప్రజలు పట్టించుకోరని జగన్ రెడ్డి భావించారు. ప్రభుత్వంలో అరాచకం ప్రబలి ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. ప్రజల బాగోగులను విస్మరించి కక్ష సాధింపులకు ప్రాధాన్యతను ఇవ్వడంతో ఎన్నికలలో ఆయనను 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారు.

ప్రజల్లో తమ పట్ల వ్యతిరేకత ఏర్పడిన విషయాన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలు ఎందుకు తెలుసుకోరో అర్థం కాదు. ఎన్నికల వ్యూహకర్తలను నియమించుకొని వందల కోట్లు తగలేసే బదులు పార్టీ కార్యకర్తల మనోభావాలు తెలుసుకొనే ప్రయత్నం చేస్తే తాము ఎక్కడ ఉన్నామో తెలిసి పోతుంది.

మంత్రి లోకేశ్ ఇటీవల ఢిల్లీ వెళ్లి మరీ ప్రశాంత్ కిశోర్‌ను కలిశారు. ఒకటి రెండు రోజులు ఢిల్లీలో గడిపారు. ఆ సమయమేదో పార్టీ కార్యకర్తలకు కేటాయించి ఉంటే అద్భుతమైన, నికార్సయిన ఫీడ్ బ్యాక్ లభించి ఉండేది కదా!

పవర్ పాయింట్ ప్రజంటేషన్ అనే పీపీటీ వల్ల ఆత్మవంచనే మిగులుతుంది. ముఖ్యమంత్రిని సంతృప్తి పరచడానికే ఈ పీపీటీలను అధికారులు రూపొందిస్తారు. చంద్రబాబుకు టెక్నాలజీ అంటే మక్కువ కనుక ఆ దిశగానే పీపీటీలను రూపొందిస్తారు.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

వంశీ ఇంట్లో సుదీర్ఘ సోదాలు



- గచ్చిబౌలి ఇంట్లో సెల్‌ఫోన్ల కోసం గాలింపు
- అరెస్టుకు ముందు నోటీసు అందుకోగానే వైసీపీ నేతలు, చానళ్లకు కాల్స్
- తర్వాత వాటిని మాయం చేసిన వైనం
- మైహోమ్ భూజాలో సీసీటీవీల పరిశీలన
- ఇంట్లో కీలక ఆధారాల సేకరణ
- సత్యవర్ధన్‌ను విజయవాడ కోర్టు నుంచి ఇక్కడికే తరలించినట్లు గుర్తింపు 12

రంగ రంగా!

- వంశీ ముఖ్య అనుచరుడు మోహన రంగారావే కిడ్నాప్ కేసులో కీలక నిందితుడు
- కొమ్మా కోట్లుతో కలిసి అపహరణ స్కెచ్

మహిళల జోలికొస్తే మరణదండనే!



- డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తీవ్ర హెచ్చరిక
- అన్నమయ్య, గుంటూరు, పల్నాడు జిల్లాల ఘటనలపై సీరియస్ 13
- కృత్రిమ మేధ సాయంతో ఎక్కడికక్కడ నిఘా
- సైకో రోమియోల కట్టడికి స్పష్టమైన ఆదేశాలు

ఎఫ్-35.. కాలం చెల్లినవి!




- వాటి కొనుగోలు.. చరిత్రలోనే చెత్త డీల్
- డ్రోన్ల యుగంలో ఇంకా మానవ సహితమా?
- గత ఏడాది ఎక్స్‌లో ఎలాన్ మస్క్ పోస్టులు
- భారత్‌కు అమెరికా ఎఫ్-35 ప్రతిపాదన నేపథ్యంలో నాటి కామెంట్లు వైరల్ 2

ఒకేసారి 9,500 మందిని తొలగించిన ట్రంప్

త్వరలో మరిన్ని తొలగింపులు.. వీఆర్ఎస్‌కు 75 వేల మంది సమ్మతి

18 మెట్లు ఎక్కగానే అయ్యప్ప దర్శనం



- ఫ్లైఓవర్ బ్రిడ్జి తొలగింపు
- ఇరుముడితో వస్తే నేరుగా దర్శనం
- మార్చి 14 నుంచి అమలు 2

ఛత్తీస్‌గఢ్ 'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ హవా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఛత్తీస్‌గఢ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో జయకేతనం ఎగరవేసిన కాషాయ పార్టీ తాజాగా 10 మున్సిపల్ కార్పొరేషన్లను సునాయాసంగా కైవసం చేసుకుంది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 49 మున్సిపల్ కౌన్సిల్, 114 నగర పంచాయతీలతో సహా 173 పట్టణ, స్థానిక సంస్థలకు ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహించగా... శనివారం ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మీడియాతో మాట్లాడుతూ... ఈ విజయం రాష్ట్ర బీజేపీ చరిత్రలో మరిచిపోలేని రోజుగా అభివర్ణించారు. కాగా, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ 8 మున్సిపల్ కౌన్సిల్, 22 నగర పంచాయతీలను గెలుచుకుంది.

'శీష్ మహల్'పై విచారణకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌పై కేంద్ర ప్రభుత్వం గురి పెట్టింది. కేజ్రీవాల్ హయాంలో ఢిల్లీలోని 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులో ఉన్న సీఎం అధికారిక నివాసాన్ని పునరుద్ధరించే పనులు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే.. ఈ క్రమంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, శీష్ మహల్(అద్దాల మేడ)ను నిర్మించుకున్నారని బీజేపీ నాయకులు విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు భవనం పునర్నిర్మాణంపై ప్రాథమిక పరిశీలన చేసిన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఈ నెల 13న కేంద్రానికి నివేదిక ఇచ్చింది. భవన నిర్మాణ విషయంలో నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంది. ఈ క్రమంలో పూర్తి స్థాయి విచారణ కు కేంద్రం ఆదేశించింది.

మహారాష్ట్రలో లవ్ జిహాద్ నియంత్రణకు చట్టం!

ముంబయి, ఫిబ్రవరి 15: లవ్ జిహాద్, బలవంతపు మతమార్పిడులను నిరోధించడానికి చట్టం తీసుకురావాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై అధ్యయనం చేసేందుకు ఏడుగురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. డీజీపీ అధ్యక్షుడిగా ఉండే ఈ కమిటీలో మహిళ, శిశు సంక్షేమం, మైనార్టీ వ్యవహారాలు, న్యాయ, సామాజిక న్యాయం శాఖల కార్యదర్శులు, హోం శాఖ డిప్యూటీ కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో లవ్ జిహాద్, మత మార్పిడిలు ఎంతవరకు ఉన్నాయి, వాటిని అరికట్టడానికి చట్టపరంగా ఏమి చేయాలన్నదానిపై అధ్యయనం చేసి సిఫార్సులు చేయనుంది.

కొత్త టెక్నాలజీ ఉత్పత్తికి విజన్ కావాలి

- ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విమర్శ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: వట్టి మాటలు చెప్పడం కాదు.. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్పత్తి చేయాలంటే స్పష్టమైన విజన్ భారత్‌కు అవసరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో అపారమైన ప్రతిభ అందుబాటులో ఉందన్న ఆయన.. యువతకు ఉద్యోగాలు కల్పించడానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో పారిశ్రామిక నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు బలమైన పునాది అవసరమని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అలాగే ఆయన తొమ్మిది నిమిషాల వీడియోలో డ్రోన్ టెక్నాలజీ గురించి చెప్పుకొచ్చారు. ఈ రంగంలో పోటీగా నిలిచేందుకు ఒక వ్యూహం రచించాల్సిన అవసరం ఉందన్నారు. దురదృష్టవశాత్తు ప్రధాని మోదీ దీన్ని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. కృత్రిమ మేధ(ఏఐ)పై ఆయన టెలీప్రాంప్టర్‌లో ప్రసంగాలు చేస్తుంటే.. మన పోటీదారులు కొత్త టెక్నాలజీల్లో ప్రావీణ్యం సంపాదిస్తున్నారని పేర్కొన్నారు.

కేంద్రం ఇచ్చిన రాయితీల్లో సగం ఆహారంపైనే..!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, డిసెంబరు నెలల మధ్య కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల రాయితీలపై రూ.3.07 లక్షల కోట్ల వరకు ఖర్చు చేసింది. ఇందులో ఆహార సబ్సిడీ వ్యయాలు అత్యధికంగా 50 శాతానికి పైగా ఉండగా, ఎరువులపై రాయితీ స్వల్పంగా తగ్గిందని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు(9 నెలల్లో) ఆహార రాయితీలకు రూ.1.64 లక్షల కోట్లు కేటాయించారు. అయితే ఇదే సమయంలో ఎరువుల సబ్సిడీలు గతేడాది రూ.1.41 లక్షల కోట్ల నుంచి రూ.1.36 లక్షల కోట్లకు తగ్గాయి. భారత్‌లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం కూడా తగ్గిందని నివేదిక తెలిపింది.

జస్టిస్ గవాయ్ 'పరాన్నజీవుల' వ్యాఖ్య నిరుపేదలపై కాఠిన్యానికి నిదర్శనం

- 300 మందికి పైగా సామాజిక కార్యకర్తల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: "ఉచిత' పథకాల ద్వారా ఒక పరాన్నజీవుల వర్గాన్ని సృష్టించట్లేదా' అని ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను 300 మందికి పైగా సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, పాత్రికేయులు ఒక బహిరంగ లేఖలో ఖండించారు. ఢిల్లీలో ఇళ్లులేని వారికి ఆశ్రయం కల్పించాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ చేసిన ఈ వ్యాఖ్యలు పేదల పట్ల న్యాయ వ్యవస్థలో ఉన్న వ్యతిరేకతను ప్రతిఫలిస్తున్నాయని ఆ లేఖ విమర్శించింది. 'ఇళ్లు లేని వారంటే పట్టణ పేదల్లో అతిపేదలు. భవన నిర్మాణ కూలీలుగా, పారిశుధ్య కార్మికులుగా, బరువులు మోయడం వంటి కష్టమైన పనులు చేసుకుని జీవిస్తుంటారు. అలాంటి వారిని పరాన్నజీవులుగా వ్యాఖ్యానించడం కాఠిన్యతకు నిదర్శనమ'ని పేర్కొంది. అత్యంత బలహీన వర్గాలపై నిందలు వేయడం, వారిని వెక్కిరించడం తగదని సూచించింది.

మహాకుంభమేళాను పొడిగించండి: అఖిలేశ్

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 15: ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు ఇంకా భారీ సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో.. కుంభమేళాను మరి కొన్ని రోజుల పాటు పొడిగించాలని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. కుంభమేళాలో భాగంగా ఇప్పటివరకు 50 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారని యూపీ ప్రభుత్వం తెలిపింది. ఇదిలా ఉండగా, మహాకుంభమేళాలో శనివారం మరో అగ్ని ప్రమాదం జరిగింది. పలు టెంట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అదృష్టవశాత్తూ ఎవరికేమీ కాలేదు. ప్రయాగ్‌రాజ్-మిర్జాపూర్ జాతీయ రహదారిపై భక్తులు ప్రయాణిస్తున్న బస్సు-బొలెరో వాహనం ఢీకొని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పది మంది చనిపోయారు.

పాక్ నుంచి డ్రోన్లలో మాదకద్రవ్యాలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా అంతర్జాతీయ సరిహద్దు మీదుగా భారత్‌లోకి పెద్ద ఎత్తున మాదకద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాల రవాణా జరుగుతోంది. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) గత నాలుగేళ్లుగా అమృత్‌సర్‌లో కూల్చేసిన డ్రోన్లలో 75% వరకు పాకిస్థాన్‌లోని లాహోర్ నుంచి ప్రయోగించినవేనని విశ్లేషణలో వెల్లడైంది. గతేడాది అంతర్జాతీయ సరిహద్దు మీదుగా 251 వరకు డ్రోన్లు భారత్‌లోకి ప్రవేశించగా, వాటిలో 184 డ్రోన్లు(75 శాతం) పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోకి, మరో 42 డ్రోన్లు పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలోకి, ఇంకో 14 డ్రోన్లు గుర్‌దాస్‌పూర్‌లోకి వచ్చినట్టు భద్రతాదళాలు గుర్తించాయి. 2019 నుంచే పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థలు డ్రోన్ల ద్వారా మాదకద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలను భారత భూభాగంలోకి పంపిస్తున్నట్టు భద్రతా దళాలు పేర్కొన్నాయి.

పెన్సిల్ ఎత్తినా వ్యాయామం చేసినట్టే..!

న్యూయార్క్, ఫిబ్రవరి 15: గతేడాది జూన్‌లో అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు వెళ్లిన ఇద్దరు వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ మార్చి 19న భూమి మీదకు బయల్దేరనున్నారు. జీరో గ్రావిటి నుంచి గురుత్వాకర్షణ కలిగిన వాతావరణంలోకి దాదాపు 8 నెలల తర్వాత రానున్న వారికి.. భూమి మీదకొచ్చాక పలు రకాల సమస్యలు ఎదురు కానున్నట్లు తెలుస్తోంది. తాము భూమి మీదకు తిరిగొచ్చాక చిన్న పెన్సిల్ లేపినా పెద్ద బరువులు ఎత్తి వ్యాయామం చేసిన అనుభూతే ఉంటుందని విల్‌మోర్ మీడియాకు వెల్లడించారు.

జేఈఈ మెయిన్ బీఆర్క్ ప్రాథమిక కీ విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో బీఆర్క్, బీ ప్లానింగ్ అడ్మిషన్లకు నిర్వహించిన జేఈఈ మెయిన్ తొలి విడత పేపర్ 2ఏ, 2బీ ప్రాథమిక కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం విడుదల చేసింది. ఈ కీపై అభ్యర్థులు ఆదివారం వరకు తమ అభ్యంతరాలను తెలపవచ్చు. 2025 జనవరి 30వ తేదీన ఈ పరీక్ష జరిగింది. ఇటీవలే జేఈఈ మెయిన్స్ పేపర్ 1 ఫలితాలు వెల్లడైన విషయం తెలిసిందే.



ఉద్యోగ యంత్రాంగంలో ఊచకోతలే!

ఒకేసారి 9,500 మందిని తొలగించిన ట్రంప్.. ఎక్కువమంది ప్రొబేషన్‌లో ఉన్న సిబ్బందే

- ఉద్యోగస్వామ్యం స్థిరీకరణలో భాగమన్న ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 15 : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉద్యోగ యంత్రాంగంలో పూర్తి స్థాయి ప్రక్షాళన మొదలుపెట్టారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న 9,500 మంది సిబ్బందిని ఒకేసారి తొలగించారు. వీరిలో ప్రభుత్వ భూములు, వయోవృద్ధుల సేవలు, ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న కీలక విభాగాల సిబ్బంది కూడా ఉన్నారు. ఇంకా.. అంతర్గత వ్యవహారాల విభాగం, ఇంధన విభాగం, వ్యవసాయ విభాగం, ఆరోగ్య, మానవ సేవల విభాగాల్లోనూ సిబ్బందికి కోత విధించారు. ఫెడరల్ ఉద్యోగస్వామ్యాన్ని స్థిరీకరిస్తామని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ పదేపదే చెప్పేవారు. ఇందులో భాగంగానే ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలో 'డోజ్' చేసిన సిఫారసుల ఆధారంగా ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఏకంగా వేల మందిని ఒకేసారి తొలగించింది. ఉద్వాసనకు గురైన వారిలో ఏడాదికాలంగా ప్రొబేషన్‌లో ఉంటూ ఇంకా పర్మినెంట్ కానివారే ఎక్కువమంది ఉన్నారు. ఇక.. కన్స్యూమర్ ఫైనాన్షియల్ ప్రొటెక్షన్ బ్యూరో వంటి స్వతంత్ర సంస్థలు సిబ్బంది కొరతతో దాదాపు మూతబడే పరిస్థితి వచ్చింది. బ్యూరోలో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందికి సైతం ఉద్యోగాలు ఊడాయి. ఉద్యోగులను పెద్దఎత్తున కోల్పోయిన ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసు విభాగంలో వచ్చేవారం మరిన్ని కోతలు ఉంటాయని రాయిటర్స్ సంస్థ కథనం ప్రచురించింది. కాగా, స్వచ్ఛంద పదవీవిరమణకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఆఫర్‌ను ఇప్పటివరకు 75వేలమంది అంగీకరించారని వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి.

ఆర్మీలో ట్రాన్స్‌జెండర్లపై నిషేధం

సైన్యంలో ట్రాన్స్‌జెండర్ల నియామకాన్ని అమెరికా నిషేధించింది. అలాగే, మిలిటరీలో లింగ మార్పిడి వైద్య ప్రక్రియపైనా వేటు వేసింది. ఈ మేరకు ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీల్లో మరొకదాన్ని డోనాల్డ్ ట్రంప్ నెరవేర్చారు. రెండోసారి శ్వేత సౌధంలో అడుగుపెట్టిన తర్వాత ట్రంప్ పలు కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. సైన్యంలో ట్రాన్స్‌జెండర్ భావజాలాన్ని అనుమతించబోమన్నది ఆ ఉత్తర్వుల్లో ఒకటి. దీనిపై మిలిటరీ 'ఎక్స్'లో ఒక ప్రకటన విడుదల చేసింది. "తమను తాము ట్రాన్స్‌జెండర్లుగా భావించుకునేవారి నియామకాన్ని సైన్యంలో తొలగిస్తున్నాం. సర్వీసులో ఉండగా లింగ మార్పిడి విధానాలను అనుమతించబోం. అమెరికాకు నిస్వార్థంగా సేవలు అందించాలనుకునే జెండర్ డిస్ఫోరియా వ్యక్తులను మాత్రం యథాతథంగా గౌరవిస్తాం" అని తెలిపింది. కాగా, సైన్యంలో ట్రాన్స్‌జెండర్ల నియామకంపై ఉన్న నిషేధాన్ని 2016లో అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా తొలగించారు. తాను అధికారంలోకి రాగానే తిరిగి వారిపై నిషేధం విధిస్తానని ట్రంప్ ప్రకటించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతక మిలిటరీ శక్తి కలిగిన దేశంగా అమెరికా ఎదగాలంటే ట్రాన్స్‌జెండర్ భావజాలాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిందేనని అప్పట్లో ఆయన పేర్కొన్నారు. కాగా, మహిళల క్రీడాపోటీల్లో ట్రాన్స్‌జెండర్లకు ప్రవేశాన్ని ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం నిషేధించింది. అలాగే, ఇటీవలి ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున గెలిచిన ట్రాన్స్‌జెండర్ ఎంపీ సారా మెక్‌బ్రైడ్‌ను మహిళల బాత్రూమ్‌లోకి అనుమతించరాదంటూ అధికారిక రిపబ్లికన్లు ఏకంగా తీర్మానమే చేశారు.

119 మంది అక్రమ వలసదారులతో అమృత్‌సర్‌కు మరో విమానం

- 67 మంది పంజాబ్ వాసులు, 33 మంది హరియాణా వాసులు
- అమృత్‌సర్‌లో విమానం దిగడంపై పంజాబ్ సీఎం మాన్ అభ్యంతరం

అమృత్‌సర్, ఫిబ్రవరి15: అక్రమ వలసదారుల తరలింపులో భాగంగా అమెరికా నుంచి మరో విమానం అమృత్‌సర్ విమానాశ్రయంలో దిగింది. ఈ విమానంలో మొత్తం 119 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో 67 మంది పంజాబ్‌కు చెందినవారున్నారు. హరియాణాకు చెందిన వారు 33 మంది, గుజరాత్ 8, యూపీ 3, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల నుంచి ఇద్దరేసి ఉన్నారు. హిమాచల్, జమ్మూకశ్మీర్ కు చెందిన ఒక్కొక్కరున్నారు. మరోవైపు తమ రాష్ట్రంలో విమానాలు దిగడాన్ని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ వ్యతిరేకించారు. పంజాబీలు మాత్రమే అక్రమంగా వలస వెళ్తారని చెప్పడానికా అని ఆయన ప్రశ్నించారు. అయితే ఇలాంటి సున్నితమైన విషయాల నుంచి రాజకీయ ప్రయోజనం పొందాలని చూడటం సరికాదని బీజేపీ విమర్శించింది.

లోకం తీరు



ఒక్క చుక్క రక్తంతో క్లోమ క్యాన్సర్ నిర్ధారణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ప్రాణాంతకమైన క్లోమ క్యాన్సర్‌ను కేవలం ఒక చుక్క రక్తంతో, అతి తక్కువ ఖర్చుతో గుర్తించే పరీక్ష త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ దిశగా ఒరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ (ఓహెచ్ఎస్‌యూ) పరిశోధకులు పీఏసీ-ఎంఏఎన్ఎన్(ప్యాక్‌మాన్) అనే రక్తపరీక్షను అభివృద్ధి చేశారు. పరిశోధనల్లో భాగంగా ప్యాంక్రియాటిక్ డక్టల్ అడెనోకార్సినోమా (పీడీఏసీ) రోగుల్లో మరింత చురుగ్గా ఉండే నిర్దిష్ట ప్రొటీన్లు, ప్రధానంగా ప్రొటీజెస్ కోసం 350మంది రక్త నమూనాలను పరిశీలించారు. పీడీఏసీ అనేది క్లోమ క్యాన్సర్‌లో అత్యంత ప్రాణాంతకమైన రకం. ఇది సంధాన కణజాలాన్ని బలహీనపర్చడం ద్వారా కేన్సర్ కణితులు పెరగడానికి దోహదం చేస్తుంది. ఈ ప్రొటీన్లను గుర్తించడం ద్వారా క్లోమ క్యాన్సర్‌ను 98శాతం కచ్చితత్వంతో నిర్ధారించగల పరీక్షను రూపొందించారు. ఈ అధ్యయనం వివరాలు సైన్స్ ట్రాన్స్‌లేషనల్ మెడిసిన్ జర్నల్‌లో తాజాగా ప్రచురితమయ్యాయి. కేవలం ఒక్క చుక్క రక్తాన్ని పరీక్షించడం ద్వారా 45 నిమిషాల్లోనే ఫలితం వెలువడే ఈ పరీక్షకు రూపాయి కంటే తక్కువ ఖర్చవుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. శరీరంపై కోత పెట్టాల్సిన అవసరం లేకుండా అతి తక్కువ సమయంలో క్యాన్సర్‌ను గుర్తించే ఈ పరీక్ష.. వ్యాధి నిర్ధారణలో మేలిమలుపు కాగలదని, క్యాన్సర్ మరణాల నివారణకు తోడ్పడుతుందని భావిస్తున్నారు. కాగా, క్లోమ క్యాన్సర్ సోకిన తర్వాత బతికి బయటపడిన వారు చాలా తక్కువ. ప్రతి నలుగురిలో ఒక్కరే ఏడాది అంతకంటే ఎక్కువ కాలం జీవిస్తారని అంచనా. వ్యాధిని త్వరగా గుర్తించలేకపోవడమే దీనికి ప్రధాన కారణం. 2024లో క్లోమ క్యాన్సర్ బారిన పడి 50వేల మందికి పైగా మరణించారు.

డ్రోన్ల యుగంలో ఎఫ్-35లు అవసరమా?

వాషింగ్టన్, ఫిబ్రవరి 15: ఎఫ్-35 యుద్ధ విమానాలను భారత్‌కు అమ్మడానికి సిద్ధంగా ఉన్నామని రెండు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో ప్రతిపాదించిన నేపథ్యంలో ఆ విమానాల ప్రత్యేకతపై చర్చ మొదలైంది. దాంతోపాటు శరవేగంగా మారుతున్న యుద్ధ రీతుల్లో అంత ఖరీదు పెట్టి ఆ విమానాలను కొనాల్సిన అవసరం ఉందా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో భారీ ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా భారతదేశానికి చెందిన స్వతంత్ర రక్షణ నిపుణులు ఎఫ్-35కి అనుకూలంగా, ప్రతికూలంగా తమ వాదనలకు పదును పెడుతున్నారు. ఈ క్రమంలోనే ఎఫ్-35కి వ్యతిరేకంగా ఐటీ దిగ్గజం ఎలాన్ మస్క్ గత ఏడాది నవంబర్లో పెట్టిన పోస్టులు ఇప్పుడు చర్చకు వచ్చాయి. చరిత్ర గతిలో అమెరికా పెట్టిన సొమ్ముకు మిలిటరీపరంగా అతితక్కువ ఫలితం ఇచ్చిన విమానాలు ఎఫ్-35 అని మస్క్ పేర్కొన్నారు. అదే రోజు మరో సందర్భంలో చిన్న మిలిటరీ డ్రోన్ల వీడియోను పోస్ట్ చేస్తూ "ఈ కాలంలో కూడా కొంతమంది మూర్ఖులు ఎఫ్-35ల తరహాలో మనుషులు ఉన్న యుద్ధ విమానాలను తయారు చేస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. "ఎఫ్-35లో ఏమేం ఉండాలనేది నిర్ణయించే సమయంలోనే దాని లక్ష్యం దెబ్బతింది. ఒక్క దాంతోనే చాలా పనులు చేయించాలి అనుకున్నారు. దాంతో అది అత్యంత ఖరీదైనదిగా, సంక్లిష్టమైనదిగా తయారైంది. అన్నిట్లో ప్రవేశం ఉంది. ఎందులోనూ నిష్ణాతురాలు కాదు అన్నట్టు తయారైంది. దాడిలో విజయం సాధించడం ఆ విమానానికి నిర్దేశించిన లక్ష్యాల్లో ఉన్నట్టు అనిపించడం లేదు. డ్రోన్ల యుగంలో పైలట్ ఫైటర్ జెట్‌లు పైలట్ల ప్రాణాలను పణంగా పెట్టడం తప్ప ఇంకెందుకూ పనికిరావు" అని మరో పోస్టులో అన్నారు. క్షిపణులు, డ్రాప్ బాంబ్‌ల రేంజ్‌లు పెంచుకోవాలంటే పైలట్లున్న ఫైటర్ జెట్‌లు సెట్ కావని చెప్పారు. తిరిగి వాడగల డ్రోన్లు ఆ పని తేలిగ్గా చేయగలవన్నారు. శత్రుపక్షానికి అధునాతన డ్రోన్లు, భూమి మీద నుంచి ప్రయోగించే అధునాతన క్షిపణులు ఉంటే పైలట్ సహిత ఫైటర్ జెట్‌లను ఇట్టే కూల్చేయగలవని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధమే ఇందుకు ఉదాహరణ అన్నారు. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించే ఫైటర్ జెట్‌లు పైలట్లకు అందమైన ప్రియురాళ్లను తెచ్చిపెట్టగలదని వ్యంగ్యంగా అన్నారు.

నిమ్మకాయకు రూ. 5.9 లక్షలు

చెన్నై, ఫిబ్రవరి 15: హైదరాబాద్‌లో గణేశుని చేతిలోని లడ్డూకు ఎంత ప్రాధాన్యం ఉందో తమిళనాడులోని పళనిలో మురుగన్ పాదాల చెంత పెట్టే నిమ్మకాలకు కూడా అంత ప్రాశస్త్యం ఉంది. తాజాగా జరిగిన వేలంలో ఒక నిమ్మకాయను రూ.5.90 లక్షలకు పాడి ఓ భక్తుడు సొంతం చేసుకున్నాడు. పుదుక్కోట్టై జిల్లా తిరువరుంగుళం వల్లనాట్టు చెట్టియార్ వర్గీయులు పళనిలో ఏటా మూడు రోజుల పాటు తైపూస ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేసే సమయాల్లో స్వామి పాదాల వద్ద ఒక్కో నిమ్మకాయ పెట్టి పూజ చేస్తుంటారు. వాటిని గురువారం వేలం వేశారు. ఒక్కో నిమ్మకాయ రూ.16 వేలు నుంచి 40 వేలు వరకు పలికింది. తైపూసం రోజున మురుగన్ అభిషేకం సమయంలో పాదాల వద్ద ఉంచిన నిమ్మకాయను రూ.5.09 లక్షలకు ఓ భక్తుడు సొంతం చేసుకున్నారు. వేలంలో కేవలం వల్లనాట్టు చెట్టియార్లు మాత్రమే పాల్గొంటారు.

ఏకంగా సీబీఐ ఆఫీసులోనే చోరీ

అగర్తల, ఫిబ్రవరి 15: ఏకంగా సీబీఐ క్యాంపు కార్యాలయంలోనే చోరీ జరిగింది. త్రిపుర రాజధాని అగర్తలలో..అదీ కట్టుదిట్టమైన భద్రత ఉండే శ్యామిలీ బజారులో చోటు చేసుకుంది. 5 నెలలుగా మూతపడి ఉన్న ఈ కార్యాలయానికి మంగళవారం అధికారులు వెళ్లి చూడగా ఆశ్చర్యకర దృశ్యం కనిపించింది. కార్యాలయ గోడలు తప్ప ఇంకేమీ అక్కడ లేవు. ద్వారాలు, కిటికీలు, కప్‌బోర్డులు, ఇనుప బీరువాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు అన్నీ అపహరణకు గురయ్యాయి. దీనిపై సీబీఐ ఇన్‌స్పెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. 8 ఇనుప బీరువాలు, 7 చెక్క కుర్చీలు, 4 ఇతర కుర్చీలు, 4 కిటికీలు, గీజర్‌ను తిరిగి స్వాధీనం చేసుకున్నారు.




న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో మృతులు, రైలు ఎక్కేందుకు ఒకరినొకరు తోసుకుంటున్న దృశ్యం



న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట

15 మంది మృతి

మృతుల్లో చిన్నారులు, మహిళలు


- ప్రయాగ్‌రాజ్‌కు ప్రత్యేక రైళ్లు
- ఒక్కసారిగా పోటెత్తిన యాత్రికులు
- 14, 15 ప్లాట్‌ఫామ్‌లలో తొక్కిసలాట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: మౌని అమావాస్య రోజు జరిగిన తొక్కిసలాట ఘటన... విషాదం మరచిపోకముందే మరో ఘోరం జరిగింది. ప్రయాగ్‌రాజ్ వెళ్లేందుకు యాత్రికులు పోటెత్తడంతో న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ విషాదంలో 15 మంది మరణించారు. పది మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో పది మంది మహిళలు, ముగ్గురు చిన్నారులున్నట్లు తెలుస్తోంది. మహా కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి శనివారం రాత్రి ప్రయాగ్‌రాజ్‌కు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో రైల్వేస్టేషన్‌కు తరలి వచ్చారు. జనరల్ టికెట్లు కొని.. 14, 15 ప్లాట్‌ఫామ్‌లపైకి చేరుకున్నారు. అనూహ్యంగా వచ్చిన భక్తులతో ఒక్కసారిగా అక్కడ భారీ రద్దీ ఏర్పడింది. ప్రయాగ్‌రాజ్ వెళ్లే రైలు ఎక్కేందుకు పోటీ పడటంతో పరిస్థితి అదుపు తప్పి తొక్కిసలాట జరిగింది. తొలుత రైల్వే శాఖ 'అబ్బే... అదేం లేదు. తొక్కిసలాట జరగలేదు. అన్నీ వదంతులే' అని ప్రకటించింది. సహాయ సిబ్బంది రంగంలోకి దిగిన తర్వాత కానీ అసలు విషాదం వెలుగు చూడలేదు. క్షతగాత్రులను వివిధ ఆస్పత్రులకు తరలించారు. తొక్కిసలాటలో మరణాలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విచారం వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఘటనపై రైల్వేశాఖ దర్యాప్తునకు ఆదేశించింది.

18 మెట్లు ఎక్కగానే దర్శనం

- శబరిమల అయ్యప్ప సన్నిధానంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి తొలగింపు
- మార్చి 14 నుంచి అమలు

(సెంట్రల్ డెస్క్)



అయ్యప్ప భక్తులకు శుభవార్త..! ఇకపై ఇరుముడితో వెళ్లే భక్తులు పవిత్ర పద్దెనిమిది మెట్లు ఎక్కగానే.. అయ్యప్ప సన్నిధిలో దర్శనానికి అనుమతిస్తారు. ఇంతకు ముందు పదునెట్టాంబడి ఎక్కగానే.. భక్తులను ఎడమవైపునకు మళ్లించేవారు. అక్కడి నుంచి ఆలయం చుట్టూ.. సుమారు 500 మీటర్ల దూరం ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా.. సన్నిధానాన్ని చేరుకోవాల్సి వచ్చేది. శబరిమల ఆలయ అభివృద్ధిలో భాగంగా.. అధికారులు కొత్త లేఅవుట్‌ను డిజైన్ చేశారు. దీని ప్రకారం సన్నిధానం చుట్టూ ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిని తొలగిస్తారు. వచ్చేనెల 14న మీన మాస పూజల కోసం అయ్యప్ప ఆలయాన్ని తెరుస్తారు. ఆ సీజన్‌లో ఇరుముడితో వెళ్లే భక్తులు.. 18 మెట్లు ఎక్కగానే.. నేరుగా ధ్వజస్తంభానికి ఇరువైపులా రెండు లేదా నాలుగు లైన్లను ఏర్పాటు చేస్తారు. భక్తులు బలికల్‌పుర(కణిక్కవంచి-నైవేద్య పాత్ర) మీదుగా ఎదురుగా ఉండే అయ్యప్ప సన్నిధికి చేరుకోవచ్చు. ఇంతకు ముందు ఫ్లైఓవర్ దిగాక.. అయ్యప్ప సన్నిధి ఎడమ వైపు నుంచి దర్శనానికి అనుమతించేవారు. దీని వల్ల.. సన్నిధానానికి ఎదురుగా వచ్చినప్పుడు మాత్రమే రెండు లేదా మూడు సెకన్ల పాటు అయ్యప్ప దర్శనం లభించేది. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు తోపులాట, పోలీసులు లాగేయడం వల్ల మండలకాలం కఠిన దీక్షను పూర్తిచేసుకుని, అంతదూరం వెళ్లినా.. దర్శనం సరిగ్గా జరగలేదనే బాధ భక్తుల్లో ఉండేది. కణిక్కవంచి నుంచి వెళ్లేప్పుడు 30 సెకన్ల నుంచి నిమిషం వరకు అలా అయ్యప్పను దర్శించుకుంటూ ముందుకు సాగే అవకాశాలుంటాయి. ప్రస్తుతం శబరిమలలో కుంభమాస పూజలు జరుగుతున్నాయి. ఈ నెల 21 వరకు ఆలయం తెరిచే ఉంటుంది. 17వ తేదీ నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జి తొలగింపు, ఇతర అభివృద్ధి పనులను చేపడతారు. హైకోర్టు కూడా కొత్త ప్రణాళికకు ఆమోదముద్ర వేసింది. హైకోర్టు నియమించిన శబరిమల ప్రత్యేక కమిషనర్ ఆర్.జయకృష్ణన్, ట్రావెన్‌కోర్ బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ పర్యవేక్షణలో పనులు ప్రారంభమవుతాయి. కాగా.. ప్రస్తుతం ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిని భక్తుల రద్దీ నేపథ్యంలో 1989లో ఏర్పాటు చేశారు.

అపహరణ.. అత్యాచారం.. అమ్మకం!

ఆగ్రా, ఫిబ్రవరి 15: ఆ బాలిక వయస్సు 17 ఏళ్లు. ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. రాజస్థాన్‌లోని మెయిన్‌పురి వాళ్ల స్వగ్రామం. గతేడాది మే 18న ఎప్పటిలాగే ఆమె ట్యూషన్ కోసం ఇంటి నుంచి బయల్దేరింది. మళ్లీ రాలేదు. వాళ్ల ఊరి పక్కన ఉండే ఓ వ్యక్తి ఆ బాలికను కిడ్నాప్ చేశాడు. ఇటావాకు తీసుకువెళ్లి డ్రగ్స్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత, బాలికను ఆగ్రాలోని రవి, బాబీ అనే వాళ్లకు అమ్మేశాడు. వాళ్లిద్దరూ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తరువాత ఆమెను అజ్మేర్ తీసుకువెళ్లి.. అక్కడ ఆశా జైన్ అనే మహిళకు అమ్మేశారు. ఆశా జైన్ సదరు బాలికను అజ్మేర్‌కే చెందిన విష్ణు మాలీ అనే వ్యక్తికి రూ.3.5లక్షలకు అమ్మేసింది. విష్ణు మాలీకి టీనేజ్ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కోరిక. ఎక్కడా సంబంధం సెట్ కాలేదు. అందుకే, అతడు ఆశా జైన్ దగ్గర బాలికను కొనుక్కొని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. అదే బాలికకు అదృష్టమైంది. టీనేజ్ అమ్మాయితో పెళ్లిపై ఎంతో మక్కువగా ఉన్న విష్ణు.. తన పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో విరివిగా పోస్టు చేశాడు. ఆ పోస్టులు మెయిన్‌పురి వాళ్ల కంటపడ్డాయి. అప్పటికే, బాలిక అదృశ్యంపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు వెంటనే అజ్మేర్ వెళ్లి విష్ణు మాలీని, కిడ్నాపర్ నీరజ్‌ను అరెస్టు చేశారు.

గొంతు కోసినా.. మేకులా బతికింది

- నెల రోజులు శ్రమించి బాలికకు ప్రాణం పోసిన ప్రభుత్వ వైద్యులు

భోపాల్, ఫిబ్రవరి 15: ఆడపిల్ల ఇంటికి భారమని పురిట్లోనే చంపేసే ఎన్నో ఘటనలు చూశాం. మధ్యప్రదేశ్‌లోని రాయ్‌గఢ్‌కు చెందిన ఓ తల్లి తన నెల వయస్సున్న పసిపాప గొంతు కోసింది. రక్తం ధారగా కారుతున్న పసిగుడ్డును ఆ తర్వాత చెత్త కుండీలో పడేసింది. ఈ పాపంలో ఆ కఠినాత్మురాలి తల్లి కూడా పాలు పంచుకొంది. జనవరి 11న రక్తం మడుగులో ఉన్న ఆ పాపను చూసిన కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమెను 100 కి.మీ.దూరంలోని భోపాల్‌లో ఉన్న కమలా నెహ్రూ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ సమయానికి ఆమె గొంతు నుంచి రక్తం కారుతునే ఉంది. ఆమెకు చుట్టిన బట్ట కూడా రక్తంతో తడిచి ఎర్రగా మారింది. సత్వర వైద్యం అందించిన వైద్యులు పలు ఆపరేషన్లు చేశారు. తెగిన శిరలు, ధమనులు, నరాలు, ఇతర భాగాలను తిరిగి అతికించి కాపాడారు. ప్రభుత్వం నిర్వహించే శరణాలయానికి అప్పగించారు. సీసీటీవీ కెమేరాల ఆధారంగా దర్యాప్తు జరిపిన పోలీసులు పసిపాప తల్లి, అమ్మమ్మలను గుర్తించి అరెస్టు చేశారు. కాగా, బాలికకు శరణాలయంలోనే 'పిహూ' అని నామకరణం చేశారు.


వివాహానికి హాజరైన మంత్రి నారా లోకేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు

జస్టిస్ రమేష్ కుమార్తె వివాహానికి హాజరైన మంత్రి లోకేశ్

భోగాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ కుమార్తె వివాహానికి రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం అమటాంరాయవలస సమీపంలోని రిసార్ట్సులో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం విశాఖకు వెనుతిరిగారు. లోకేశ్ వెంట శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ భరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఈ వివాహ కార్యక్రమానికి విజయనగరం జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల న్యాయాధికారులు హాజరయ్యారు.

లే నాన్నా లే!

- సూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం
- వెనుక చక్రాల కింద నలిగి చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి జితేంద్ర

గోకవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): లే నాన్నా లే.. ఇంటికెళ్లి పోదాం.. అంటూ ఓ తల్లి కుమారుడిని పట్టుకుని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. తన ఒక్కగానొక్క కుమారుడు స్కూలు నుంచి వస్తాడని ఎదురుచూస్తున్న తల్లి.. కుమారుడు విగతజీవిగా రోడ్డుపై పడి ఉండడం చూసి తట్టుకోలేకపోయింది. స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఒక చిన్నారి బలైపోయిన సంఘటన శనివారం తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం వెదురుపాక గ్రామంలో జరిగింది. కోరుకొండలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో వెదురపాక గ్రామానికి చెందిన కుంచే రాంబాబు కుమారుడు జితేంద్ర(5) ఎల్‌కేజీ చదువుతున్నాడు. ఉదయం బస్సులో పాఠశాలకు వెళ్లి సాయంత్రం అదే బస్సులో తిరిగి వచ్చాడు. బస్ దిగి కూతవేటు దూరంలో ఉన్న ఇంటికి వెళుతుండగా డ్రైవర్ బాలుడిని గమనించకుండా బస్‌ను వేగంగా పోనిచ్చాడు. దీంతో చిన్నారి ఆ స్కూల్ బస్ వెనుక చక్రం కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు వస్తాడని చూస్తున్న తల్లి ఎంతకీ రాకపోవడంతో బయటకు వెళ్లి చూసింది. తన కుమారుడు చక్రాల కిందపడి ఉండడాన్ని చూసి తట్టుకోలేకపోయింది. లేనాన్నా లే అంటూ రోడ్డుపై కూర్చుని గుండెలవిసేలా రోదించింది. రాంబాబుకు విషయం తెలియడంతో అక్కడకు చేరుకున్నాడు. దంపతులిద్దరూ కుమారుడి మృతదేహాన్ని ఒడిలో పెట్టుకుని బోరున విలపిస్తున్న తీరు చూపరులందరినీ కలిచివేసింది.

ఆకాశవాణి విశ్రాంత అనౌన్సర్ ఏబీ ఆనంద్ మృతి


ఏబీ ఆనంద్

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి విజయవాడ, విశాఖపట్నం కేంద్రాలలో అనౌన్సరుగా సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ పొందిన ఏబీ ఆనంద్ (86) శనివారం విజయవాడ మాచవరంలోని తన నివాసంలో గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య అరుణకుమారి, కుమారుడు ఎ.రమేష్, కుమార్తె సి.పద్మజ ఉన్నారు. ఆనంద్ అనౌన్సరుగానే కాక నటుడిగా, సంపాదకుడిగా, రచయితగా గుర్తింపు పొందారు. నాటక విభాగంలో నండూరి సుబ్బారావుతో కలిసి సిఫారసు, హరహరమహదేవ, భక్త శబరి, వివేకానంద, రారాజు వంటి ఎన్నో నాటికల్లో ముఖ్యపాత్రలు పోషించారు. ఎంతోమంది నటులను, రచయితలను ఆకాశవాణికి పరిచయం చేశారు. 80వ దశకంలో 'అభిరుచి' పేరుతో ఒక సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. 'మనజ్యోతి' మాసపత్రిక నడిపారు. ఏబీ ఆనంద్ మృతి పట్ల మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ప్రతినిధి కలిమిశ్రీ, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రతినిధి చలపాక ప్రకాష్ సంతాపం ప్రకటించారు.

రెడ్‌జోన్లలో 100% కోళ్లు ఖననం


పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరులో బర్డ్ ఫ్లూ ప్రభావిత కోళ్ల ఫారాల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ నాగరాణి

- బర్డ్ ఫ్లూ వచ్చినా వెల్లడించని యజమానులు
- వైరస్ ఉధృతికి అది కూడా కారణమే
- షెడ్లు మూడు నెలలు మూసి ఉంచాలని ఆదేశించాం
- పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్
- పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరులో కోళ్ల ఫారాల పరిశీలన

యలమంచిలి/తణుకు రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ బయటపడిన నాలుగు జిల్లాల్లోని రెడ్ జోన్ ప్రాంతాల్లో ఉన్న కోళ్లను నూరు శాతం ఖననం చేసినట్లు రాష్ట్ర పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ చెప్పారు. శనివారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరులో బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావిత కోళ్ల ఫారాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'కోళ్ల ఫారాల్లో అపరిశుభ్ర వాతావరణం పెద్ద సమస్యగా మారింది. ఈ వైరస్ మొదట బాదంపూడి కోళ్ల ఫారంలో బయటపడింది. దీనికి కారణం కోళ్ల రెట్టలే. ఫారాల్లోని వ్యర్థాల్లో ఈకలు, ఫీడ్ మిశ్రమం పేరుకుపోవడం, వాటిని తినేందుకు కొంగలు, ఇతర పక్షులు రావడం, వాటిని తిన్న పక్షులు ఇక్కడి నుంచి వేరే ఫారాలకు వెళ్లడంతో వైరస్ ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. వైరస్ గురించి ఫారాల్లో పనిచేసే కూలీలతోపాటు యజమానులు దాచిపెట్టడం కూడా వైరస్ ఉధృతికి కారణాలు. వైరస్ సోకిన షెడ్‌లను నూరు శాతం శానిటేషన్ చేసి, మూడు నెలలపాటు వాటిని మూసివేయాలని ఆదేశించాం. అధికారుల తనిఖీ తర్వాతనే వాటిలో కోళ్ల పెంపకం చేపట్టాలి. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అన్నిరకాల చర్యలు చేపట్టింది. రెడ్‌జోన్ మినహా మిగిలిన ప్రాంతాల ప్రజలు కోడి గుడ్లు, చికెన్ ఉడికించి తినవచ్చు. ఈ వైరస్ మనుషులకు సంక్రమించదు. ఏటా జనవరిలో కోళ్లలో ఈ వైరస్ కనిపించడం సర్వ సాధారణం. వాతావరణంలో వేడి పెరగడంతో వైరస్ తగ్గుముఖం పడుతుంది' అన్నారు. ఆయన వెంట రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదర్‌నాయుడు, కలెక్టర్ నాగరాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ ఉన్నారు.

ఊటాడలో 3 వేల కోళ్లు మృతి

పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం ఊటాడ గ్రామంలోని ఒక పౌల్ట్రీ ఫారంలో శనివారం మూడు వేల కోళ్లు ఆకస్మికంగా మృతి చెందాయి. వీటిని గొయ్యి తీసి, సున్నం వేసి పూడ్చిపెట్టారు. కోళ్ల ఫారాన్ని భీమవరం డిప్యూటీ డైరెక్టర్ జవార్ హుస్సేన్, ఏడీ జి.మల్లేశ్వరరావు, పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి పరిశీలించారు. గ్రామంలో చికెన్, కోడిగుడ్లు విక్రయించవద్దని వ్యాపారులకు నోటీసులు అందించారు. ఏలూరు ల్యాబ్ నుంచి వచ్చిన నిపుణులు కోళ్ల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం విజయవాడ, భోపాల్‌లోని ల్యాబ్‌లకు పంపించనున్నారు. కాగా, బాదంపూడికి కిలోమీటరు దూరంలో ఉన్న పెదతాడేపల్లి గ్రామంలోని 21 వేల కోళ్లను ఆదివారం ఖననం చేయనున్నారు.

ఇంటర్ నెట్ చూసి దొంగనోట్లు అచ్చేశాడు!

చీరల అద్దకంలో నష్టాలతో నకిలీ కరెన్సీ ముద్రణ

- రూ.కోటి విలువైన నోట్లు స్వాధీనం
- ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన 'తూర్పు' పోలీసులు


దొంగనోట్ల ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చేస్తున్న పనిలో నష్టాలు రావడంతో దొంగ నోట్ల తయారీ ప్రారంభించాడో వ్యక్తి. చిన్న ఫిర్యాదుతో కూపీ లాగిన తూర్పు గోదావరి జిల్లా పోలీసులు ముఠా సభ్యులను, భారీగా దొంగనోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ నరసింహ కిషోర్ శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. పాత గుంటూరులోని బాలాజీనగర్‌కి చెందిన కర్రి మణికుమార్‌కి చీరలకు డిజైన్ల అద్దకంలో అనుభవం ఉంది. కరోనా అనంతరం ఈ రంగంలో నష్టాలు రావడంతో దొంగ కరెన్సీ నోట్ల తయారీ వైపు దృష్టి మళ్లడంతో ఇంటర్‌నెట్‌లోని వీడియోలు చూశాడు. అదే ప్రాంతంలోని దోనెపూడి మధుతో కలిసి ప్రింటరు, లామినేషన్ మిషన్ తదితర పరికరాలను కొనుగోలు చేసి నోట్లు ప్రింట్ చేయడం మొదలు పెట్టాడు. అనుమానం రాకుండా నోట్ల కట్టలకు చుట్టడానికి ఎస్‌బీఐ పేపర్ సీల్ టేపులనూ తయారు చేశాడు. నోట్లపై సెక్యూరిటీ థ్రెడ్ కోసం సిల్వర్ ఫాయిల్స్‌ని తమిళనాడులో కొనుగోలు చేశాడు. ఈ నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీన డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గన్నవరం మండలం బాలాంతం గ్రామానికి చెందిన చిట్టూరి హరిబాబు తన వ్యాను పాడైందని మరమ్మతు చేయాలని తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన పల్లి రాంబాబు వద్దకు తీసుకెళ్లాడు. అడ్వాన్సుగా నాలుగు రూ.500 నోట్లు ఇచ్చాడు. 3న స్పేర్ పార్టుల కోసం వెళ్లిన రాంబాబు ఆ నోట్లు ఇవ్వగా అవి దొంగ నోట్లు అని తేలింది. దీంతో బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్పీ నరసింహ కిషోర్.. ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో కర్రి మణికుమార్, దోనెపూడి మధు ఓ కుటీర పరిశ్రమలా గుంటూరులో దొంగనోట్లు తయారు చేస్తున్నారని నిర్ధారించుకున్నారు. చిట్టూరి హరిబాబుతో పాటు కాకినాడ జిల్లా కాజులూరుకు చెందిన శీలం కేదారేశ్వర పరిపూర్ణ శ్రీనివాస్, అదే గ్రామానికి చెందిన చీకట్ల ఏడుకొండలు ఆ దొంగ నోట్లను చలామణీ చేస్తున్నారని తేలింది. రూ.లక్ష నగదుకు మూడు లక్షల దొంగ నోట్లు ఇస్తారని.. ప్లాట్‌ఫాంపై చిరు వ్యాపారులు, రద్దీగా ఉండే వ్యాపార దుకాణాలు, సంతలు వంటి చోట్ల వీరు ఈ నోట్లు మార్పిడి చేసారు. ఐదుగురు నిందితులనూ అరెస్టు చేసి రూ.1.6 కోట్ల విలువైన దొంగ నోట్లను, రూ.9,680 నగదు, కారు, 5 సెల్‌ఫోన్లు, తయారీకి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు.


ఆలయం ముందు గ్యాలరీల క్రమబద్ధీకరణ పనులకు సర్వే చేస్తున్న సిబ్బంది

మాడవీధుల్లో గ్యాలరీలపై స్లైడింగ్ రూఫ్!

- శ్రీవారి భక్తులకు ఎండ, వాన నుంచి రక్షణ
- గ్యాలరీల క్రమబద్ధీకరణకు సర్వే ప్రారంభం

తిరుమల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తిరుమల మాడవీధుల్లోని గ్యాలరీలకు స్లైడింగ్ రూఫ్ ఏర్పాటు చేసే యోచనలో టీటీడీ ఉంది. వీటిలో కూర్చుని వాహన సేవలను తిలకించే భక్తులు ఎండ, వానకు ఇబ్బంది పడకుండా ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ముందుగా గ్యాలరీలన్నింటినీ ఒక క్రమపద్ధతిలో ఉంచే పనుల కోసం శనివారం సర్వే మొదలు పెట్టింది. ఏటా రథసప్తమికి మాడవీధుల్లోని గ్యాలరీలపై టీటీడీ తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి మంచి ఫలితాలు వస్తున్న క్రమంలో శాశ్వతంగా షెడ్లను ఏర్పాటు చేయాలని టీటీడీ భావిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆగమ సలహామండలి సభ్యుల అంగీకారం కూడా లభించింది. అయితే వర్షపు నీరు స్వామి విహరించే మాడవీధుల్లో కాకుండా వెనుక భాగంలో పడేలా ఏర్పాట్లు చేయాలని అర్చకులు సూచించారు. ఈక్రమంలో రిట్రాక్టబుల్ స్లైడింగ్ రూఫ్ ఏర్పాటుపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే శ్రీవారి ఆలయంలోని పడికావలిలో రిట్రాక్టబుల్ రూఫ్‌ను ఏర్పాటు చేసి వినియోగిస్తున్న విషయం తెలిసిందే. స్లైడింగ్ రూఫ్ ఏర్పాటు నేపథ్యంలో.. ముందుగా గ్యాలరీల క్రమబద్ధీకరణపై టీటీడీ దృష్టి సారించింది. అధిక సంఖ్యలో భక్తులు గ్యాలరీలో సౌకర్యవంతంగా కూర్చుని వాహనసేవలను వీక్షించేలా ప్రణాళికలు రూపొందించుకుంటోంది. 20 ఏళ్ల కిందటి వరకు 20 వేల నుంచి 30 వేల మంది భక్తులే మాడవీధుల్లో కూర్చుని వాహనసేవలు వీక్షించేవారు. 1983 నుంచి దశలవారీగా మాడవీధులను విస్తరించారు. 2003-04లో ఆలయం చుట్టూ ఉన్న ఇళ్లు, మఠాలు, చిన్నచిన్న ఆలయాలు, ఆలయం ముందున్న వేయికాళ్ల మండపాన్ని తొలగించి నాలుగు మాడవీధుల్లో 182 గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటిలో దాదాపు 1.75 లక్షల మంది భక్తులు కూర్చుని వాహనసేవలు వీక్షించే అవకాశం ఉంది. ప్రస్తుతం మరింతగా భక్తులు పెరగడం, ఉత్సవాల సమయంలో చాలా మంది మాడవీధులకు బయటే ఉండిపోవడం, పైగా గ్యాలరీలు ఓ క్రమపద్ధతిలో లేకపోవడంతో అధికారులు గ్యాలరీల క్రమబద్ధీకరణ, అభివృద్ధిపై దృష్టిపెట్టారు. అన్నిటినీ ఓ క్రమపద్ధతిలో మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దడంతో పాటు ఇంకా అధిక సంఖ్యలో భక్తులు కూర్చొనేలా గ్యాలరీలను విస్తరించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనికి సంబంధించిన సర్వే పనులను టీటీడీ ఇంజినీరింగ్ విభాగం శనివారం ప్రారంభించింది. ఈ సర్వే పనులు పూర్తికాగానే తదుపరి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు.

అప్పన్నను దర్శించుకున్న జస్టిస్ లక్ష్మణరావు


జస్టిస్ లక్ష్మణరావుకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ వీబీ రమణమూర్తి

సింహాచలం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు శనివారం దర్శించుకున్నారు. అంతరాలయంలో ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత వేదపండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా ఏఈఓ వీబీ రమణమూర్తి శాలువాతో సత్కరించి స్వామి వారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.


క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, క్రీడల కన్వీనర్ రాజకుమార్

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ప్రారంభం

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడలో శనివారం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జిల్లా క్రీడా మైదానంలో క్రీడలను ప్రారంభించారు. హాకీ టోర్నమెంట్‌లో 18 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 44 జట్లు పాల్గొన్నాయి. దీనిలో పురుషుల జట్లతోపాటు మహిళల జట్లు కూడా ఉన్నాయి. శనివారం నుంచి ఈ నెల 28వతేదీ వరకు ఈ టోర్నమెంట్ జరుగుతుంది. తొలిరోజు మ్యాచ్-1లో హిమాచల్ సెక్టార్ టీమ్, హరియాణా సెక్టార్ టీమ్‌లు తలపడగా 14-0 స్కోర్‌తో హరియాణా టీమ్ గెలుపొందింది. మ్యాచ్-2లో కర్ణాటక సెక్టార్ టీమ్, పుదిచ్చేరి సెక్టార్ టీమ్‌లు తలపడగా 10-1 స్కోరుతో పుదిచ్చేరి టీమ్ గెలుపొందింది. కార్యక్రమంలో అర్జునా అవార్డు గ్రహీతలు మహ్మద్ రియాజ్, ముకేష్‌కుమార్‌ను.. జిమ్నాస్టిక్స్ బంగారు పతకం విజేత ఎస్‌ప యాసన్ సత్కరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

నేతలు... నేల విడిచి సాములు!

'ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకొని ఇప్పుడు గోసపడుతున్నారు'.. అని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలందరూ తన పాలనకోసం చూస్తున్నారని కూడా ఆయన చెప్పుకొన్నారు. 'బటన్లు నొక్కడం ద్వారా ప్రజలకు డబ్బు పంచాను. అయినా నన్ను ఎందుకు ఓడించారో అర్థం కావడం లేదు. ఈవీఎంల ద్వారా ఏదో గోల్‌మాల్ చేసి ఉంటారు' అని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ఫలితాల అనంతరం ఎనిమిది నెలల క్రితం వ్యాఖ్యానించారు. "ప్రజలకు ఏం తక్కువ చేశాను. అయినా మరీ 23 సీట్లు ఇవ్వడం ఏమిటి? ఈవీఎంలను మేనేజ్ చేసి ఉంటారు" అని ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2019లో ఓటమి అనంతరం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను బట్టి అధికారంలో ఉన్నప్పుడు తాము ఏ తప్పూ చేయలేదని, ప్రజలే తమను ఓడించి తప్పు చేశారని ప్రాంతీయ పార్టీలకు నాయకత్వం వహిస్తున్న ఈ ముగ్గురు నాయకులూ అభి

> ఒకప్పుడు మన దేశంలో లైసెన్స్‌రాజ్ ఉండేది. పరిపాలనా సంస్కరణల వల్ల అది క్రమంగా పోయింది కానీ... ఇప్పటికీ ప్రభుత్వాల వద్ద ఉండే విచక్షణాధికారాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా చట్టబద్ధంగా ఉండే వ్యవహారాల్లో కూడా ప్రజలకు ఉపశమనం లభించనప్పుడు అది గుడ్ గవర్నెన్స్ ఎలా అవుతుంది? రెవెన్యూ శాఖలో ఈ సమస్య అధికంగా ఉంది. వారసత్వంగా లభించే భూములను మ్యుటేషన్ చేయించుకోవాలన్నా లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి ఎందుకుంది? ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు హ్యాపీగా ఉండాలంటే ఏం చేయాలో గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటే ఎవరికీ ఏ ఒత్తిడీ ఉండదు. అలా జరిగినప్పుడు ప్రజల నాడి తెలుసుకోవడానికి ప్రశాంత్ కిశోర్ వంటి వారి అవసరం ఉండదు. మంత్రి లోకేశ్ ఇటీవల ఢిల్లీ వెళ్లి మరీ ప్రశాంత్ కిశోర్‌ను కలిశారు. ఆ సమయమేదో పార్టీ కార్యకర్తలకు కేటాయించి ఉంటే అద్భుతమైన, నిఖార్సయిన ఫీడ్ బ్యాక్ లభించి ఉండేది కదా!

ప్రాయపడ్డారని అర్థమవుతోంది. ఇది కచ్చితంగా ఆత్మవంచనే అవుతుంది. ప్రభుత్వాలు మారాయంటే అందుకు కారణం ఉండకుండా ఉండదు. అధికారంలోకి వచ్చినవారు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల అధినేతలు తమ చుట్టూ ఇనుప తెరలను ఏర్పాటు చేసుకొని ప్రజల మనోభావాలను తెలుసుకొనే ప్రయత్నం చేయరు. ఎవరెవరితోనో సర్వేలు చేయించుకొని అంతా బాగుందని తమను తాము మోసం చేసుకుంటుంటారు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రజలే తప్పు చేశారు అన్నట్టుగా వ్యాఖ్యానించడం పరిపాటిగా మారుతోంది. ఎన్నికల్లో ఓటమికి కారణాలేమిటో తెలుసుకొనే ప్రయత్నం ఎందుకు చేయరో తెలియదు. కారణాలు తెలిసినా వాటిని అంగీకరించడానికి సిద్ధపడకపోవడం వింతగానూ ఉంటుంది.

'వ్యూహాత్మక' తప్పిదాలు

2019లో చంద్రబాబు ఓడిపోవడానికి కానీ... ఆ తర్వాత కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి ఓటమికిగానీ స్పష్టమైన కారణాలు ఉన్నాయి. ఆ కారణాలు ప్రజలకు తెలుసు. 2019కి ముందు అధికారంలో ఉండిన చంద్రబాబు నేల విడిచి సాము చేశారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని పట్టించుకోలేదు. రాజకీయాన్ని విస్మరించి ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో ఘోరంగా విఫలమయ్యారు. ఈ విషయాలను తెలుగుదేశం నాయకులు అప్పట్లో బాహాటంగానే చెప్పేవారు. అయినా వాటిని అంగీకరించడానికి అప్పట్లో చంద్రబాబు సిద్ధపడలేదు. కేసీఆర్ విషయంలో కూడా ఓటమికి కారణాలు స్పష్టంగా ఉన్నాయి. అధికారం మత్తు తలకెక్కి ఆయన ప్రజలకు దూరమయ్యారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్న ఎమ్మెల్యేలను సైతం మార్చకుండా ఎన్నికల్లో వారికే మళ్లీ టికెట్లు ఇచ్చారు. కేసీఆర్ అండ్ కోకు అహం తలకెక్కిందనే అభిప్రాయానికి ప్రజలు వచ్చారు. ఫలితంగా తెలంగాణ ఉద్యమ సమయంలో నెత్తిన పెట్టుకున్న ప్రజలే ఆయనను నేలకేసి కొట్టారు. అంతేగానీ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నచ్చి, అత్యాశకు పోయి కేసీఆర్‌ను ఓడించలేదు. ఇక జగన్మోహన్‌రెడ్డి విషయం అందరికీ తెలిసిందే. బటన్లు నొక్కి డబ్బులు పంచితే చాలు– తాను ఏమి చేసినా ప్రజలు పట్టించుకోరని జగన్‌రెడ్డి భావించారు. ప్రభుత్వంలో అరాచకం ప్రబలి ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. ప్రజల బాగోగులను విస్మరించి కక్ష సాధింపులకు ప్రాధాన్యతను ఇవ్వడంతో ఎన్నికలలో ఆయనను 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారు. చంద్రబాబు మరికొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉండివుంటే జగన్‌రెడ్డికి ఐదారు సీట్లకు మించి వచ్చివుండేవి కావు. ప్రజల్లో తమ పట్ల వ్యతిరేకత ఏర్పడిన విషయాన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలు ఎందుకు తెలుసుకోరో అర్థం కాదు. ఎన్నికల వ్యూహకర్తలను నియమించుకొని వందల కోట్లు తగలేసే బదులు పార్టీ కార్యకర్తల మనోభావాలు తెలుసుకొనే ప్రయత్నం చేస్తే తాము ఎక్కడ ఉన్నామో తెలిసిపోతుంది. సదరు వ్యూహకర్తలే తమను అధికారంలోకి తీసుకొస్తారని గుడ్డిగా నమ్ముతారు. 2019లో ఐ-ప్యాక్‌ను నమ్ముకున్న జగన్‌రెడ్డి 2024లో కూడా ఐ-ప్యాక్‌నే నమ్ముకొని మునిగిపోయారు. ఐ-ప్యాక్ వంటి సంస్థ తమకు దొరకనందున 2019లో ఓడిపోయామని భావించిన చంద్రబాబు 2024లో రాబిన్ శర్మ అనే ఆయనను నమ్ముకున్నారు. రాబిన్ శర్మ సేవలు అందించి ఉండకపోయినా కూటమి గెలిచేది. ఇక కేసీఆర్ ఎవరెవరితోనో సర్వేలు చేయించుకొని సంతృప్తిపడుతుండేవారు. ఆ సర్వే రిపోర్టులు చూపించి అంతా బాగుందని పార్టీ నాయకుల నోళ్లు మూయించేవారు. కర్ణాటకలో బీజేపీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ రాష్ట్రంతో సంబంధం లేని వాళ్లు కూడా ముందే చెప్పారు. అయినా, సునీల్ కనుగోలు వ్యూహం వల్లే తాము గెలిచామని కాంగ్రెస్ పార్టీ నమ్మింది. అదే నమ్మకంతో తెలంగాణలో కూడా కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చే బాధ్యతను ఆ పార్టీ పెద్దలు ఆయనకు అప్పగించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 50 సీట్ల వరకు రావచ్చునని ఆయన లెక్కలు వేసుకున్నారు కానీ, కాంగ్రెస్ పార్టీకి 70 స్థానాల వరకు లభించే అవకాశం ఉందని గుర్తించలేకపోయారు. అభ్యర్థుల ఎంపికలో తప్పులు చేసి ఉండకపోతే కాంగ్రెస్ పార్టీకి 70 స్థానాలు దాటి ఉండేవి. హరియాణా, మహారాష్ట్రలో ఈ సునీల్ కనుగోలు వ్యూహం ఎందుకు పనిచేయలేదో? ఎన్నికల వ్యూహాలు అవసరమేగానీ, అవి మాత్రమే ఎన్నికల్లో విజయాలను తెచ్చిపెట్టవు. ఎన్నికలు ఏవైనా ప్రజలు తప్పు చేయరు. నాయకులే తాము చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తారు. అయితే ఆ విషయం అంగీకరించే ధైర్యం కొరవడి ప్రజలే తప్పు చేశారని ఆత్మవంచన చేసుకుంటూ ఉంటారు.

ప్రస్తుత పాలకుల పరిస్థితి..

కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి ఓటమికి కారణాలు తెలిసినవే కనుక చర్విత చరణం అవసరం లేదు. ఇప్పుడు వారి స్థానంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి విషయానికి వద్దాం! 2019కి ముందు చంద్రబాబు పాలనలోని వాసనలు ఇప్పుడు కూడా వస్తున్నాయన్నది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అభిప్రాయంగా ఉంది. అప్పట్లో రియల్ టైం గవర్నెన్స్, ఐవీఆర్ఎస్ సర్వే అంటూ ఆయన జపం చేసేవారు. తన పాలన పట్ల 70 శాతానికి పైగా ప్రజలు సంతృప్తితో ఉన్నారని చంద్రబాబు చెప్పుకొనేవారు. ఎన్నికల్లో మాత్రం 60 శాతం ప్రజలు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. హ్యాపీ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అంటూ కబుర్లు చెప్పేవారు. కోటి మంది జనాభా కూడా లేని దేశాలలోని పరిస్థితులను వివరించి ఆంధ్రప్రదేశ్ కూడా అలా ఉండాలని కోరుకునేవారు. దోమల నిర్మూలన అంటూ ఒక పెద్ద కార్యక్రమం నిర్వహించారు. ఇవన్నీ ప్రజలను మెప్పించలేకపోయాయి. తిన్నామా, పడుకున్నామా, లేచామా అని భావించే సమాజంలో ఉండి కూడా 'హ్యాపీ ఇండెక్స్' వంటి వాటి గురించి మాట్లాడితే ప్రజల చెవికెక్కుతుందా? గత అనుభవాలను విస్మరించి ఇప్పుడు మళ్లీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అని కలవరిస్తున్నారు. ఏఐ అంటే ఏమిటో 90 శాతం ప్రజలకు తెలియదు. వాటివల్ల కలిగే ప్రయోజనాలేమిటో అంతకంటే తెలియదు. 90 శాతానికి పైగా ప్రజలకు తెలియని అంశాన్ని పదేపదే వల్లెవేయడం వల్ల ప్రయోజనం ఏమిటో ఆయనకే తెలియాలి. ప్రభుత్వ ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి సంతోషంగా ఉండేందుకు ప్రతి ఆదివారం అమలు జరిగేలా ఒక కార్యక్రమం రూపొందిస్తామని చంద్రబాబు తాజాగా ప్రకటించారు. ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఇప్పుడు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. కొంతమంది మినహా మెజారిటీ ప్రభుత్వ ఉద్యోగులపై పని భారం కూడా అధికంగా ఉండటం లేదు. ఆదివారం సెలవురోజున కుటుంబ సభ్యులతో సంతోషంగా ఎలా గడపాలో ప్రభుత్వ ఉద్యోగులకు తెలియదా? అందుకోసం ఒక కార్యక్రమాన్ని రూపొందించవలసిన అవసరం ముఖ్యమంత్రికి ఏమిటి? చంద్రబాబు పాలనలో సమీక్షల వల్లనే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అధిక ఒత్తిడికి గురవుతారన్న విషయం అందరికీ తెలిసిందే. ఆయన ఈ సమీక్షలు తగ్గించుకుంటే ఎవరికీ ఏ ఒత్తిడీ ఉండదు. ఉదాహరణకు, ప్రభుత్వ కార్యదర్శులతో చంద్రబాబు ఇటీవలే ఒక సమీక్ష నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ సమీక్ష రాత్రి వరకు సాగింది. దాదాపు పన్నెండు గంటల



> తిన్నామా, పడుకున్నామా, లేచామా అని భావించే సమాజంలో ఉండి కూడా 'హ్యాపీ ఇండెక్స్' వంటి వాటి గురించి మాట్లాడితే ప్రజల చెవికెక్కుతుందా? గత అనుభవాలను విస్మరించి ఇప్పుడు మళ్లీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అని కలవరిస్తున్నారు. ఏఐ అంటే ఏమిటో 90 శాతం ప్రజలకు తెలియదు. వాటివల్ల కలిగే ప్రయోజనాలేమిటో అంతకంటే తెలియదు. 90 శాతానికి పైగా ప్రజలకు తెలియని అంశాన్ని పదేపదే వల్లెవేయడం వల్ల ప్రయోజనం ఏమిటో ఆయనకే తెలియాలి. ప్రభుత్వ ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి సంతోషంగా ఉండేందుకు ప్రతి ఆదివారం అమలు జరిగేలా ఒక కార్యక్రమం రూపొందిస్తామని చంద్రబాబు తాజాగా ప్రకటించారు. ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఇప్పుడు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. కొంతమంది మినహా మెజారిటీ ప్రభుత్వ ఉద్యోగులపై పని భారం కూడా అధికంగా ఉండటం లేదు. ఆదివారం సెలవురోజున కుటుంబ సభ్యులతో సంతోషంగా ఎలా గడపాలో ప్రభుత్వ ఉద్యోగులకు తెలియదా? అందుకోసం ఒక కార్యక్రమాన్ని రూపొందించవలసిన అవసరం ముఖ్యమంత్రికి ఏమిటి?

పాటు సాగిన ఈ సమీక్షలో సాధించింది ఏమిటో తెలియదు. 2019కి ముందు కూడా ఇలాంటి సమీక్షలు జరిగినప్పుడు పలువురు అధికారులు రక్తంలో చక్కెర శాతం తగ్గి ఇబ్బంది పడటం చూశాం. ఇటువంటి సమీక్షలకు సీనియర్ అధికారులు కోటూ బూటూ వేసుకొని వస్తుంటారు. ప్రొటోకాల్ ప్రకారం అలా చేయాలేమో తెలియదు. నిజానికి టై కట్టుకొని, కోటు వేసుకొని గంటలకొద్దీ సమీక్షల్లో పాల్గొనడాన్ని మించిన శిక్ష ఉండదు. అధికారులు సమీక్షలో పాల్గొంటే ఉద్యోగులు కార్యాలయాలను వదిలి వెళ్లలేరు కదా? ప్రభుత్వాలు సరైన ప్రాధాన్యాలను నిర్దేశించుకొని సత్వర నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగులపై ఒత్తిడి ఉండదు. అటు ప్రజలు కూడా సంతోషంగా ఉంటారు. పలు దేశాలలో ఉద్యోగులు పని వేళల తర్వాత ఫోన్లో కూడా అందుబాటులో ఉండరు. ఇందుకు ఆయా ప్రభుత్వాలు అనుమతిస్తాయి. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సాయంత్రం 5 గంటల తర్వాత ప్రభుత్వ కార్యాలయాల్లో లైట్లు కూడా వెలిగేవి కావు. ఉద్యోగులు ఇళ్లకు వెళ్లిపోయి కుటుంబ సభ్యులతో గడిపేవారు. అయినా ప్రభుత్వ అధికారులు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి కారణాలు వేరే ఉన్నాయి. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడం వంటి కారణాల వల్ల వారిలో వ్యతిరేకత ఏర్పడింది. ఉద్యోగుల కోసం హ్యాపీ సండే ప్రోగ్రాంను రూపొందిస్తామని చంద్రబాబు ప్రకటించగానే సామాన్యుడి పేరిట ఒక ప్రభుత్వ ఉద్యోగి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు ఆలోచింపజేసేలా ఉంది. "సెలవు దినాల్లో డ్యూటీ చేయనవసరం లేదని మీరు అంటున్నారు. కలెక్టర్లు, ఆపై స్థాయి అధికారులు ఆదివారాల్లో కూడా పనిచేయకపోతే మెమోలు ఇస్తామంటున్నారు. ఎప్పుడో సంగతి ఎందుకు? పంచాయతీరాజ్ శాఖ యాప్ అప్‌డేట్ చేయకపోతే మామూలుగా ఉండదని ఈ మధ్య పంచాయతీ రాజ్ ఉద్యోగులకు మెసేజ్ పెట్టారు. అయ్యా చంద్రబాబు నాయుడుగారూ! ప్రజల్లో సంతృప్తి స్థాయి, అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఐవీఆర్ సిస్టమ్‌లో కాల్ చేసి ఎలా తెలుసుకుంటున్నారో... అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కాల్ చేసి వాళ్ల సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకొనే ప్రయత్నం చేయండి సార్. విద్యా శాఖలో ఒకే యాప్ తీసుకొస్తామని మంత్రి లోకేశ్‌గారు చెప్పాక ఉపాధ్యాయులందరూ సంతోషంగా ఉన్నారు. అలాగే పంచాయతీరాజ్‌లో కూడా చేయండి. వర్క్ ఫ్రం హోంలాగా వర్క్ ఫ్రం యాప్‌గా కాకుండా, పనిచేయకుండానే చేసినట్టు నమోదు చేసే 90కి పైగా యాప్‌లను వీలైనంత వరకు కుదించి... పవర్ పాయింట్లు, ఎక్సెల్ షీట్లపై పనిచేయించుకోవడం కాకుండా క్షేత్ర స్థాయిలో నిజంగా పని జరిగేలా చూడాలని విన్నపం".. ఇదీ ఆ ఉద్యోగి పోస్టు సారాంశం. వాస్తవ పరిస్థితికి ఈ పోస్టు అద్దం పడుతోంది కదా! పవర్ పాయింట్ ప్రజంటేషన్ అనే పీపీటీ వల్ల ఆత్మవంచనే మిగులుతుంది. ముఖ్యమంత్రిని సంతృప్తిపరచడానికే ఈ పీపీటీలను అధికారులు రూపొందిస్తారు. చంద్రబాబుకు టెక్నాలజీ అంటే మక్కువ కనుక ఆ దిశగానే పీపీటీలను రూపొందిస్తారు. పన్నెండు గంటల పాటు సాగిన సమీక్షా సమావేశం వల్ల సత్ఫలితాలు వచ్చాయని ఇటు ప్రజలు కానీ, అటు అధికారులు, ఉద్యోగులు చెప్పే పరిస్థితి ఉందా?

ఎక్కడుంది సంతోషం?

ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేరే వ్యాపకం ఏమీ ఉండదు. ఆయనకు వేరే ధ్యాస కూడా ఉండదు. ఇంటి వ్యవహారాలను, వ్యాపారాలను ఆయన కుటుంబ సభ్యులు చూసుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులందరికీ ఈ వెసులుబాటు ఉండదు. కుటుంబ బాధ్యతలు వారికి ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులకు చట్ట ప్రకారం చెల్లించాల్సినవి సకాలంలో చెల్లిస్తూ, వారిపై అదనపు పని భారం వేయకపోతే వారు సంతోషంగానే ఉంటారు. అందుకోసం ప్రత్యేక కార్యక్రమ అవసరం ఉండదు. ఇక ప్రజల విషయానికి వస్తే, వాళ్లు సంతోషంగా ఉండాలంటే ప్రభుత్వం నుంచి వేధింపులు ఉండకుండా ఉంటే చాలు. ఒకప్పుడు మన దేశంలో లైసెన్స్‌రాజ్ ఉండేది. పరిపాలనా సంస్కరణల వల్ల అది క్రమంగా పోయింది కానీ.. ఇప్పటికీ ప్రభుత్వాల వద్ద ఉండే విచక్షణాధికారాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా చట్టబద్ధంగా ఉండే వ్యవహారాల్లో కూడా ప్రజలకు ఉపశమనం లభించనప్పుడు అది గుడ్ గవర్నెన్స్ ఎలా అవుతుంది? రెవెన్యూ శాఖలో ఈ సమస్య అధికంగా ఉంది. వారసత్వంగా లభించే భూములను మ్యుటేషన్ చేయించుకోవాలన్నా లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి ఎందుకుంది? ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు హ్యాపీగా ఉండాలంటే ఏం చేయాలో గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటే ఎవరికీ ఏ ఒత్తిడీ ఉండదు. అలా జరిగినప్పుడు ప్రజల నాడి తెలుసుకోవడానికి ప్రశాంత్ కిశోర్ వంటి వారి అవసరం ఉండదు. మంత్రి లోకేశ్ ఇటీవల ఢిల్లీ వెళ్లి మరీ ప్రశాంత్ కిశోర్‌ను కలిశారు. ఒకటి రెండు రోజులు ఢిల్లీలో గడిపారు. ఆ సమయమేదో పార్టీ కార్యకర్తలకు కేటాయించి ఉంటే అద్భుతమైన, నిఖార్సయిన ఫీడ్ బ్యాక్ లభించి ఉండేది కదా! చంద్రబాబు అండ్ కో ఇప్పటికైనా ఆత్మ విమర్శ చేసుకొని నేల విడిచి సాము చేసే విధానానికి స్వస్తి చెప్పడం మంచిది. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు ఇవేమీ తెలియవా?

> ప్రజల్లో తమ పట్ల వ్యతిరేకత ఏర్పడిన విషయాన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలు ఎందుకు తెలుసుకోరో అర్థం కాదు. ఎన్నికల వ్యూహకర్తలను నియమించుకొని వందల కోట్లు తగలేసే బదులు పార్టీ కార్యకర్తల మనోభావాలు తెలుసుకొనే ప్రయత్నం చేస్తే తాము ఎక్కడ ఉన్నామో తెలిసిపోతుంది.

రేవంత్ పాలన... మంచీ చెడులు!

ఇప్పుడు తెలంగాణలో నెలకొన్న పరిస్థితుల విషయానికి వద్దాం! "కాంగ్రెస్ పాలనను ఏడాదిగా గమనిస్తున్నాను. నేను కొడితే మామూలుగా ఉండదు. గట్టిగా కొడతాను" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవలే రేవంత్‌రెడ్డి సర్కార్‌ను హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి కూడా ఇందుకు తగు విధంగానే స్పందించారు. 'నువ్వు గట్టిగా కొట్టేది ఏమిటి? ఫుల్లా – హాఫా?' అని వేరే అర్థంలో సెటైర్ వేశారు. ఈ సెటైర్లు వినడానికి బాగుంటాయి కానీ ప్రజలను మాత్రం సంతృప్తిపరచవు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు అవుతోంది. కేసీఆర్ అన్నారని కాదుగానీ ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి మెల్లగా వ్యాపిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ముద్ర పాలనపై ఇంకా పడలేదు. కేసీఆర్ పాలనలో ఏం జరిగింది? అని చెప్పడానికి కొన్ని మంచి పనులు ఉన్నాయి. అలాగే కొన్ని చెడ్డ పనులు కూడా ఉన్నాయి. కానీ, కాంగ్రెస్ 15 నెలల పాలనలో ఏం జరిగిందో చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. రాజకీయ చతురత, చలోక్తులు ప్రజల కడుపు నింపవు. సమగ్ర కసరత్తు చేయకుండా కొన్ని కార్యక్రమాలను హడావిడిగా అమలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి నష్టం జరుగుతోంది. రైతు రుణ మాఫీ ఈ కోవలోకే వస్తుంది. దాదాపు రూ.25వేల కోట్ల మేర రుణ మాఫీ చేసినా ఆశించిన రాజకీయ ప్రయోజనం నెరవేరలేదు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేసింది. ఈ ప్రయోజనం పొందిన రైతులను మినహాయించి మిగతా వారికి రుణ మాఫీ చేసి ఉంటే ప్రభుత్వానికి పదివేల కోట్లకు పైగా ఆదా అయ్యేది. ఈ డబ్బుతో రైతు బంధు అమలు చేసి ఉండవచ్చు. ఇలాంటి ఫీడ్ బ్యాక్ తీసుకోకపోవడం వల్ల రైతు రుణ మాఫీ చేసి కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు. రైతులు కూడా సంతృప్తిగా లేరు. రేషన్ కార్డుల పంపిణీ వ్యవహారంలో, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు స్వీకరణలో కూడా సరైన కసరత్తు జరగలేదు. గతంలో దారిద్ర్య రేఖకు ఎగువన, దిగువన ఉన్న వారికి విడివిడిగా రేషన్ కార్డులు ఇచ్చేవారు. ఇప్పుడు అందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇస్తామన్న అభిప్రాయం కలిగించారు. దీంతో దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారు కూడా తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని నిర్మించాలనే విషయంలో కూడా శాస్త్రీయత పాటించడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకోసం నిజమైన అర్హులు ఆరుగురు మాత్రమే ఉండగా 60కి పైగా దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రమంతటా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటే రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదు. అలాగని కొందరికి మాత్రమే ఇళ్లు కేటాయిస్తే మిగిలిన వారిలో అసంతృప్తి నెలకొంటుంది. అన్ని పథకాలనూ ఒకేసారి ప్రారంభించాలనుకుంటే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నలుగురైదుగురు మంత్రులతోనే సంప్రదింపులు చేస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారు. మంత్రులతో ఎప్పుడైనా మాట్లాడవచ్చు! శాసనసభ్యులు, కింది స్థాయి పార్టీ నాయకుల అభిప్రాయాలు తీసుకుంటే ప్రభుత్వానికి ఉపయోగపడతాయి. మొత్తం మీద రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆశించిన మేర పనిచేయడం లేదన్న అభిప్రాయం

> యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan వేయండి

వ్యాపిస్తోంది. ఈ వ్యతిరేక భావనను మొగ్గలోనే తొలగించని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్రతిష్ఠపాలవుతుంది. అవినీతి విషయంలో కూడా ప్రభుత్వంపై విమర్శలు మొదలయ్యాయి. కొంత మంది మంత్రులు అపరిమిత అధికారాలను అనుభవిస్తుండగా, ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యం లేకుండా పోతోందని శాసనసభ్యులు వాపోతున్నారు. ఎమ్మెల్యేలలో నెలకొన్న ఈ భావన అసంతృప్తికి దారి తీయకముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేల్కొనడం మంచిది. మొత్తంగా చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా బాలారిష్టాలను అధిగమించలేదన్న భావన విస్తృతంగా ఉంది. ఈ కారణంగా ఎన్నికల ఫలితాల తర్వాత డీలా పడిపోయిన భారత రాష్ట్ర సమితిలో భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే ప్రమాదం పొంచి ఉండటం కూడా రేవంత్ సర్కార్‌కు సవాలు కానుంది. సుప్రీంకోర్టు తీసుకోబోయే నిర్ణయం వల్ల ఉప ఎన్నికలు వస్తే ఫలితం ఎలా ఉంటుందోనన్న బెంగ పార్టీ మారిన ఎమ్మెల్యేలలో ఉంది. ఈ కారణంగా వారిలో కొందరు ఘర్ వాపసీ ఆలోచన చేస్తున్నారు. అలా జరిగితే రేవంత్ సర్కార్‌కు నైతికంగా దెబ్బే అవుతుంది. కేసీఆర్ చెప్పుకొంటున్నట్టుగా ప్రజలు ఆయన పాలనకోసం పలవరించడం లేదుగానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాత్రం పెదవి విరుస్తున్నారు. పార్టీ ఫండ్ కోసం తెలంగాణపై ఆధారపడుతున్న కాంగ్రెస్ అధిష్ఠానం ప్రభుత్వ పనితీరు మెరుగుకు మార్గదర్శనం చేయలేని పరిస్థితిలో ఉంది. కర్ణాటక కాంగ్రెస్ నాయకులు చేతులెత్తేయడంతో ప్రతి అవసరానికీ కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై ఆధారపడుతోంది. ఈ కారణంగా ప్రభుత్వంలో అవినీతి పెరగడానికి ఆస్కారం ఏర్పడుతోంది. గుడ్డికంటే మెల్ల నయం అన్నట్టుగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మార్చడం ద్వారా కాంగ్రెస్ అధిష్ఠానం మంచిపని చేసింది. దీపాదాస్ ఇక్కడే మకాం వేసి మంత్రులకు ఫోన్లు చేసి 'నా వాటా ఏదీ?' అని వేధిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. వీటన్నింటి నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి నాయకులకు భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి.

> 2019లో ఐ-ప్యాక్‌ను నమ్ముకున్న జగన్‌రెడ్డి 2024లో కూడా ఐ-ప్యాక్‌నే నమ్ముకొని మునిగిపోయారు. ఐ-ప్యాక్ వంటి సంస్థ తమకు దొరకనందున 2019లో ఓడిపోయామని భావించిన చంద్రబాబు 2024లో రాబిన్ శర్మ అనే ఆయనను నమ్ముకున్నారు. రాబిన్ శర్మ సేవలు అందించి ఉండకపోయినా కూటమి గెలిచేది. ఇక కేసీఆర్ ఎవరెవరితోనో సర్వేలు చేయించుకొని సంతృప్తిపడుతుండేవారు. కర్ణాటకలో సునీల్ కనుగోలు వ్యూహం వల్లే తాము గెలిచామని కాంగ్రెస్ పార్టీ నమ్మింది. అదే నమ్మకంతో తెలంగాణలో కూడా కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చే బాధ్యతను ఆ పార్టీ పెద్దలు ఆయనకు అప్పగించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 50 సీట్ల వరకు రావచ్చునని ఆయన లెక్కలు వేసుకున్నారు కానీ, కాంగ్రెస్ పార్టీకి 70 స్థానాల వరకు లభించే అవకాశం ఉందని గుర్తించలేక పోయారు. ఎన్నికల వ్యూహాలు అవసరమేగానీ, అవి మాత్రమే ఎన్నికల్లో విజయాలను తెచ్చిపెట్టవు.

కేసీఆర్... అండ్ ఫ్యామిలీ...

ఎన్నికల ముందు వరకు కేసీఆర్ పోకడలను నిరసించిన ప్రజలు ఇప్పుడు ఆయన పట్ల ఎంతో కొంత సానుభూతి ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్ పట్ల వ్యతిరేకత క్రమంగా తొలగిపోతోంది. ఈ పరిణామం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రమాద సంకేతమే. అయితే, ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల అంత సంతృప్తిగా లేనప్పటికీ కేసీఆర్ కుటుంబ సభ్యుల పట్ల మాత్రం ఇప్పటికీ ఆగ్రహంగానే ఉన్నారు. ముఖ్యంగా కేటీఆర్, కవిత విషయంలో ప్రజల్లో అనుకూలత ఏర్పడటం లేదు. అధికారంలో ఉన్నప్పుడు వారు అపరిమిత అధికార దర్పాన్ని ప్రదర్శించడం ఇందుకు కారణం కావొచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా పరిస్థితులను మదింపు చేసుకొని విరుగుడు చర్యలు చేపట్టని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయినా ఆశ్చర్యపోవాల్సింది ఉండదు. అవతలి వైపు కేసీఆర్ నిలబడి ఉన్నంత వరకు ప్రజలకు ప్రత్యామ్నాయం ఉండనే ఉంటుంది. తెలంగాణలో అధికారంలోకి రావాలని భారతీయ జనతా పార్టీ కలలు కంటోంది కానీ కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బతీయనంత వరకు ఆ పార్టీకి చాన్స్ రాదు. ప్రస్తుతానికి కేసీఆర్ తాను కోల్పోయిన జవసత్వాలను తిరిగి సమకూర్చుకుంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఆయనను బలవంతుడ్ని చేస్తారా? లేక లోపాలను సరిదిద్దుకొని బలహీనుడ్ని చేస్తారా? అన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేయబోయే అడుగులను బట్టి ఉంటుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో ఉప ఎన్నికలు రాకుండా అడ్డుకోవడం రేవంత్ సర్కార్ ముందున్న తక్షణ కర్తవ్యం. ఏ కారణం వల్లనైనా ఉప ఎన్నికలు జరిగి ఆ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా గెలవలేని పక్షంలో కేసీఆర్ మరింత బలపడతారు. అదే జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ పోరును ఉధృతం చేస్తారు. మొత్తంగా పరిస్థితులను బేరీజు వేసుకొని 15 నెలల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించుకుంటే 'ఆల్ ఈజ్ నాట్ వెల్' అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి తాను బలపడి పార్టీని బలోపేతం చేయడానికి ఎటువంటి ఎత్తుగడలు వేస్తారో వేచి చూద్దాం!

బ్రూనో : సత్యాన్వేషణలో సజీవ స్ఫూర్తి

భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడా? భూమే సూర్యుని చుట్టూ తిరుగుతున్నదా? భూమి గుండ్రంగా ఉందా? లేక బల్లపరుపుగా ఉందా? అన్న ప్రశ్నలకు సమాధానం అనాదిగా మతం చెప్పిందే వేదంగా సాగింది. భూమి గుండ్రంగా ఉందని, భూమే సూర్యుని చుట్టూ తిరుగుతుందని 1473–1543 మధ్యకాలంలో జీవించిన కొపర్నికస్ గుర్తించి, బైబిల్ చెప్పే విషయాలు కట్టుకథలని తేల్చాడు. దీనికి అనేక శతాబ్దాల ముందే తమకున్న అరకొర పరికరాల సాయంతో కొందరు గ్రీకు శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించారు. ఆ తర్వాత ఫిలోలేస్, అరిస్టార్కస్‌లు కూడా ఈ సిద్ధాంతాన్ని నమ్మి, ప్రవచించినా.. మతాచార్యుల కోపానికి జడిసి, తామే తప్పుడు సిద్ధాంతాలు చేసినట్టు లెంపలేసుకోవాల్సి వచ్చింది.

ఇలా లెంపలేసుకోకపోయినా తన ఖగోళ సిద్ధాంతాన్ని ప్రచురించే ధైర్యం కొపర్నికస్ కూడా చేయలేదు. తన సిద్ధాంతసారాన్ని లిఖితప్రతి రూపంలో 1514లో ఆయన బయటపెట్టాడు. "తగు నిరూపణలతో నీ సిద్ధాంతాల్ని మా వద్ద నిరూపించమ"ని పోప్ అవకాశం ఇచ్చినా, కొపర్నికస్ ధైర్యం చేయలేదు. చివరకు అతడు మరణశయ్యపై ఉండగా ఆ గ్రంథం ప్రచురితమయింది. అయితే ఆయన మరణానంతరం అది పోప్‌చే నిషేధానికి గురయింది. తర్వాత కొపర్నికస్ సిద్ధాంతాల్ని బలపరిచిన వారిని కూడా బంధించి, వేధించారు. కొందర్ని వధించారు. కొపర్నికస్ సిద్ధాంతాల్ని సమర్థించిన వారిలో ఇటలీకి చెందిన జోర్డానో బ్రూనో (1518–1600) ముఖ్యుడు. ఈ కారణంగానే ఆయన్ను అనేక సంవత్సరాలు వేధించి, చివరకు వధించారు.



బ్రూనో మతాధికారిగా జీవితం ప్రారంభించినా, ఎక్కువ కాలం అందులో ఇమడలేకపోయాడు. అతను మంచి కవి, తత్వవేత్త, మహోపన్యాసకుడు, స్వాతంత్ర్యప్రియుడు. బైబిల్‌ని పుక్కిట పురాణంగా కొట్టివేసినందుకు, కొపర్నికస్ సిద్ధాంతాన్ని బలపరిచినందుకు ఆయన్ని అరెస్టు చేయటానికి ప్రయత్నించగా, తప్పించుకొని ఎన్నో నగరాలు, దేశాలు తిరిగాడు. చివరకు ఒక కపట మిత్రుణ్ణి నమ్మి తిరిగి ఇటలీకి వెళ్లాడు. వెనిస్‌లో బ్రూనోను అరెస్టుచేసి రోమ్‌కు తీసుకువెళ్లి అక్కడ విచారణ తంతు జరిపి సజీవ దహనం శిక్ష విధించారు. మత విశ్వాసాల్ని ధిక్కరించిన పాపి రక్తం కూడా భూమిపై పడకూడదనే భావనతో సజీవదహనం శిక్ష విధించారు.

మత విశ్వాసాల్ని వ్యతిరేకించిన రోజర్ బేకన్, పెత్రోపొంపోనాట్స్ (1462–1515) మతాచార్యులకు భయపడి వెనక్కు తగ్గినా, వారిని మతాచార్యులు కనికరించకుండా నిర్బంధించి, వారి చావుకు కారకులయ్యారు. ఫ్రాన్సుకు చెందిన బుఫాన్ అనే శాస్త్రజ్ఞుడు వృక్ష, జంతు, ప్రకృతి శాస్త్రాల్లో కొన్ని శాస్త్రీయ సత్యాలు కనుగొన్నా, చివరకు నేను చెప్పినవి తప్పు, నా తప్పిదాన్ని మన్నించమని లిఖితపూర్వకంగా పత్రం రాసి, మతాచార్యుల ఆగ్రహం నుంచి తప్పించుకున్నాడు. చివరకు గెలీలియో కూడా మతాచార్యుల ముందు తలవంచాడు. అయితే తాను చెప్పింది నిజమని కడ వరకూ నిల్చినవాడు సోక్రటీస్. ఈయనతో పోల్చదగినవాడు మానవ చరిత్రలో మరో శాస్త్రజ్ఞుడు లేడని ఎక్కువ మంది విశ్వాసం.

ఆరు సంవత్సరాల సుదీర్ఘకాలం విచారణ జరగటంతో బ్రూనో కూడా కొంత మెతకతనం ప్రదర్శించాడని నార్ల వెంకటేశ్వరరావు తన జాబాలి నాటిక ముందుమాటలో పేర్కొన్నారు. కాని "మరణ దండన పొందిన నాకంటే దాన్ని నాకు విధించిన మీరే ఎక్కువ గజగజలాడుతున్నారని" ధీరోదాత్తంగా పలికాడు బ్రూనో. విచారణ అనంతరం "నేను బలవర్మణం పొందవచ్చు. అయితే అనేక మంది జీవితాల కంటే నా మరణం ఉత్తమమైనది కాగలదు" అన్న బ్రూనో మాటలు విచారణ సమయంలో రికార్డు చేయబడ్డాయి. వీటిని బట్టి బ్రూనో వీరోచితంగానే మరణాన్ని స్వీకరించాడని, ఎవరి ముందూ తలవంచక తన విశ్వాసంపై నిలబడ్డాడని అర్థమవుతుంది. కనుకనే బ్రూనో సజీవదహనం పొందిన రోజుని (ఫిబ్రవరి 17) సత్యాన్వేషణ దినంగా ప్రకటించారు. చనిపోయే నాటికి బ్రూనో వయస్సు 52 సంవత్సరాలు. ఆయన చనిపోయిన 30 సంవత్సరాల తర్వాత అది తప్పిదంగా గుర్తించి, సజీవదహనం గావించిన స్థలంలో ఒక స్థూపాన్ని నిర్మించి, ఆయన్ను అమరజీవిగా ప్రకటించారు.

■ చెరుకూరి సత్యనారాయణ

(రేపు బ్రూనో సజీవదహనమైన రోజు, సత్యాన్వేషణ దినం)



యుఫోరియా మ్యూజికల్ నైట్‌కు హాజరైన జనం



తమన్ మ్యూజికల్ షో

తలసీమియా బాధితుల సహాయార్థం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన యుఫోరియా మ్యూజికల్ నైట్ కుర్రకారులో జోష్‌ను నింపింది. విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో తమన్, శివమణి, నవీన్ నేతృత్వంలో గాయనీ గాయకులు వీనులవిందుగా సినీ గీతాలను ఆలపించారు. పవన్ కల్యాణ్, బాలకృష్ణ సినిమాల్లోని గీతాలకు యువత నుంచి విశేష స్పందన లభించింది. బాలకృష్ణ సినిమాలోని 'మొన్నా కుట్టేసినది నిన్న కుట్టేసినది.. మళ్లీ కుట్టేసినది గండు చీమ' అనే పాట కుర్రకారును ఉర్రూతలూగించింది. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల నడుమ ఆద్యంతం కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి, సినీ హీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ హాజరయ్యారు. -ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్



వేదిక వద్దకు వస్తున్న చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, పవన్, లోకేశ్



యువత కేరింతలు



నృత్య ప్రదర్శన

అరాచకాలు చేసి..

పెడబొబ్బలు

వైసీపీ నేతల తీరుపై సర్వత్రా విమర్శలు

అధికారంలో ఉండగా రెచ్చిపోయిన వంశీ, కొడాలి, పేర్ని, జోగి

- వాటి ఫలితంగా నేడు కేసులు, అరెస్టులు జరుగుతుంటే గగ్గోలు
- టీడీపీలో ఉండగా వంశీ అరాచవాది.. వైసీపీలోకి రాగానే మానవతావాది
- వైసీపీ అధినేత జగన్ ద్వంద్వ వైఖరిపై ప్రజాగ్రహం
- నాటి పాపాల ఫలితమేనంటున్న గన్నవరం నియోజకవర్గ వాసులు

వైసీపీ నేతలు వల్లభనేని వంశీ, పేర్ని నాని, కొడాలి నాని, జోగి రమేష్ అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఐదేళ్ల పాటు అనేక అరాచకాలకు పాల్పడ్డారు. వాటి ఫలితంగా నేడు కేసులు నమోదు, అరెస్టులు జరుగుతుంటే గగ్గోలు పెడుతున్నారు. అధికారం ఉందని అరాచకాలు చేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వంపై ఎదురు దాడి చేస్తున్నారు. వంశీ అరెస్టుపై మెలమెల్లగా వైసీపీ నేతలు స్వరం పెంచుతున్నారు. తప్పుడు కేసు పెట్టారని, రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కూడా వంశీ విషయంలో చంద్రబాబు తీవ్ర అన్యాయం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. తప్పులు చేసిన వారిని వైసీపీ నేతలు వెనకేసుకురావటం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

-(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



చంద్రబాబు ఇంటిపై దాడికి యత్నించిన జోగికి మంత్రి పదవి

జోగి రమేష్ పెడన ఎమ్మెల్యేగా ఉండగా అనేక అరాచకాలు చేశారు. ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసే స్థాయికి దిగజారారు. వలంటీర్లను చేతిలో పెట్టుకుని నచ్చిన వారికి పథకాలు ఇచ్చారు. ఇలాంటి దుందుడుకుగా వ్యవహరించిన జోగి రమేష్‌ను వైసీపీ పెద్దలు ప్రోత్సహించారు. చంద్రబాబు ఇంటిపై దాడికి జోగి ప్రయత్నించటం అప్పట్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లాడని జోగి రమేష్‌ను ఆ పార్టీ అధినేత, ముఖ్య మంత్రిగా ఉన్న జగన్ ఏకంగా మంత్రి పదవి ఇచ్చి తన క్యాబినెట్‌లో కూర్చోపెట్టుకున్నారు.

దాడులు చేసిన వారిని ప్రోత్సహించినందునే మరిన్ని దాడులు

ప్రభుత్వంలో ఉన్న వారు శాంతిభద్రతలను కాపాడాలి. అలాంటిది వైసీపీ ప్రభుత్వంలో దాడులకు పాల్పడేవారిని హీరోలుగా చూస్తూ వారికి ప్రోత్సాహకాలు ఇస్తుండటంతో మిగిలిన వారు కూడా ఇదే పంథాలో ముందుకు సాగారు. వల్లభనేని వంశీ కూడా ఇదే స్ఫూర్తితో టీడీపీ కార్యాలయంపై దాడికి పథక రచన చేశారు. మరో మాజీ మంత్రి కొడాలి నాని కూడా అప్పట్లో తన అనుయాయుల ద్వారా టీడీపీ నాయకుడు రావి వెంకటేశ్వరరావు వర్గీయులపై దాడులకు తెగపడ్డారు. రావి ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయంపైనా దాడులకు పాల్పడేంత వరకు పరిస్థితి వెళ్లింది.

నాడు చెడ్డవాడు.. నేడు మంచివాడు

వల్లభనేని వంశీ అక్రమాలపై నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ అనేక ఆరోపణలు చేశారు. పాదయాత్రలో తోటపల్లి వచ్చినప్పుడు బ్రహ్మయ్య లింగం చెరువుతో పాటు కొండలను కరిగించేశాడని విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల ముందు వంశీ క్వారీలు మింగేశాడని ఆయన అరాచకాలపై జగన్ పత్రిక పతాక శీర్షికన పెద్ద కథనమే ప్రచురించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత గన్నవరం నియోజకవర్గంలో నకిలీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయించారని వైసీపీ ప్రభుత్వం కేసు పెట్టించింది. వంశీ జగన్ పంచన చేరగానే ఆ కేసును మూలన పడేసింది. ఇప్పుడు వంశీ అక్రమాలను కప్పిపెడుతూ అన్యాయంగా, అక్రమంగా కేసులు పెడుతున్నారని జగన్ ట్వీట్లు పెడుతున్నారు. వంశీ చేసిన అరాచకాల నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గంలో ఆయన్ను అక్కడి ప్రజలు చిత్తుగా ఓడించారు. వంశీ అరెస్టు విషయంలో ప్రజల నుంచి ఎలాంటి సానుభూతి రాలేదు.

వైసీపీ అధికారంలోకి రాగానే జిల్లా పరిషత్‌పై దాడి

వైసీపీ అధికారంలోకి వచ్చీరాగానే ఆ పార్టీ తొలి దాడి ఉమ్మడి కృష్ణాజిల్లాలోని జిల్లా పరిషత్‌పై మాజీ మంత్రి పేర్ని నాని పథక రచనతో జరిగింది. టీడీపీ అధికారంలో ఉన్నపుడు అప్పటి చైర్‌పర్సన్ గద్దె అనురాధ జెడ్పీ ఆవరణలో ఫంక్షన్ హాల్‌ను కట్టించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే ఆమె దానిని ప్రారంభించారు. దీనికి గుర్తుగా అప్పట్లో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే పేర్ని నాని ప్రోద్బలంతో జెడ్పీ ఫంక్షన్ హాల్‌పై దాడి చేసి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీనిపై అప్పట్లో టీడీపీ నాయకులు చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. అధికారం అండతో ఈ కేసును ముందుకు కదలకుండా చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చినా అక్కడి నేతలు ఎవ్వరూ కూడా ఈ కేసుపై మాట్లాడలేదు. పేర్ని నానిపై రాజకీయ కక్షకు దిగాలంటే ఈ కేసును రీ ఓపెన్ చేస్తే చాలు. ఇప్పటికే ఆయన గోడౌన్‌లోని రేషన్ బియ్యం మాయం చేయడంపై కేసు నమోదైంది. దీనిపై పేర్ని నాని నానా గొడవ చేశారు. ఈయన పరిస్థితి ఇలా ఉంటే.. నాని తనయుడు పేర్ని కిట్టు ఏకంగా టీడీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై దాడులకు పాల్పడ్డాడు.

జీబీఎస్ కేసు

పాత ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదేళ్ల బాలికకు చికిత్స

- ఏలూరు జిల్లా ఎర్రగుంటపల్లికి చెందిన బాలికకు వైరస్
- బాలిక కోలుకుంటోందని చెప్పిన సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు విజయవాడలో వెలుగు చూసింది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన బాలిక(5) ఈ వ్యాధితో బాధపడుతుండగా.. విజయవాడలోని పాత ప్రభుత్వాస్పత్రికి తల్లిదండ్రులు తీసుకువచ్చారు. బాలిక ఇప్పుడు చికిత్స పొందుతూ కోలుకుంటోందని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.వెంకటేశ్వరరావు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. బాలికకు తొలుత జ్వరం వచ్చిందని స్థానిక ఆస్పత్రిలో -, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించాలన్న సూచనతో ప్రభుత్వ పాత ఆస్పత్రితో చేరింది. ఇక్కడి వైద్యులు పరీక్షించగా గులియన్ బారే సిండ్రోమ్‌కు గురైందని తేలింది. దీంతో బాలికకు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. ఇది అంటువ్యాధి కాకపోవటంతో జనరల్ వార్డులోనే ఉంచి చికిత్స చేస్తున్నా

ఇది అంటువ్యాధి కాదు.. భయపడవద్దు

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) అంటు వ్యాధి కాదు.. ఇది కేవలం బ్యాక్టీరియా.. జ్వరం వచ్చినప్పుడు డయేరియా కూడా రాకుండా

మిగతా 6లో..

కబ్జా గ్యాంగ్!

రూ.10 కోట్ల విలువైన కార్పొరేషన్ స్థలం మళ్లీ ఆక్రమణ

- తహసీల్దార్ చర్యలు తీసుకున్న ఇరవై రోజులకే తిరిగి పాగా
- టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించిన సరిహద్దు రాళ్లు మళ్లీ ఏర్పాటు
- కలెక్టర్‌కు తహసీల్దార్ లేఖ రాసినా భయపడని కబ్జా గ్యాంగ్
- ఎనీవేర్ విధానంతో మైలవరంలో ప్రభుత్వ భూమికి రిజిస్ట్రేషన్లు
- చోద్యం చూస్తున్న కార్పొరేషన్ అధికారులు

ఒకరు ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించడంలో దిట్ట.. మరొకరిది నకిలీ పత్రాలు సృష్టించడంలో అందివేసిన చేయి.. ఇంకొకరు ఎనీవేర్ విధానంలో ప్రభుత్వ భూవి ఎని ఏ జిల్లాలో అయినా రిజిస్ట్రేషన్ చేయించడంలో నిష్ణాతుడు.. వేరొకరు కబ్జా చేసిన భూములకు బేరాలు తెచ్చి అమ్మేయడంలో ఘటికుడు. వీరందరూ కలసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. విజయవాడ నగర శివారులోని కండ్రిక కాలనీకి ఓ ప్రైవేట్ వెంచర్‌కు మధ్యలో ఉన్న రూ. 10 కోట్ల విలువైన కార్పొరేషన్ భూములను కబ్జా చేశారు. ప్లాట్లు వేసి మరీ అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.



మారోమారు కార్పొరేషన్ స్థలంలో కూలీలతో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయిస్తున్న కబ్జా గ్యాంగ్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ రూరల్/పాయకాపురం) : పాయకాపురం కండ్రిక కాలనీ శివారులోని డీమార్ట్ సమీపంలో ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయీస్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ హౌస్ సొసైటీ లిమిటెడ్ వెంచర్ ఉంది. సొసైటీ వెంచర్‌కు, కండ్రిక కాలనీకి మధ్య సర్వే నంబర్ 63/1లో సుమారు 4000 గజాల కార్పొరేషన్ స్థలం ఉంది. సొసైటీ వెంచర్ సర్వే నంబరు 60/2లో ఉంది. సదరు సొసైటీ డాక్యుమెంట్ల ఆధారంగా పక్కనే ఉన్న సర్వే నంబరు 63/1బీలో

మిగతా 6లో..

కొత్తా.. నగరమండీ..!

- బెజవాడకు దీటుగా అభివృద్ధి చెందుతున్న గొల్లపూడి 8లో

శనగ రైతు లబోదిబో! 6లో

వంశీకి ప్రాణహాని ఉంది

- వల్లభనేని పంకజశ్రీ 8లో



ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఫెసిలిటేట్ సెంటర్‌లో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

పారిశ్రామికంగా విజయవాడకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి

● ఎంపీ కేశినేని శివనాథ్ హామీ

ఆటోనగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు దీటుగా పారిశ్రామికంగా అన్ని రంగాల్లో ముందున్న విజయవాడకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) హామీ ఇచ్చారు. ఇక నుంచి రాజకీయాలు మానేద్దామని, నగర అభివృద్ధి కోసం ఆలోచిద్దామంటూ ఆటోమొబైల్ పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఆటోనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఫెసిలిటేట్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ సెంటర్‌ను ప్రారంభించాక, ఆటోమొబైల్ ఇండస్ట్రీస్ అభివృద్ధి కోసం తయారు చేసిన నివేదికను ఎంపీకి ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డి.రామకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడారు. ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త ఉండాలనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయమన్నారు. ఆ ఆశయ సాధన కోసం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా 32 గ్రామాలను దత్తత తీసుకున్నానని చిన్ని ప్రకటించారు. 295 గ్రామాలను అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. చిన్న తరహా సంస్థల ఏర్పాటులో రాష్ట్రం చాలా వెనుకబడి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య కోర్సులు విద్యాసంస్థల్లో అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకటరావు, అధ్యక్షుడు బీవీఎస్టీ సాయి, జనరల్ సెక్రటరీ ఎంఎస్ రామచంద్రరావు, సెక్రటరీ టీవీ నాగేశ్వరరావు, పలు సంఘాల నాయకులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

వివాహమైన రెండోరోజే నవ వధువుకు వేధింపులు

● రూ.50 లక్షలు ఇవ్వలేదని గదిలో నిర్బంధం
● వధువు కుటుంబ సభ్యులు ప్రశ్నించటంతో అమెరికాకు పరారయ్యేందుకు వరుడి ప్రయత్నం
● కేసు నమోదు చేసిన భవానీపురం పోలీసులు
● వరుడికి రిమాండ్..నెల్లూరు జైలుకు తరలింపు



అరెస్టయిన హేమంత్ అజయ్ (ఫైల్)

విద్యాధరపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తండ్రి ఆర్టీసీలో ఉద్యోగం..కొడుకు ఉన్నత చదువులు చదివి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ మంచి స్థితిలో ఉన్నాడు.. తమ కుమార్తెకు ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో వివాహం చేస్తే సుఖంగా ఉంటుందని యువతి తల్లిదండ్రులు భావించారు. కట్నానికి వెనుకాడకుండా కోట్లాది రూపాయలు ఇచ్చి పెళ్లి జరిపించారు. కానీ, పెళ్లయిన రెండు రోజులకే రిసెప్షన్‌లో పెళ్లి కొడుకు తల్లిదండ్రుల నిజస్వరూపం బయటపడింది. వివరాల్లోకి వెళి తే..కర్ణాటక రాష్ట్రం రాయచూర్, ఏక్లాస్‌పూర్ చౌదరీస్ కాలనీలో వెలిసేటి ప్రసన్నకుమార్ చౌదరి నివాసముంటున్నారు. తన కుమార్తె లక్ష్మీ కీర్తనచౌదరికి గొల్లపూడి జైన్ కాలనీలో నివాసముంటున్న ఆర్టీసీ విజయవాడ బస్‌స్టేషన్‌లో కంట్రోలర్ గా పనిచేసే చెరుకూరి లక్ష్మణరావు, భవానీ దంపతుల కుమారుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న హేమంత్ అజయ్‌తో ఈనెల 7న రాయచూర్‌లో ఘనంగా వివాహం జరిపించారు. వివాహానికి ముందు నగదు, స్థిరాస్తులు బంగారం, వెండి మొత్తం కలిపి సుమారు రూ.5 కోట్లు కట్నంగా ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. హేమంత్ అజయ్ తల్లిదండ్రులు ఈనెల 9న నిడమానూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. అక్కడ తమకు ఇస్తానన్న కట్నంలో రూ.50లక్షలు వెంటనే ఇస్తేనే వధువును ఇంటికి తీసుకువెళతామని స్పష్టంచేశారు. సమయం ఇస్తే డబ్బులు ఇస్తామని వధువు తల్లిదండ్రులు, బంధువులు చెప్పారు. అయినా వినలేదు. వధు వు బంధువులు, స్నేహితులు వధూవరులను ఆశీర్వదించేందుకు వస్తే నిరాకరించారు. వధువు తల్లిదండ్రులు, బంధువులు ప్రశ్నిస్తే హేమంత్ అజయ్, అతని తల్లిదండ్రులు వారితో గొడవపడ్డారు. అనంతరం హేమంత్ అజయ్‌ను తల్లిదండ్రులు రిసెప్షన్ నుంచి వెంటబెట్టుకుని ఇం టికి తీసుకువెళ్లిపోయారు. వధువును విడిచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను కారులో గొల్లపూడిలోని వరుడు ఇంటికి తీసుకువెళ్లారు. 10వ తేదీన అజయ్ తల్లిదండ్రులు వధువును తమ ఇంటిలోనే ఓ గదిలో నిర్బంధించారు. భోజనం కూడా పెట్టలేదు. ఆమె అత్తమామలను ప్రాధేయపడినప్పటికీ వారు పట్టించుకోలేదు. అసభ్యకరంగా దూషించారు. వధువు తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి తమ కుమార్తె గురించి ఆరాతీశారు. ఆమెను బయటకు పంపించకపోగా, వారిపై దౌర్జన్యానికి దిగారు. విషయం తెలుసుకున్న పలువురు స్థానిక పెద్దలు అజయ్ ఇంటికి వెళ్లి గదిలో నిర్బంధించిన వధువును బయటకు తీసుకొచ్చారు. అజయ్ అమెరికా పారిపోవడానికి ప్రయత్నిస్తే వధువు బంధువులు కారును అడ్డగించారు. తల్లిదండ్రుల సహాయంతో ఈనెల 12వ తేదీన భవానీపురం పోలీసులకు లక్ష్మీ కీర్తనచౌదరి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి హేమంత్ అజయ్‌ను అరెస్టు చేసి కోర్టు లో హాజరుపరిచారు. కోర్టు అతనికి రిమాండ్ విధించింది. అతనిని నెల్లూరు జైలుకు తరలించారు.

జీబీఎస్ కేసు

(5వ పేజీ తరువాయి)

చూసుకోవాలని పాత ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు చెబుతున్నారు. డయేరియా కారణంగా కండరాల బలహీనత, తిమ్మిర్లు, నడవలేకపోవటం, ఆహారం మింగుడుపడకపోవటం, శ్వాస ఆడకపోవటం వంటి లక్షణాలు జీబీఎస్‌లో వస్తాయని చెప్పారు. జీబీఎస్ వచ్చిన వారికి ప్రాణ హాని ఉండదని, పాపకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. బాలిక ఆసుపత్రిలో చేరినప్పుడు నడవలేని స్థితిలో వచ్చిందని, మెరుగైన చికిత్స అందించటంతో ఆరోగ్యం కుదుటపడిందని తెలిపారు. ఈ వైరస్ గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది అంటువ్యాధి కాదని మరోసారి స్పష్టం చేశారు.

పాత ప్రభుత్వాసుపత్రిలో ట్రీట్మెంట్‌కు ఏర్పాట్లు

జీబీఎస్ కేసులకు సత్వర అత్యున్నత వైద్యం అందించటానికి విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో అన్ని ఏర్పాట్లు చేశామని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు చెప్పారు. ఇలాంటి కేసుల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

శనగ రైతు లబోదిబో!

వరుసగా రెండేళ్ల నుంచి రైతులను నట్టేట ముంచుతున్న శనగ పంట ఈ ఏడాదీ ఆవేదనే మిగిల్చింది. దిగుబడులు సగానికి పైగా తగ్గడంతో శనగ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడి రావటం లేదు. లాభం సంగతి సంగతి దేవుడెరుగు? పెట్టుబడి ఖర్చు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు లబోదిబోమంటున్నారు.



నూర్పి రాశిగా చేసిన శనగలు

తగ్గిన దిగుబడులు

● మద్దతు ధర కంటే తక్కువకే విక్రయం
● నష్టాలు మూటగట్టుకున్నామని ఆవేదన

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల): ఈ ఏడాది రబీ సీజన్‌లో నందిగామ సబ్ డివిజన్ పరిధిలో 8,500 ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారు. కంచికచర్ల మండలంలోనే 6,500 ఎకరాల్లో పంట వేశారు. శనగ విత్తనాల ఖర్చు ఎకరానికి రూ.7 వేలు అయింది. కౌలుతో పాటుగా అంతరకృషి, ఎరువులు, పురుగుమందులు, ఇతరత్రా కలిపి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి అయింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు పంట దిగుబడిపై ప్రభావం చూపాయి. పైరు పూత, పిందె దశలో ఉన్నప్పుడు రెండు మూడురోజులు కొద్దిపాటి వర్షం కురిసింది. దీంతో పూత రాలిపోయింది. మళ్లీ పెద్దగా పూత రాలేదు. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. కొద్దిరోజుల నుంచి శనగ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొంతమంది రైతులు కూలీలతో, మరికొంతమంది యంత్రాలతో కోయిస్తున్నారు. సాధారణంగా శనగ ఎకరానికి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈసారి ఐదారు క్వింటాళ్లకు మించి రావ డం లేదు. కొంతమంది రైతులకు మూడు నాలుగు క్వింటాళ్లే దిగుబడి వస్తోంది.

గిట్టుబాటు కాని ధర

శనగలు నిల్వ చేయటానికి ఎక్కువ మంది రైతులకు గిడ్డంగులు, తగిన వసతులు లేవు. వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులకు తోడు గత సీజన్ పంట ఇంకా శీతల గిడ్డంగుల్లో మూలుగుతోంది. దీంతో పలువురు రైతులు పంట కోసిన వెంటనే కల్లాల్లోనే అమ్ముతున్నారు. కేంద్ర ప్రభుత్వం శనగలకు ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.5,650 ప్రస్తుతం బయటి మార్కెట్లో క్వింటాలు రూ.5,500 పలుకుతోంది. మద్దతు ధర కంటే మార్కెట్ ధర రూ.150 తక్కువగా ఉంది. పండిన శనగలు నాణ్యంగా ఉండడంతో మున్ముందు ధర పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ఖర్చులైనా చేతికి రావు

దిగుబడి సగానికి సగం తగ్గడం వల్ల పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి రావని రైతులు వాపోతున్నారు. పంట నూర్పిడి ఖర్చు భారంగా పరిణమించిందని, కూలీలతో నూర్పిడి ఎకరానికి రూ.5 వేలు, యంత్రంతో రూ.3 వేలు అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో శనగకు లభిస్తున్న ధర గిట్టుబాటు కాదని చెబుతున్నారు. మద్దతు ధర రూ.7 వేలకు తగ్గకుండా ఉంటేనే గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు. మొత్తంగా నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణానదిలో స్నానానికి దిగి యువకుడి మృతి



నది నుంచి బయటకు తీసిన నవీన్ మృతదేహం

జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వేదాద్రి వద్ద కృష్ణా నదిలో స్నానానికి దిగిన యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామానికి చెందిన పోతుమర్తి నవీన్, గుడారి పద్మారావు బావబామ్మర్దులు. ఇద్దరూ బైకుపై వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వచ్చారు. అక్కడ మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత స్నానానికి కృష్ణా నదిలోకి దిగారు. నవీన్(23) నదిలో పడి మునిగియాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

● వాహనదారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోకుండా రహదారుల భద్రత, రవాణాశాఖ సూచించిన నిబంధనలు పాటించాలని, హెల్మెట్లు ధరించాలని, ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని వాహనదారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో శనివారం నిర్వహించారు. వాహనదారుల భద్రతపై అవగాహన, ప్రచార కార్యక్రమాలను జిల్లా రవాణా, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో నిరంతరం నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కొందరు బాధ్యత లేని వాహనదారుల వల్ల కొన్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హెల్మెట్లు ధరించని వాహనదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెల్మెట్ వినియోగంపై వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలో పాల్గొన్న వివిధ శాఖాధికారులకు, రోడ్డు భద్రతపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, మీడియా ప్రతినిధులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.విద్యాసాగర్, జిల్లా రవాణాధికారి ఎ.మోహన్, రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వీఎంసీ జోనల్ కమిషనర్ ప్రభుదాసు, డీసీపీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పీఎం సూర్యఘర్ రుణాల మంజూరు వేగవంతం చేయాలి

● వెండర్లు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్: పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, వెండర్లు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సూర్యఘర్ పథకం కింద రుణాల మంజూరుపై శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమన్వయ శాఖల అధికారులు, వెండర్లు, బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్యానెళ్లను అమర్చి జిల్లాను అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇప్పటివరకు 72,000 రిజిస్ట్రేషన్లు వచ్చాయని, ఇన్‌స్టలేషన్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ రాయితీ మినహా మిగిలిన సొమ్మును బ్యాంకర్లు రుణంగా మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఆదర్శ సౌర గ్రామాలుగా గుర్తించిన బూదవాడ (జగ్గయ్యపేట), వెల్వడం(మైలవరం), పరిటాల(కంచికచర్ల), కంభంపాడు(ఎ.కొండూరు), షేర్ మహ్మద్‌పేట (జగ్గయ్యపేట) గ్రామాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు లక్ష్యాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, త్వరితగతిన నూరు శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని మండలాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి ఎం.భాస్కర్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హనుమయ్య, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్ర లక్ష్యం



రెడ్డిగూడెంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

● 'స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్'లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

రెడ్డిగూడెం /ఇబ్రహీంపట్నం: ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం రెడ్డిగూడెంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్న విధానంతో పాటు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తున్న తీరును పరిశీలించారు. వేర్వేరు డబ్బాల ద్వారా తడి, పొడి చెత్తను ఎలా వేయాలో వాటిని పారిశుధ్య సిబ్బందికి ఎలా అందజేయాలో వివరించారు. పరిసరాల పరిశుభ్రత వల్ల వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు స్వచ్ఛత కూడా కీలకమేనని కలెక్టర్ అన్నారు.

● కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఏటీపీ బ్లాక్‌లో ఉన్న ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లిలో శనివారం నిర్వహించిన సమగ్ర ఆరోగ్య సర్వే(ఎన్‌సీడీ 3.0)ను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఇంకుడు గుంతల శంకుస్థాపనలో ఆయన పాల్గొన్నారు. డీపీవో పి.లావణ్య కుమారి, ఆర్డీవో కె.మాధురి, ప్రత్యేక అధికారి పి.బాలాజీ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలకవర్గసభ్యుడు వేమూరి సాయివెంకటరమణ

కృష్ణా మిల్క్ యూనియన్‌పై ఆరోపణలు కుట్రపూరితం

● కొంతమంది కావాలనే చేస్తున్నారు
● ప్యాకెట్‌పై 'విజయ' ఉన్న ప్రతీదీ మాది కాదు
● 'విజయ' కింద కృష్ణా మిల్క్‌యూనియన్ అని ఉంటేనే మా బ్రాండ్: పాలకవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకటరమణ


చిట్టినగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'కృష్ణా మిల్క్‌యూనియన్ నెయ్యి, పెరుగు, పాలు అమ్ముతుంది. బయట ప్రాంతాల్లో నెయ్యి కొనదు. కొంతమంది పనిగట్టుకుని కుట్రతో యూనియన్‌పై ఆరోపణలు చేస్తున్నారు. ఆరోపణలు చేసిన వ్యక్తికి ఏ సందేహం ఉన్నా వచ్చి చూసుకోవచ్చు.' అని యూనియన్ పాలకవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకటరమణ అన్నారు. శనివారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీ సమావేశ హాలులో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయ అనేది అందరికీ సంబంధించిన ఉమ్మడి బ్రాండ్ అని, కృష్ణా మిల్క్‌యూనియన్ తయారు చేసే ప్రతి ప్యాకెట్‌పై విజయ అని ఉంటుందని, విజయ బ్రాండ్ కింద కృష్ణా మిల్క్‌యూనియన్ అని ఉంటేనే తాము బాధ్యులమని తెలిపారు. యూనియన్ పేరు లేకుండా విజయ అని మాత్రమే ఉంటే అది తమకు సంబంధం లేదన్నారు. పాడిరైతుగా కవులూరు పాల సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న తాడికొండ రమేష్‌బాబు యూనియన్‌పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏ సందేహాలు ఉన్నా సర్వసభ్యసమావేశంతోపాటు, సంస్థ ఎండీతో మాట్లాడాలని, బహిరంగంగా సమావేశాలు పెట్టి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆధారాలు లేకుండా సంస్థపై ఆరోపణలు చేస్తే చట్టపరంగా చర్యలకు వెనకాడేదిలేదని సాయి వెంకటరమణ హెచ్చరించారు. టర్నోవర్ ఆధారంగా రేటు, బోనస్ ఇవ్వరని లాభాల ప్రకారమే ఇస్తారని తెలిపారు. చలసాని ఆంజనేయులు హయాంలో యూనియన్ లాభాల బాట పట్టిందన్నారు. రూ.142 కోట్లు లాభాల ద్వారానే రైతులకు బోనస్‌లను ఇస్తున్నామన్నారు. లావాదేవీలు పూర్తిగా బ్యాంకు ద్వారా, కేటాయింపులు టెండర్ల ద్వారా చేస్తామన్నారు. వీరవల్లి ప్లాంట్‌లో నాలుగు బోర్లు ఉన్నాయని, నీటి కొరత లేదన్నారు. ఫీడ్‌ప్లాంట్ కోసం జరిపిన కొనుగోలు జానకిరామయ్య హయాంలోనే జరిగిందన్నారు. టెండర్ పిలిస్తే రూ.25 లక్షలు డిపాజిట్ వదిలేసి ఆ కాంట్రాక్టర్ వెళ్లిపోయాడన్నారు. నష్టంలో నడిచే ప్రాజెక్టును అనవసరంగా నడుపుతున్నామనే భావన యూనియన్‌కు కలిగిందన్నారు. పాలప్రాసెసింగ్ యూనిట్ అనుకుని నిర్మాణం చేశామని తెలిపారు. అన్ని నిర్మాణాలు టెండర్ ప్రక్రియ ద్వారానే జరిగాయని, ట్రాన్స్‌పోర్టు కూడా పాత వారే చూసుకుంటున్నారని, రెండేళ్లకు ఒకసారి టెండర్ల ప్రక్రియలో పాల్గొని వారే దక్కించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, పల్లగాని కొండలరావు, అర్జా నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్టీసీలో ప్రమాదాల రేటు చాలా తక్కువ

● డ్రైవర్లకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రశంస
● ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు

బస్ స్టేషన్: 'దేశంలోని అన్ని ఆర్టీసీలకన్నా ఏపీఎస్ఆర్టీసీలో ప్రమాదాల రేటు చాలా తక్కువ(0.06)గా ఉంది. ఎన్టీఆర్ జిల్లాలోనూ డ్రైవర్లు మంచి నైపుణ్యంతో బస్సులు నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు తగ్గుతూ వస్తున్నాయి.' అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రశంసించారు. ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం విజయవాడ డిపో గ్యారేజీలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ విచ్చేశారు. డ్రైవర్లు మానసిక ప్రశాంతతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అప్రమత్తంగా ఉంటూ వాహనాలు నడపాలని కలెక్టర్ సూచించారు. ఇవన్నీ పాటిస్తే ప్రమాదశాతం సున్నాకు రావడం కష్టమేమీ కాదన్నారు. బస్సుస్టేషన్ ఆవరణలో డ్రైవర్లు జాగ్రత్తగా, అప్రమత్తంగా బస్సులు నడపాలని జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం సూచించారు. ఏపీఎస్ఆర్టీసీ భద్రతకు మారుపేరుగా నిలిచిందని జిల్లా రవాణా అధికారి ఎం.యేసుదానం అన్నారు. ప్రమాదాలను నివారించటానికి సంస్థ అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇందులో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని ఆయన తెలిపారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎ.జాన్ సుధాకర్, పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, పాల్గొన్నారు. ప్రమాదాలు జరగకుండా బస్సులు నడిపిన ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందించి సత్కరించారు. ప్రతి డిపో నుంచి ముగ్గురు డ్రైవర్ల చొప్పున కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం అధికారులు, సిబ్బందితో కలిసి స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. తడి, పొడి చెత్త వేరు చేయటం, పరిసరాలను పరిశుభ్రత, బయో వ్యర్థాలను వేరు చేయడంపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎ.జాన్ సుధాకర్, పర్సనల్ ఆఫీసర్ పి.వెంకటరమణ పాల్గొన్నారు.

జనసేన తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యుడి రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న పోలిశెట్టి తేజ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15 (ఫిబ్రవరి): తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యుడు, జనసేన ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు పోలిశెట్టి తేజ తన ఎంపీటీసీ పదవికి, మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని జడ్పీ సీఈవోకు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి హరిబాబు చివరి కోరిక మేరకు తాను రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు చెప్పారు. అందరి సహకారంతో తుమ్మలపాలెం గ్రామంలో సుమారు రూ.35 లక్షలతో అభివృద్ధి పనులు చేయించగలిగానన్నారు. ఇప్పటి వరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

కబ్జా గ్యాంగ్!

(5వ పేజీ తరువాయి)

ఉన్న కార్పొరేషన్ స్థలంపై ఓ వ్యక్తి కన్నేశాడు. సొసైటీ భూములు ఉన్న 60/2 సర్వే నంబరు, డాక్యుమెంట్లు ఆధారంగా కార్పొరేషన్ స్థలానికి అదే సర్వే నంబరుతో నకిలీ డాక్యుమెంట్లు పుట్టించాడు. నకిలీ డాక్యుమెంట్లు పుట్టించిన అనంతరం ప్రభుత్వ భూముల కబ్జాల్లో ఆరితేరిన గ్యాంగ్‌లను కలుపుకు న్నాడు. అంతా కలసి పక్కా ప్రణాళిక ప్రకారం కార్పొరేషన్ స్థలంలో సరిహద్దు రాళ్లు పాతి ఒక్కొక్క ప్లాటును 100 నుంచి 110 గజాలుగా విభజించి మొత్తం 36 ప్లాట్లు వేశారు.



ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించి జనవరి 28న కబ్జా స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్ సుగుణ(ఫైల్)

మైలవరంలో రిజిస్ట్రేషన్లు

ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని కబ్జా గ్యాంగ్ ఇక్కడ వాడుకుంది. నకిలీ డాక్యుమెంట్లను పుట్టించి మైలవరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించేశారు. అనంతరం సదరు స్థలాలను కొందరు అమాయకులకు అమ్మేసినట్లు కూడా తెలుస్తోంది. ఎనీవేర్ విధానం ద్వారా ఒక చోట భూమికి మరొక చోట రిజిస్ట్రేషన్ చేయాలంటే అధికారులు ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంది. కాని ఇక్కడ ప్రభుత్వ భూమికి మైలవరంలో రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు ఎన్‌వోసీ ఇచ్చినట్లు సమాచారం.

తహసీల్దార్ చర్యలు తీసుకున్న 20 రోజులకే..

ఇదే ప్రభుత్వ స్థలాన్ని గత 20 రోజుల కిందట కబ్జా చేసేందుకు ఈ గ్యాంగ్ సరిహద్దు రాళ్లు వేసిన విషయమై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన రూరల్ తహసీల్దార్ సుగుణ కబ్జా జరిగిన స్థలం దగ్గరకు వచ్చి టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి కార్పొరేషన్ స్థలంలో వేసిన సరిహద్దు రాళ్లను తొలగించివేశారు. ఆ సందర్భంలో సదరు స్థలం కార్పొరేషన్‌కు చెందినదిగా టౌన్‌ప్లానింగ్ అధికారులు, తహసీల్దార్ కూడా ధ్రువీకరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తహసీల్దార్ లేఖ కూడా రాశారు. అలాగే సదరు స్థలానికి ఫెన్సింగ్ వేయించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు. అధికారులు వెళ్లిపోగానే మళ్లీ కబ్జా గ్యాంగ్ రంగంలోకి దిగింది. కూలీలను పెట్టి మరీ తొలగించిన చోట మళ్లీ రాళ్లను పాతించి కబ్జా చేసింది.

కఠిన చర్యలు లేకపోవడం వల్లనే...

చాలా కాలంగా నగర శివారుల్లోని ఇరిగేషన్, కార్పొరేషన్, బుడమేరు సరిహద్దు ప్రాంతాల్లో అనేక ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురయ్యాయి. సర్వే నంబర్లు మార్చి నకిలీ డాక్యుమెంట్లు పుట్టించి ఎనీవేర్ విధానం ద్వారానో లేక అధికారుల చేతులు తడిపో కబ్జాకోరులు ప్రభుత్వ స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయించుకుని అమ్మేస్తున్నారు. కబ్జాదారులపై ప్రభుత్వ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోకపోవడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కబ్జాదారులపై కఠిన చర్యల తీసుకోవడంతో పాటు ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య అవసరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవడం ద్వారా వివిధ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు నేరుగా పొందవచ్చని ఏవో జె. భవాని సూచించారు. కానుమోలు, ఆరుగొలను, ఎస్.ఎన్.పాలెం గ్రామాల్లోని ఆర్బీకే (రైతు సేవా కేంద్రాల్లో) శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు 11అంకెల విశిష్ట సంఖ్య (యునిక్ ఐడీ) తప్పని సరిగా నమోదు చేయించుకోవాలన్నారు. కొత్తపల్లిలో మైక్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది శ్రావణి, నాగేంద్ర, పూర్ణచంద్రరావు, వీఏఏలు పాల్గొన్నారు.



యునిక్ ఐడీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో భవానీ

కొనసాగుతున్న దీక్షలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : డ్యూటీ చార్ట్ కౌన్సెలింగ్‌లో డిపో మేనేజర్ పక్షపాత, మొండివైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు శనివారం రెండో రోజు రిలేదీక్ష కొనసాగించారు. అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు, సభ్యుడు డీకే రావు రిలే దీక్షను ప్రారంభించారు. ఏ రాజేశ్‌కుమార్, జి సుబ్బారావు దీక్షలు పాల్గొనగా డిపో కమిటీ సెక్రటరీ పీఎం కృష్ణ, ప్రెసిడెంట్ కేఎస్ రావు, సభ్యులు, ఇతర డిపోల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.



రిలేదీక్షలో ఆర్టీసీ కార్మికులు

టీడీపీ నేత భావనారుషి మృతి

గన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లనపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కోలవెంటి భావనారుషి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం కన్నుమూశారు. ఆయనకు కొడుకు, కుమార్తె ఉన్నారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు త్రిపురనేని భాస్కరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, మాజీ వైఎస్ ఎంపీపీ సామల ఆంజనేయులు, బీబీగూడెం మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి రఘుబాబు, పద్మశాలి సేవా సంఘం నాయకులు నారదముని, బుజ్జిబాబు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు దార్న హనుమంతరావు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి..

కంకిపాడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన కంకిపాడులో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణతనపాడు శివారు తాళ్లూరి హైట్స్‌లో నివాసముంటున్న మట్టా వెంకటస్వామి (62) ఈ నెల 14న సాయంత్రం వాకింగ్ అంటూ బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో వెంకటస్వామి భార్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు ఓ వ్యక్తి కంకిపాడు సర్వీసు రోడ్డులో మృతి చెంది ఉన్నట్టు గుర్తించారు. గుండె పోటుతో చనిపోయారా లేక ఇంకేమైనా కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జంక్షన్ ఆర్వోబీపై వదిలేసిన గడ్డి ట్రాక్టర్

ప్రమాదభరితంగా గడ్డి ట్రాక్టర్

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులో ప్రమాదవశాత్తు ఆర్వోబీ వంతెనపై గడ్డి ట్రాక్టర్ పడి రెండు రోజులు అవుతుంది. ప్రమాదభరితంగా ఉన్న దానిని తొలగించే చర్యలను పోలీసులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం అప్పారావుపేట నుంచి గొల్లపల్లికి గడ్డిని రవాణా చేస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు రోడ్డు మార్జిన్‌లో బోల్తా కొట్టి ఒక యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. మరో ప్రమాదం జరగకుండా తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.



విమానాశ్రయంలో మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెటర్నరీ విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి

మంత్రి నారా లోకేశ్‌కు వెటర్నరీ కళాశాల విద్యార్థుల వినతి

గన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయానికి శనివారం వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు వెటర్నరీ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. చాలిచాలని స్టైఫండ్‌తో ఇబ్బంది పడుతున్నామని పెంచాలని కోరారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే చెన్నై నుంచి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కూడా వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం పవన్‌కల్యాణ్ రోడ్డు మార్గాన మంగళగిరి వెళ్లారు.

విమానాశ్రయంలో బాలకృష్ణ సందడి..

గన్నవరం విమానాశ్రయంలో ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ రాకతో సందడి వాతావరణం నెలకొంది. పద్మభూషణ్ అవార్డు అందుకున్న తరువాత తొలిసారిగా గన్నవరం రావటంతో అభిమానులు వచ్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, సినీ ఇండస్ట్రీకి వచ్చి 50ఏళ్లు అయ్యిందన్నారు. ప్రపంచమంతా నా పేరు వినిపిస్తుందంటే దానికి కారణం అభిమానులేనని చెప్పారు. అభిమానుల వల్లే పద్మభూషణ్ వచ్చిందని దానికి సంతోషంగా ఉందన్నారు.



పెనమలూరు ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలి

పెనమలూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎన్నికల్లో గుంటూరు, కృష్ణాజిల్లాల ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని పెనమలూరు టీడీపీ నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం టీడీపీ సీనియర్ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్‌ల ఆధ్వర్యంలో పెనమలూరు ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోటకూర ఉదయభాస్కర్, యలమంచిలి ప్రసాద్, చిగురుపాటి శ్రీనివాసరావు, మోర్ల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో టీడీపీ నేతల ప్రచారం

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి

కంకిపాడు : కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, షేక్ సలీం, జాషువ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని ప్రైవేట్ స్కూల్ టీచర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం. రవిబాబు ఉపాధ్యాయులను కోరారు. శనివారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండేపూడి నితీష్, మాతంగి వెంకటేశ్వరరావు, దయాల రాజీవ్, వంపుగాని చిన్న, అక్కినేని రాఘవేంద్రరావు, దయాల సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తుందని అందుకే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. వీరవల్లి, రంగన్నగూడెం, బండారుగూడెం, ఎ.సీతారాంపురం, కోడూరుపాడు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులను ఆళ్ల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బృంద సభ్యులు శనివారం కలిసి ఆలపాటికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గుండపనేని ఉమా వరప్రసాద్, ఆర్నేపల్లి సూరిబాబు, మండాది రవీంద్ర, లంక అజయ్‌కుమార్, పాండురంగారావు, , గండేపూడి నితీష్‌కుమార్, మాతంగి వెంకట్, దయాల రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.



కోడూరుపాడు, వీరవల్లిలో టీడీపీ నేత ఆళ్ల గోపాలకృష్ణ ప్రచారం

పిల్లల పోషకాహారంపై దృష్టి సారించాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే పోషకాహారంపై దృష్టి సారించడంతోపాటు ప్రీస్కూల్ నాన్ ఫార్మర్ విద్యా నాణ్యతను మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంఈవో-2 జె.సాంబశివరావు అన్నారు. ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు గత మూడు రోజులుగా జరుగుతున్న పోషణ్ బీ పఢాయి బీ శిక్షణా కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి, పాఠశాల హెచ్ఎం, సీహెచ్ అనిత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై డ్రైవర్లు శ్రద్ధ చూపాలి: ఎంవీఐ

గన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం పట్ల డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.పద్మాకర్ అన్నారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న రవాణ శాఖ వాహన పట్టుత్వ కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాలుశనివారం ఘనంగా ముగిశాయి. డ్రైవర్లకు బ్లడ్ గ్రూప్‌లు, బీపీ షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి 25 మంది స్కూల్ బస్ డ్రైవర్‌లకు హెల్త్ కార్డులను పద్మాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కూల్ బస్సుల నిర్వహణ విషయంలో యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. బస్సులు నడిపే డ్రైవర్లు ప్రతి మూడు నెలలకొకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంవీఐలు వై.నాగేశ్వరరావు, శివరామగౌడ్, ఎం.ఆలీ, జీవీఎస్ఎన్ మూర్తి, డివి రమణ, తదితరులు పాల్గొన్నారు.



హెల్త్‌కార్డు అందజేస్తున్న ఎంవీఐ వి.పద్మాకర్

గ్రామాల్లో వైద్యసేవలు అభినందనీయం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక శ్రీ మల్లికార్జున విద్యాసంస్థల ప్రాంగణంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, సూపర్ స్పెషాలిటీ వైద్యులచే వైద్యశిబిరం ఏర్పాటు చేయటం అభినంద నీయమన్నారు. ప్రజలు కూడా వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. త్వరలో గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మెదడు, నరాలు, షుగర్, థైరాయిడ్, జీర్ణకోశ, కీళ్లవాతం, ఊపిరితిత్తుల వ్యాధు లు, గుండెకు సంబం ధించిన పరీక్షలు 900 మందికి చేసి అవస రమైన వారికి మందులు అందజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్ నక్కిన చిన వెంకట్రాయుడు, ప్రిన్సిపాల్ దాసరి మాధవిలత, నక్కిన మహేష్, హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గిరిబాబు, కోనేరు కోటేశ్వరరావు, చిన్ని మా ధవి, టిఎస్ఆర్‌కె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

మస్కట్‌లో చిక్కుకున్న మహిళ

ఎమ్మెల్యే యార్లగడ్డ చొరవతో వెనక్కి

ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి గ్రామానికి చెందిన వేల్పూరి జ్యోతి ఉద్యోగ అవకాశం పేరుతో మోసపోయి మస్కట్ దేశానికి వెళ్లింది. ఆమెను ఇంటి పనుల కోసం తీసుకువెళ్లిన నకిలీ ఏజెంట్ అక్కడ తీవ్రమైన హింసకు గురిచేశాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించిన యార్లగడ్డ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారుల చొరవతో జనవరి 17న గ్రామానికి చేరుకుంది. శనివారం రాత్రి గన్నవరం క్యాంపు కార్యాలయంలో యార్లగడ్డను కలసి ధన్యావాదాలు తెలిపారు. అలాగే నున్న మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించటంతో 20 మంది మహిళలు వచ్చి యార్లగడ్డను కలసి ధన్యావాదాలు తెలిపారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందజేయాలి

జిల్లా పంచాయతీ అధికారి జె అరుణ

ఉయ్యూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లలో చెత్త ఇతర వ్యర్థాలను తడి, పొడిగా విభజించి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారి జె అరుణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కాటూరులో పర్యటించి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ శేషగిరిరావు, ఈఓ పీఆర్డీ కోటేశ్వరరావు, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

● కాటూరు పంచాయతీ కార్యదర్శి పీవీ సుబ్బారావుకు స్వచ్ఛ కృష్ణా పురస్కారం లభించింది. ఉయ్యూరు మండల పరిధిలో కలెక్టర్ నుంచి సుబ్బారావుకు పురస్కారం లభించగా శనివారం జిల్లా పంచాయతీ అధికారి జె అరుణ నుంచి జ్ఞాపిక ప్రశంసపత్రం అందుకున్నారు.

పెనమలూరు : మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యవంతంగా జీవించగలుగుతామని పెనమలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ రాజా పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మయ్య, పీహెచ్ఎన్ లక్ష్మీ, హెచ్‌వీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలోని బుద్ధవరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును శనివారం మండల ప్రత్యేకాధికారి డి.విజయవర్ధనరావు, ఎంపీడీవో పి.స్వర్ణలత పరిశీలించారు. ఈవోపీఆర్‌డీ టి.భారతి, ఏపీవో సత్యప్రియ, పంచాయతీ కార్యదర్శులు, సరోజిని, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలల్లో పంచాయితీ కార్యదర్శి చెన్నకేశవులు విద్యార్థులకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు.

ప్రసాదంపాడు : గ్రామాల్లోని చెత్తను వేర్వేరుగా విభజించి చెత్త డబ్బాల్లో వేయాలని ప్రత్యేక అధికారి పి. మురళీకృష్ణ అన్నారు. శనివారం నిడమానూరు పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.సుగుణ, పంచాయతీ కార్యదర్శి ఎన్. నరసింహారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : పరిసరాల శుభ్రత పట్ల విద్యార్థుల్లో అవగాహన పెరిగితే ఇంటి ఆవరణతో పాటు గ్రామాన్ని కూడా పరి శుభ్రంగా ఉంచుతారని బాపులపాడు మండల ప్రత్యేకాధికారి కె. శంకరరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో శనివారం ఎంపీడీవో కె.జోగేశ్వరరావు పర్యవేక్షణలో హెచ్ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాపులపాడు జడ్పీ హైస్కూ ల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



కాటూరు కార్యదర్శి పీవీ సుబ్బారావుకు స్వచ్ఛ కృష్ణా పురస్కారం అందజేస్తున్న డీపీవో అరుణ

కొత్తా.. నగరమండీ..!

గొల్లపూడి



గొల్లపూడిలో ఏర్పాటు చేసిన డీమార్ట్, స్టైల్ యూనియన్, రిలయన్స్ ట్రెండ్స్ షోరూమ్స్



గొల్లపూడి దగ్గర్లో ఏర్పాటు చేసిన క్రాస్ రోడ్స్ రెస్టారెంట్స్, మెక్ డొనాల్డ్స్, ఖలీల్‌బాయ్ రెస్టారెంట్

బెజవాడకు దీటుగా అభివృద్ధి చెందుతున్న గొల్లపూడి

- ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతానికి మరో విజయవాడ
- దిగ్గజ వ్యాపార సంస్థల స్థాపనతో దినదినాభివృద్ధి
- ఫ్యాషన్ వస్త్రాల దుకాణాలు.. ఫుడ్ సెంటర్ల ఏర్పాటు
- రానున్న రోజుల్లో మరింత విస్తరించడం ఖాయం

ఒకప్పుడు ఏం కావాలన్నా విజయవాడకు వెళ్లాలి! ఇప్పుడేం కావాలన్నా గొల్లపూడి వెళితే చాలు. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంత వాసులకు విజయవాడ కొరతను ఇప్పుడు గొల్లపూడి తీరుస్తోంది. ఏ అవసరాలకు విజయవాడ వెళుతున్నారో ఇప్పుడవన్నీ గొల్లపూడిలోనే దొరుకుతున్నాయి. దీంతో ఇటు ఇబ్రహీంపట్నం, మైలవరం, అటు నందిగామ వరకు గొల్లపూడిని విజయవాడగానే చూస్తోంది. ఎందుకంటే విజయవాడ అంటే షాపింగ్ క్రేజీతో వస్తుంటారు. అలాగే మంచి ఫుడ్, మంచి వైద్యం కోసం వస్తుంటారు. అలాగే విజయవాడలో కార్పొరేట్ షోరూమ్‌లు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడవన్నీ గొల్లపూడిలోనే కనిపిస్తూ మినీ విజయవాడలా మారిపోయింది. విజయవాడతో సమానంగా కమర్షియల్ హబ్‌గా గొల్లపూడి విస్తరిస్తోంది. మినీ విజయవాడగా మారిపోతున్న గొల్లపూడిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, ఆంధ్రజ్యోతి

విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 65) రెండు వైపులా విస్తరించిన గొల్లపూడిలో అభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతోంది. ఇప్పటికే నగరంలో ఉన్న అనేక రకాల ప్రముఖ వ్యాపార, ఆహార, వాణిజ్య సంస్థల బ్రాంచ్‌లు గొల్లపూడిలో నెలకొల్పబడ్డాయి. మారుతున్న కాలానికనుగుణంగా మనుషుల అభిరుచులు, కోర్కెలు మారుతుండటంతో వ్యాపారులు సైతం అందుకు అనుగుణంగా తమ వ్యాపార పద్ధతులను మార్చేస్తున్నా రు. ఒకప్పుడు విజయవాడ వెళితే కాని లభించని అనేక బ్రాండెడ్ దుస్తులు, చెప్పులు, షూలు, గృహోపకరణాలు ఇప్పుడు గొల్లపూడినేలో లభిస్తున్నాయి.

ప్రముఖ కంపెనీల స్థాపన

గొల్లపూడిలో వ్యాపారం విస్తరించడానికి అనువైన వాతావరణం ఉంది. ఉత్తరం వైపు అపార్ట్‌మెంట్స్ నిర్మించేందుకు అనువైన భూములున్నాయి. ఇప్పటికే అనేక అపార్ట్‌మెంట్స్, విల్లాల నిర్మాణాలు జరుగుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వ్యాపారం విస్తరించేందుకు ప్రముఖ బహుళ జాతి కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే ఆంధ్ర ఆసుపత్రి, సోనోవిజన్, డీమార్ట్, ట్రెండ్‌సెట్, విజేత సూపర్ మార్కెట్, టయోటా కార్ల షోరూమ్, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్స్ షోరూంలు ఏర్పాటు చేశారు. మైలురాయి సెంటర్లో కొత్తగా స్టైల్ యూనియన్ నెలకొల్పుతున్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి అనేక టైల్స్, మార్బుల్స్ కంపెనీలు ఇక్కడే ఉన్నాయి. ఇదిలాగే దినదినాభివృద్ధి చెందుతూ ఉంటూ భవిష్యత్‌లో గొల్లపూడి మరో కూకట్‌పల్లి కావడం ఖాయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమ బైపాస్ మరో ఎసెట్



విజయవాడ పశ్చిమ బైపాస్

గొల్లపూడిలో వ్యాపారాభివృద్ధికి ఇటీవల నిర్మించిన పశ్చిమ బైపాస్ మరో ఎసెట్‌గా నిలుస్తోంది. గొల్లపూడిని కలుపుతూ కృష్ణానది మీదుగా రాజధాని నగరానికి నిర్మిస్తున్న వంతెనతో గొల్లపూడి దశ మారబోతోంది. ఇది వ్యాపారాభివృద్ధికి మరింత దోహదం చేస్తుందనే చెప్పాలి. విజయవాడతో సంబంధం లేకుండా రాజధాని అమరావతి నుంచి నేరుగా గన్నవరం వైపు వెళ్లే అనేక మందికి గొల్లపూడి ఒక ప్రత్యామ్నాయం. అందుకే వ్యాపారులు చూపు గొల్లపూడిపై పడింది.

ఫుడ్ ప్రియులకు మస్త్

జిహ్వా చాపల్యం ఉన్న భోజన ప్రియులకు అనుకూలమైన హోటళ్లు సైతం ఉన్నాయి. వన్ సెంటర్‌లో క్రాస్‌రోడ్‌తో పాటు స్వీట్ మ్యాజిక్ మిఠాయి దుకాణం ఉంది. అంతేకాక ఖలీల్‌భాయ్ రెస్టారెంట్ దగ్గర్లోనే ఉంది. ఇలా అనేక రకాల భోజన హోటల్స్, బిర్యానీ సెంటర్లున్నాయి.

గ్రేటర్‌లో కలిపే అవకాశం

భవిష్యత్‌లో గొల్లపూడి గ్రేటర్ విజయవాడలో కలిసే అవకాశం ఉండటం ఈ అభివృద్ధికి మరో కారణం. గ్రేటర్‌లో కలిపితే విజయవాడతో మరింత పోటీ పడి మరీ అభివృద్ధి జరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

పోలీసులంటే ధైర్యం.. న్యాయవాదులతో న్యాయం

● హోం మంత్రి అనిత



హోంమంత్రి వంగలపూడి అనితను గజమాలతో సత్కరిస్తున్న ఏపీపీలు

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ధైర్యమిచ్చేవారు పోలీసులైతే ప్రజలకు న్యాయం చేసేవారు న్యాయవాదులని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. లబ్బీపేటలోని వైవీ రావు ఆసుపత్రి రోడ్డులో ఉన్న జీఆర్‌టీ హోటల్‌లో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆధ్వర్యంలో డిజిటల్ ఎవిడెన్స్ ప్రాముఖ్యత గురించి రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఎంతటి వారైనా కోర్టుకొస్తే చేతులు కట్టుకొని నిల్చునేంతటి గౌరవం న్యాయవ్యవస్థకు ఉందన్నారు. దొంగ, నేరస్థుడు దొరికినా చట్టప్రకారమే శిక్షించాల్సి రావడంతో కేసు పూర్తయ్యే వరకు ప్రతి విషయం కీలకమేనన్నారు. విజయనగరం జిల్లాలోని రెండు కేసుల్లో నిందితులకు 6 నెలల్లోపే శిక్షలు వేయించడం జరిగిందన్నారు. న్యాయవ్యవస్థకు అవసరమైన వనరులు, వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రొటోకాల్ లేకుండా ట్రాఫిక్‌లో ప్రయాణించి ప్రజల కష్టాలను తెలుసుకొనే ప్రయత్నం చేశానన్నారు. ఏ కష్టం కలిగినా కాపాడేది పోలీసులేనన్న ఆమె ప్రజల అభిప్రాయాలను మనం అర్థం చేసుకోవాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో సైబర్ మోసాలు, ఆర్థిక కుంభకోణాలు, ఆన్‌లైన్ వేధింపులు, డిజిటల్ ఐడెంటిటీ దొంగతనాలు విపరీతంగా పెరిగాయని, ఈ పరిస్థితుల్లో న్యాయస్థానంలో సమర్థమైన తీర్పుల కోసం డిజిటల్ సాక్ష్యాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఏపీపీల 5 జీ డేటా సిమ్‌కార్డుల కొనుగోలుకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసిందన్నారు. పరిశోధన, ప్రాసిక్యూషన్ వ్యవస్థ బలోపేతానికి రూ.42 లక్షలు, ప్రాసిక్యూటర్లు, కోర్టులు, పోలీసు వ్యవస్థ మధ్య సమర్థవంతమైన సమాచార వ్యవస్థకు 465 లాప్‌టాప్‌లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నట్టు బైరా తెలిపారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ నేరాలను చేధించడానికి డిజిటల్ ఆధారాలు కీలకమన్నారు. సీసీ టీవీ ఫుటేజ్, మొబైల్ కాల్ రికార్డులు, ఈ-మెయిల్స్, సోషల్ మీడియా సంభాషణలు, జీపీఎస్ డేటా, ఆన్‌లైన్ లావాదేవీలు, ఫోరెన్సిక్ డేటా వంటి ఆధారాలు నేరపరిశోధనలో సహాయపడతాయనానరు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స (ఏఐ), ఫోరెన్సిక్ టూల్స్ ద్వారా ఆధారాలను ధ్రువీకరించి, న్యాయపరగా సమర్థంగా ఉపయోగించవచ్చన్నారు. జాయింట్ డైరక్టర్లు వి.రాజేంద్రప్రసాద్, విజయ మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాల విషయంలో ఒక ప్రధాన సమస్య ఏంటంటే తక్కువ శిక్ష విధింపు, బాధితులు ముందుకు రావడానికి భయపడటం, సాక్ష్యాల కొరత, విచారణలో జాప్యం, నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకోవడం వంటి అంశాలు ప్రధాన కారణాలన్నారు. కేసులను సమర్థంగా నడపడానికి అవసరమైన ఫోరెన్సిక్ ఆధారాలు సకాలంలో సేకరించలేకపోవడం, పోలీసు దర్యాప్తులో లోపాలు, బాధితులపై సామాజిక ఒత్తిడి, పోక్సో, నిర్భయ యాక్ట్, డొమెస్టిక్ వయొలెన్స్ యాక్ట్ లాంటి చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. అనంతరం హోం మంత్రి అనితను ఏపీపీలందరూ కలిసి గజమాలతో సత్కరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఏపీపీలు పాల్గొన్నారు.

తిరువూరు మున్సిపాల్టీలో ముసలం

చైర్ పర్సన్‌పై అవిశ్వాసం దిశగా అడుగులు వేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు..!



తిరువూరు, ఆంధ్రజ్యోతి: స్థానిక మున్సిపాలిటిలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టే దిశగా కొందరు వైసీపీ కౌన్సిలర్లు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్టు సమాచారం. ఈ మార్చి 18 నాటికి పాలవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి కావస్తుండటంతో అసమ్మతివాదులు తమ తమ ప్రయత్నాలకు తెరతీశారు. కొద్దిరోజులుగా కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సభ్యుల్ని సమీకరించుకునే పనిలో పడ్డారు. కొందరు సభ్యులు న్యాయనిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. అవసరమయితే ప్రతిపక్షమైన టీడీపీ సభ్యుల మద్ధతు పొందేందుకు, కొందరు పెద్దలు రంగంలోకి దిగితున్నట్టు తెలుస్తోంది. మున్సిపాలిటీలో 20 వార్డులకు 17 వార్డులు వైసీపీ దక్కించుకోగా, టీడీపీ 3 వార్డులకే పరిమితమైంది. వైసీపీ ఎక్కువ స్థానాలు సాధించినా, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు వివాదస్పదమయ్యాయి. మున్సిపల్ చైర్మన్‌గా స్థానిక అధిష్టానం (అప్పటి ఎమ్మెల్యే రక్షణనిధి) సూచించిన పేరును కాదని, రాష్ట్ర పార్టీ మరో పేరును సీల్డ్ కవర్‌లో పంపింది. పార్టీ ఆదేశాలతో గత్తం కస్తూరిబాయి చైర్మన్‌గా 2021 మార్చి 18న ప్రమాణ స్వీకారం చేశారు. రెండున్నరేళ్ల తరువాత దిగిపోవాలని, తర్వాత స్థానిక నాయకత్వం సూచించిన వారు చైర్మన్‌గా బాధ్యత స్వీకరిస్తారని అప్పటి ఎమ్మెల్యే ముందుగానే కండిషన్ పెట్టారు. ఒప్పంద కాలం పూర్తవడంతో చైర్మన్ రాజీనామా అంశాన్ని వైసీపీకి చెందిన కొందరు సభ్యులు తెరపైకి తెచ్చారు. ఒప్పందం ప్రకారం దిగిపోయేందుకు ప్రస్తుత చైర్‌పర్సన్ సుముఖత చూపించకపోవడం, తనకు ఈ పదవి రాష్ట్ర పార్టీ అదిష్టానం ఇవ్వడం వల్ల వారు చెబితేనే దిగుతానంటే తేల్చి చెప్పడంతో, అప్పటి నుంచి వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్‌కు ఎదురు తిరగసాగారు. బోర్డుపై విమర్శలు చేయడం, కొన్ని సమావేశాలకు గైర్హాజరవడం వంటి చర్యలతో నిరసనను వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యులు సైతం సమావేశం మందిరం వద్దకు వచ్చినా కౌన్సిల్‌లోకి వెళ్లకపోవడంతో, కోరం లేక వరుసగా 2 నెలలు సమావేశాలు వాయిదాపడ్డాయి. తదుపరి కొందరు పెద్దల జోక్యంతో సమావేశాలకు హాజరౌతున్నా అసమ్మతిని మాత్రం వినిపిస్తున్నారు. ఇప్పటికే వైసీపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లలో 8 మంది సభ్యులు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతూనే, అవిశ్వాసానికి అవసరమైన మద్దతు సమీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న నల్లగట్ల స్వామిదాసు, నాటి ఒప్పందాలు తనకు తెలియవని, ఈ వివాదాస్పద అంశానికి దూరంగా ఉన్నట్టు తెలుస్తుంది.



కౌన్సిల్‌లో పాల్గొన్న సభ్యులు (ఫైల్ ఫొటో)

ఫేక్ జాబ్ రాకెట్ పట్ల అప్రమత్తత అవసరం

● రైల్వే పీఆర్వో నుస్రత్

రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్న రాకెట్ పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని నిరుద్యోగులు తప్పుడు ప్రచారాలు చేస్తూ రిక్రూట్‌మెంట్ స్కాంలు నడుపుతున్న వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. రైల్వేలో ఉద్యోగాల భర్తీ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా పక్కాగా నడుస్తాయన్నారు. ఇటీవల విద్యార్థులతో పాటు నిరుద్యోగులు కూడా దళారులు ద్వారా మోసపోతున్నారని, మోసగాళ్లు సెల్‌ఫోన్లలో, ఈ-మెయిల్స్ ద్వారా తప్పుడు సమాచారాలను పంపించి, నిరుద్యోగుల్లో ఆశ కల్పిస్తున్నారన్నారు. అభ్యర్థులతో నేరుగా మాట్లాడి తప్పుడోవ పట్టిస్తున్నారన్నారు. సీనియర్ అధికారులకు చెందిన సంతకాలను ఫోర్జరీ చేసి నియామక పత్రాలు కూడా ఇస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని రైల్వే డివిజన్ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల డివిజన్ కమర్షియల్ విభాగంలో ఉద్యోగం ఉందంటూ ఒక మహిళను మోసగించి రూ.9లక్షలు కాజేసిన వైనం ఉందన్నారు. రైల్వే ఉద్యోగాల నియామక ప్రక్రియలో మధ్యవర్తులు, ఏజెంట్ల ప్రమేయం అస్సలు ఉండదన్నారు. నిరుద్యోగులు ఉద్యోగావకాశాల ప్రకటనలను నిజమైనవా, కావా అని పరిశీలించుకోవాలన్నారు. ఏ సమాచారం ఇవ్వటానికైనా అధికారులు సిద్ధంగా ఉంటారన్నారు.

నా హత్యకు ఎన్టీటీపీఎస్ యాజమాన్యం కుట్ర

● అక్కల రామ్మోహన్‌రావు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్ కాలుష్యంపై పోరాటం చేస్తున్నానని ట్యాంకర్‌తో ఢీకొట్టి తనను హత్య చే సేందుకు ఎన్టీటీపీఎస్ యాజమాన్యం కుట్ర చేసిందని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ) ఆరోపించారు. శనివారం ఆయన కొండపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 13న రాత్రి విజయవాడలో సమావేశం ముగించుకొని తిరిగి కారులో వస్తు న్న తనను బూడిద ట్యాంకర్‌తో ఢీకొట్టే ప్రయత్నం చేశారన్నారు. కొత్తగేటు వద్ద భద్రతా సిబ్బందికి చెప్పినా సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఈ ప్రమాదం వెనుక కుట్ర కోణం దాగి ఉందన్నారు. సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీపీ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో జనసేన జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బొలియశెట్టి శ్రీకాంత్, చెరుకుమల్లి సురేష్, యర్రంశెట్టి నాని, బాబి, అనిత, కౌసల్య పాల్గొన్నారు.

విజయ డెయిరీలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని వీటిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో పాడిరైతు తాడికొండ రమేష్‌బాబు మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి విజయ డెయిరీకి పాలు పోస్తున్న పాడి రైతులను డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ అనిల్‌కుమార్ మోసం చేస్తున్నారన్నారు.

లక్ష్య నిర్దేశంతోనే జీవితంలో రాణింపు

● సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్

వన్‌టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యా న్ని ఏర్పరచుకుని దాన్ని సాధించినప్పుడు జీవితంలో మంచిస్థాయికి ఎ దుగుతారని, రాణిస్తారని ప్రముఖ సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నా రు. శనివారం కొత్తపేటలోని పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 17వ వార్షికోత్సవం ఆ కాలేజీ ప్రాంగణంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో మంచి స్థాయి లభించే వరకు పాటుపడాలన్నారు. తాను 48ఏళ్లుగా సినిమా రంగంలో రాణించటం అందరి ఆశీర్వచనాలతో పాటుగా కృషి సైతం దాగుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు భవిరి రవి, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలువాది మల్లికార్జునరావు, చిట్టా అమర సుధీర్ కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు సి.హెచ్.ఆనంద్ సుధాకర్, పి.సురేంద్ర కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణ కుమార్, కళాశాల కమిటీ ప్రముఖులు గ్రంధి సందీప్, శేగు రామకృష్ణ, ఆర్.దత్త సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



నటుడు రాజేంద్ర ప్రసాద్‌ను సత్కరిస్తున్ననిర్వాహకులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

వ్యర్థాల నుంచి సంపద

● చీఫ్ సెక్రటరీ విజయానంద్

పాయకాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దనే వ్యర్థాలను వేరు చేసి సంపదను సృష్టించాలని తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వాటిని రీసైకిల్ చేసేలా అందరూ సహాయపడాలని చీఫ్ సెక్రటరీ కే విజయానంద్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ సెంటర్‌లో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే విజయానంద్ వాక్‌థాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఇంటి వద్దనే వ్యర్థాలు వేరు చేసే ప్రక్రియను అవగాహన కల్పించేలా నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. దోమ కాటుతో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్, డ్రోన్ స్ప్రేయింగ్, యాంటి లార్వా ఆక్టివిటీస్ చేసే స్టాళ్లను సందర్శించారు. అనంతరం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన వ్యర్థాలకు 3 రంగుల బుట్టలను వీఎంసీ అందిస్తోందన్నారు. అలాగే ప్రతి ఇంటి వారు వ్యర్థాలను వేరు చేసి చెత్తను ఇవ్వాలన్నారు.

పన్ను చెల్లింపు దేశభక్తితో సమానం

● ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ వరీందర్ మెహతా

వన్‌టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించటం దేశ భక్తితో సమానమని, దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతోనే పన్నులు చెల్లించాలని ఆదాయపు పన్ను చీఫ్ కమిషనర్ వరీందర్ మెహతా అన్నారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం శనివారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి సభను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ దేశం శక్తివంతంగా ఎదగాలంటే ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గౌరవ అతిథి రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ కస్టమ్స్ ఉద్యోగులు దేశ భవిష్యత్తుకు దశ, దిశ నిర్దేశకులని ప్రశంసించారు. కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్ పరిధిలో రూ.11,480 కోట్లు వసూలు సాధించి లక్ష్యానికి చేరువలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా ఏపీ అవయవదాతల అసోసియేషన్ వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మిని, తమ అవయవాలను దానం చేస్తామని ప్రతిజ్ఞ చేసిన 36 మంది కస్టమ్స్ ఉద్యోగులను ఈ సందర్భంగా సత్కరించారు. కస్టమ్స్ అదనపు కమిషనర్లు కాకరాల ప్రశాంత్ కుమార్, జి.రామకృష్ణరాజు యాదవ్, అబ్దుల్ అజీమ్, వేణు పాల్గొన్నారు.

జాతీయ సాంఘిక నాటికల పోటీలు ప్రారంభం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యూత్ స్పోర్ట్స్ కల్చరల్ ఫోరం, కళావిపంచి, శ్రీ కృష్ణా తెలుగు థియేటర్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించే సాంఘిక నాటిక పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి నాటికగా మహతి క్రియేషన్స్ వారి ఉక్కు సంకెళ్లు ప్రదర్శించారు. 1840లో కలకత్తాలోని ఈస్ట్ ఇండియా కంపెనీ అక్కడి జాలర్లపై పన్ను విధిస్తుంది. జాలర్లకు మద్దతునిస్తూ రాణీ రాష్మోని ఉద్యమం చేస్తుంది. ఈ నేపథ్యంలో నాటిక సాగుతుంది. రెండో నాటికగా హేలాపురి కల్చరల్ అసోసియేషన్ వారి 'సారీ రాంగ్ నెంబర్' నాటికను ప్రదర్శించారు. భారతీయ వివాహ వ్యవస్థకు మూలం సనాతన ధర్మం కాని నేడు అది తన ఉనికిని కోల్పోతుంది. మగవాడు వరిస్తే వ్యామోహంలో పడితే ఏం జరుగుతుందో చెప్పడమే నాటకం ప్రధాన ఉద్దేశ్యం. మూడో నాటికగా న్యూస్టార్ మోడరన్ థి యేటర్ '27వ మైలురాయి' నాటికను ప్రదర్శించారు. కార్యక్రమాలను ఎఅండ్‌పీఆర్ జాయింట్ డైరెక్టర్ పోతుల కిరణ్‌కుమార్ ప్రారంభించారు. సాహిత్యమైన నాటకమైన, సినిమా అయినా సామాజిక ప్రయోజనం కలిగి ఉండాలన్నారు. వివిధ రంగాలకు చెందిన హెచ్‌ఆర్‌ఎస్ ప్రసాద్, జవ్వాది దాశరధి శ్రీనివాస్, జీవీజీ శంకర దొరన నరసింహారావు, అంకం భుజంగరావు పాల్గొన్నారు.

వంశీకి ప్రాణహాని ఉంది

● వల్లభనేని పంకజశ్రీ

విజయవాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జైలులో వల్లభనేని వంశీకి ప్రాణహాని ఉందని ఆయన సతీమణి పంకజశ్రీ వ్యాఖ్యానించారు. విజయవాడ గాంధీనగర్‌లోని జిల్లా కారాగారంలో ఉన్న ఆయనను ఆమె కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "వంశీని అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. ఆయనను మెంటల్‌గా టార్చర్ పెడుతున్నారు. వంశీ ఉన్న బ్యారక్‌లో 60 సీసీ కెమెరాలు పెట్టారు. ఆయన ఆరోగ్యం బాగుందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వంశీ శ్వాస సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యవహారంపై కోర్టుకు వెళ్తాం. నేరం రుజువు కాకుండానే బంధించారు. వంశీపై తప్పుడు కేసులు పెట్టారు. వైఎస్ జగన్ ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. వైసీపీ అన్ని రకాలుగా అండగా ఉంది" అని చెప్పారు.

వారానికి రెండు ములాఖత్‌లు

వల్లభనేని వంశీని ఆయన సతీమణి పంకజశ్రీ, ఆయన సోదరుడు, మేనకోడలు జైలులో ములాఖత్‌లో శనివారం కలిశారు. సుమారుగా 40 నిమిషాలు న్యాయపరంగా వేయాల్సిన అడుగులపై వంశీ వారితో చర్చించినట్టు సమాచారం. కుటుంబ సభ్యులను కలవడానికి ఆయనకు వారానికి 2 ములాఖత్‌లను జైలు అధికారులు ఇచ్చారు.


ఎక్స్‌పీరియం ముఖద్వారం వద్ద రామ్‌దేవ్‌రావు
జపాన్ పార్కులో కొలను
సెల్ఫీ పాయింట్
బోధివృక్షం మధ్య బుద్ధుడి విగ్రహం

ఎక్స్‌పీరియం.. హైదరాబాద్‌కు ఇప్పుడొక ప్రత్యేక ఆకర్షణ. అక్కడేమున్నాయి? వేల ఏళ్ల క్రితం నాటి చెట్లు.. చెట్లేగా అనుకుంటున్నారా? అవి సాదా సీదా చెట్లు కాదు.. వాటిని కోట్లు పెట్టి కొనడానికి అనేక మంది ముందుకు వస్తున్నారు.. ముఖేష్ అంబానీ, హీరో ప్రభాస్ వంటి వారి ఇళ్లలో ఉండే 3500 ఏళ్ల క్రితం నాటి రూ.4 కోట్ల కల్పవృక్షం అక్కడ కనిపిస్తుంది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వేల వృక్ష జాతులు కనులకు విందు చేస్తాయి. అలాంటి ఎక్స్‌పీరియం రామ్‌దేవ్‌రావు అనే ఒక వ్యక్తి కల అంటే ఆశ్చర్యం వేస్తుంది. "ఇది నాకు వ్యాపారం కాదు.. నా జీవితం" అంటారాయన! అలాంటి ఎక్స్‌పీరియంలోని విశేషాలేమిటో చూద్దామా...

ఎకోఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం

అబ్బురపరిచే అద్భుత లోకం

రామ్‌దేవ్‌రావు తల్లితండ్రులది వరంగల్ జిల్లాలోని నెక్కొండ. తండ్రి నారాయణరావు అటవీ కాంట్రాక్టర్. చెట్లను నరికి అమ్మడం ఆయన పని. కానీ ఆయన ప్రకృతి అంటే మమకారం. చెట్లు నరుకుతూ ఉంటే అడవులు అంతరించిపోతాయని ఆయనకు కలత చెందారు. 80 ఎకరాలలో సొంతంగా ఒక అడవిని పెంచారు. రామ్‌దేవ్ పెరిగింది ఆ అడవిలోనే. ప్రకృతిని కాపాడాలనే ఆలోచన పుట్టింది కూడా ఆ అడవిలోనే! ఆ తర్వాత ప్రపంచంలోని అనేక దేశాలను


స్టెయిన్‌లెస్ స్టీల్‌తో మలిచిన గుర్రం

తిరిగి చెట్లను సేకరించి వాటిని మన దేశానికి తీసుకువచ్చి పెంచటం ప్రారంభించారు. ఎవ్వరి దగ్గర లేని చెట్లను అందించటం ఆయన ప్రత్యేకత. దీనితో అనేక మంది ప్రముఖులు ఆయన దగ్గర నుంచి చెట్లు కొనుగోలు చేయటం మొదలుపెట్టారు. రామ్‌దేవ్ ఆలోచన అక్కడితోనే ఆగిపోలేదు. ప్రపంచంలోనే ఎక్కడా లేనన్ని చెట్లను ఒక చోటకు తీసుకురావాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ ఆలోచనల రూపమే ఎక్స్‌పీరియం. 150 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఇలాంటి పార్కు ప్రపంచంలోనే ఎక్కడా లేదనటం అతిశయోక్తి కాదు. ఒక్కసారి ఈ పార్కులోకి అడుగుపెడితే రకరకాల మొక్కలు సందర్శకులను కళ్లు తిప్పుకోనివ్వవు. అందుకే వెయ్యిరూపాయల ఎంట్రీ టిక్కెట్టు కొని... వేల మంది ఈ ఎక్స్‌పీరియంకు వస్తున్నారు.

అన్ని వ్యాపారాలూ వదిలేసి...

మొక్కలపై ఉన్న ఆసక్తితో రామ్‌దేవ్ తన అన్ని వ్యాపారాలనూ వదిలేశారు. ప్రపంచంలో పేరొందిన నర్సరీలను చూసేందుకు ఇప్పటి వరకు 78 దేశాలు తిరిగారు. ఎక్స్‌పీరియంలోని మొక్కల విలువ కోట్లలో ఉంటే.. ఆ భూమి విలువ మాత్రం వెయ్యి కోట్లకు పైనే ఉంటుంది. "ఇంత విలువైన భూమిలో రియల్‌ఎస్టేట్ చేస్తే ఎక్కువ లాభం వస్తుంది కదా?" అని ఎవరైనా ఆయన్ని ప్రశ్నిస్తే చిన్నగా నవ్వుతారు. "ఇది నాకు హాబీ. ఇష్టమైన పని. ఉన్న వ్యాపారాలన్నీ ఎప్పుడో వదిలేశా. ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎందుకు?" అంటారాయన. ఎక్స్‌పీరియం నిర్వహణకు ప్రతి నెల మూడు కోట్లకు పైనే ఖర్చు అవుతుంది. "అందుకే సందర్శకులకు టిక్కెట్టు పెడుతున్నాం. ఆదాయం కోసం కాదు" అంటారాయన.

'కల్పవృక్షం' ప్రత్యేకత!

ఇక్కడ నర్సరీలో ప్రపంచంలోనే అరుదైన కల్పవృక్షాలు ఉన్నాయి. ఇందులో 3500 సంవత్సరాల కల్పవృక్షం ప్రత్యేక ఆకర్షణ. దీని ఖరీదు అక్షరాలా రూ.4కోట్లు. ఆఫ్రికా నుంచి దీన్ని తీసుకువచ్చారు. అలాగే ఇక్కడ ఉన్న 1500 ఏళ్ల వయసుగల కల్పవృక్షాలు కూడా అందరినీ ఆకట్టుకుంటాయి. దేశంలో ఇలాంటి మొక్కలు రామ్‌దేవ్‌రావువద్ద కాకుండా ప్రముఖ పారిశ్రామిక వేత్త ముఖేష్ అంబానీ, ప్రముఖ హీరో ప్రభాస్ ఇళ్లలో మాత్రమే ఉన్నాయి. ఈ ఒక్కో కల్ప వృక్షం ఖరీదు అక్షరాల కోటి రూపాయలు. హీరో ప్రభాస్ తాను కొత్తగా కడుతున్న ఇంటి కోసం నాలుగు వృక్షాలను ఇక్కడ కొనుగోలు చేసి తీసుకు వెళ్లారు. ఈ 1500 ఏళ్ల కల్పవృక్షాలు మరో 5 వేల ఏళ్ల వరకు పెరుగుతాయని రామ్‌దేవ్ చెబుతున్నారు.

మనసు పడితే కొనేస్తారు

చెట్లు అమ్మడమే కాదు... కొనడం కూడా ఆయనకు హాబీనే. ప్రపంచంలో ఎక్కడైనా అరుదైన మొక్క కానీ, చెట్టు కానీ ఉందని తెలిస్తే అక్కడ వాలిపోతారు. చూసింది మనసుకు నచ్చితే ఎంత ఖర్చైనా దాన్ని కొనేసి ఇక్కడకు తీసుకువచ్చి తన పార్కులో పెట్టుకుంటారు. ఇలా బయట దేశాల నుంచి ఆయన కొనుగోలు చేసిన చెట్ల ఖరీదు వందల కోట్లలో ఉంటుంది. ఎక్స్‌పీరియంలో 150 ఏళ్ల వయసు ఉన్న బోధివృక్షం కనిపిస్తుంది. ఇది ఇండోనేషియాలోని జావా ద్వీపకల్పంలోనిది. దీనిని రూ.60లక్షలకు కొని ఇక్కడకు తరలించారు. ఈ చెట్టు కొమ్మలు, ఆకులను కట్ చేసి 'కమలం' ఆకారం తీసుకువచ్చి మధ్యలో బుద్ధుడి విగ్రహాన్ని పెట్టి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ చెట్టును ఇలా తీర్చిదిద్దటానికి రాందేవ్ 75 లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. 2008 చైనాలో ఒలింపిక్స్ జరిగిన సమయంలో ఓ నర్సరీ యజమాని ఒక చెట్టును ఒలింపిక్స్ చిహ్నాలతో రూపుదిద్దాడు. దీని కోసం అతను 5 ఏళ్లపాటు శ్రమించాడు. ఒలింపిక్స్ సమయంలో చైనాలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తరువాత కాలంలో ఈ చెట్టును కొనేందుకు ఎంతో మంది ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు దాన్ని రామ్‌దేవ్ 50 లక్షలకు కొనుగోలు చేశారు.


చైనా నుంచి తెచ్చిన ఒలింపిక్ వృక్షం

హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులో నిర్మించిన అతిపెద్ద ఎకో పార్క్.. ఎక్స్‌పీరియంకు ఇప్పటి దాకా అయిన ఖర్చు రూ.450 కోట్లు. అర్జెంటీనా, మెక్సికో, థాయ్‌లాండ్, ఉరుగ్వే, ఇటలీ, స్పెయిన్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా, మెక్సికో మొదలైన 85 దేశాల నుంచి తెప్పించిన 25 వేలకు పైగా మొక్కలు, వృక్షాలు ఇక్కడ కనిపిస్తాయి. వీటి ధర మార్కెట్లో వేల కోట్ల రూపాయలు ఉంటుంది. ఈ పార్క్‌లో రకరకాల కార్యక్రమాలు నిర్వహించుకోవటానికి కూడా అవకాశముంది. దీనిలో 1500 మంది కూర్చోవడానికి వీలైన యాంఫీ థియేటర్ ఉంది. రూ.50 కోట్లతో నిర్మించిన గ్లో గార్డెన్ ప్రపంచంలోనే మొదటిది. సహజమైన రాతితో మలచిన తొలి బార్ కౌంటర్.. అతిపెద్దదైన స్నో పార్క్.. బాక్స్ క్రికెట్ సౌకర్యం ఇక్కడ ఉన్నాయి. అలాగే 10 వేల మంది కూర్చోవడానికి వీలైన కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు.



ఎలా తీసుకువస్తారు?

సుదూర ప్రాంతాల నుంచి వృక్షాలను శాస్త్రీయమైన పద్ధతిలో తరలిస్తారు. వీటిని బయటకు తీసే సమయంలో... మళ్లీ తిరిగి నాటే సమయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. చెట్లను వేర్లతో పాటుగా బయటకు తీసుకువచ్చి రసాయనాలతో పూత పూస్తారు. ఆ తర్వాత వాటిని తీసుకువచ్చి నాటుతారు. ఈ ప్రక్రియను చాలా జాగ్రత్తగా నిర్వహించాలి. లేకపోతే చెట్టు చనిపోయే అవకాశముంది.

సృజనాత్మకతతో...

రామ్‌దేవ్ స్వతహాగా చిత్రకారుడు. దీనితో మొక్కలను, చెట్లను ఏఏ డిజైన్లలో పెంచాలనే విషయాన్ని ఆయన నిర్ణయిస్తారు. ఇలా పుట్టిందే ప్రపంచంలో అతి పెద్ద గ్రీన్ డోమ్. అనేక చెట్ల సముదాయాలతో ఉండే ఈ గ్రీన్ డోమ్‌ను పై నుంచి చూస్తే పెద్ద గొడుగులా కనిపిస్తుంది. ఇదే విధంగా సందర్శకులకు మొక్కల వివరాలు తెలియటానికి వీలుగా స్కానింగ్ బోర్డ్‌లను ఏర్పాటు చేశారు. ఈ బోర్డులను స్కాన్ చేస్తే మొక్కల వివరాలన్నీ తెలుస్తాయి. ఆయన దూర దృష్టికి మరో నిదర్శనం- మొక్కల శ్మశానం. "ఎవరైనా చనిపోయిన తర్వాత ఒక మొక్కగా మారాలనుకుంటే వారికి ఆ అవకాశం కల్పిస్తాం. చనిపోయిన తర్వాత పార్థివదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చి ఖననం చేసుకోవచ్చు. దానిపై వారికి నచ్చిన మొక్కను పాతి పెంచుతాం. వారి కుటుంబ సభ్యులు వచ్చి ఈ మొక్కను ఎప్పుడైనా చూడవచ్చు. నేను కూడా నా దేహంపై మొక్కను పెంచాలని నా కుటుంబ సభ్యులకు చెప్పా" అంటారు రామ్‌దేవ్.

• బి.మల్లికార్జున్
శంకర్‌పల్లి



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
జీరో డే	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 20
అమెజాన్ ప్రైమ్		
రీచర్ 3	వెబ్‌సిరీస్ (తెలుగులో)	ఫిబ్రవరి 20
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది వైట్ లోటస్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 17
ఊప్స్ అబ్ క్యా	హిందీ సిరీస్	ఫిబ్రవరి 20
ఆఫీస్	తమిళ సిరీస్	ఫిబ్రవరి 21
జీ 5		
క్రైమ్‌బీట్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 21
ఆపిల్ టీవీ ప్లస్		
సర్ఫేస్ 2	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 21

క్రైమ్ థ్రిల్లర్

ఓ క్రిమినల్ నేర సామ్రాజ్యం గురించి నిజాలను వెలికితెచ్చేందుకు ఓ జర్నలిస్ట్ చేసిన సాహసాల నేపథ్యంలో తెరకెక్కిన హిందీ వెబ్‌సిరీస్ 'క్రైమ్ బీట్'. షకీబ్ సలీం లీడ్‌రోల్ పోషించారు. సబా ఆజాద్, రాహుల్‌భట్ కీలకపాత్రలు పోషించారు. సుధీర్ మిశ్రా, సంజీవ్‌కౌల్ దర్శకత్వం వహించారు. కొన్నేళ్ల క్రితం విదేశాలకు పారిపోయిన క్రిమినల్ బిన్నీ చౌదరి స్వదేశానికి తిరిగొచ్చి అండర్‌గ్రౌండ్‌లో తలదాచుకుంటాడు. అతన్ని కనిపెట్టేందుకు అభిషేక్ సిన్హా అనే జర్నలిస్ట్ ప్రయత్నాలు ఫలించాయా? ఆ క్రిమినల్ గురించి తెలుసుకునేందుకు చేసిన పరిశోధనలో అతను ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నాడు?, వాటిని ఎలా అధిగమించాడు అనేది ఆసక్తికరంగా ఉండబోతోందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.



హిట్ ఇచ్చిన కాంబినేషన్ కోసం ఇటు ఇండస్ట్రీ, అటు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తుంటారు. ఏ ఇండస్ట్రీలో అయినా హిట్ ఇచ్చిన దర్శకులతో మరో సినిమా చేసేందుకు హీరోలు వెనుకాడరు. రీ యూనియన్‌కు రెడీ అంటూ బాలీవుడ్‌లో అలాంటి హిట్ కాంబినేషన్లు కొన్ని ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.

హిట్ కాంబినేషన్ మరొక్కసారి!



కొన్నాళ్లుగా బాలీవుడ్ హీరోలు కొత్త దర్శకులతో సినిమాలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా కొత్త కాంబినేషన్లు సెట్టవుతున్నాయి. మరోవైపు గతంలో తమకు హిట్స్ ఇచ్చిన దర్శకులతోనూ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు హీరోలు. బాలీవుడ్ దర్శకుడు డేవిడ్ ధావన్, ఆయన తనయుడు వరుణ్ ధావన్ కాంబినేషన్‌లో గతంలో పలు హిట్ చిత్రాలు వచ్చాయి. కామెడీ జానర్‌లో వచ్చిన 'మై తేరా హీరో, జుడ్వా 2, కూలీ నంబర్ 1' చిత్రాలు కుటుంబ ప్రేక్షకులను అమితంగా అలరించాయి. వారి కాంబినేషన్‌లో ఈ ఏడాది మరో చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. వరుణ్‌ధావన్ నటిస్తున్న తాజా చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'కి డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తున్నాడు. అక్టోబర్ 2న ఈ చిత్రం విడుదలవనుంది. ఇందులో వరుణ్‌కు జోడీగా పూజాహెగ్డే, మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు.

దుల్హనియా సిరీస్‌లో

అలాగే వరుణ్‌ధావన్- దర్శకుడు శశాంక్ ఖేతన్ కాంబినేషన్ కూడా గతంలో మంచి విజయాలను అందుకొంది. వీరిద్దరి కలయికలో 'హంప్టీ శర్మాకీ దుల్హనియా, బద్రీనాథ్ కీ దుల్హనియా' చిత్రాలు తెరకెక్కాయి. ఇప్పుడు అదే కాంబినేషన్‌లో 'సన్నీ సంస్కారీ కీ తుల్సీ కుమారి' చిత్రం తెరకెక్కుతోంది. లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. సాన్యా మల్హోత్రా కీలకపాత్ర పోషిస్తున్నారు. ఏప్రిల్ 18న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



హిట్ దర్శకులతో అక్షయ్

వరుస అపజయాలతో దెబ్బతిన్న బాలీవుడ్ విజయాల కోసం రూటు మార్చింది. ఈ మధ్య హిట్ ఫ్రాంచైజ్‌లో చిత్రాలు తెరకెక్కించడం ద్వారా మంచి విజయాలను సొంతం చేసుకుంటోంది. అక్షయ్‌కుమార్, అర్షద్‌వార్సీ దర్శకుడు సుభాష్ కపూర్ కాంబినేషన్‌లో 'జాలీ ఎల్‌ఎల్‌బీ' ఫ్రాంచైజీలో వచ్చిన రెండు చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నాయి. అక్షయ్, అర్షద్ ఇద్దరికీ మంచి పేరు తెచ్చాయి. ఇప్పుడు వాటికి కొనసాగింపుగా 'జాలీ ఎల్‌ఎల్‌బీ 3' చిత్రం తెరకెక్కుతోంది. ఇందులోనూ అక్షయ్‌కుమార్, అర్షద్‌వార్సీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కోర్ట్ రూమ్ డ్రామాగా తెరకెక్కుతోంది. వినోదంతోపాటు మంచి సందేశంతో ప్రేక్షకులను అలరించేందుకు ఈ కాంబినేషన్ సిద్ధమవుతోంది.



మూడోసారి నవ్వించేందుకు

బాలీవుడ్‌లో మరో సీక్వెల్ చిత్రానికి రంగం సిద్ధమైంది. హిందీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్న కామెడీ చిత్రాల్లో 'హేరా ఫేరి' ఒకటి. ప్రియదర్శన్ దర్శకత్వంలో అక్షయ్‌కుమార్, సునీల్‌శెట్టి, పరేశ్ రావల్, టబు, ఓంపురి ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆ ఏడాది సూపర్‌హిట్‌గా నిలిచింది. దానికి కొనసాగింపుగా వచ్చిన 'ఫిర్ హేరాఫేరీ' కూడా ఘన విజయాన్ని అందుకొంది. మళ్లీ ఇన్నాళ్లకు ఈ ఫ్రాంచైజ్‌లో మూడో చిత్రం తెరకెక్కనుంది. ఇటీవల దర్శకుడు ప్రియదర్శన్ 68వ పుట్టిన రోజు సందర్భంగా ఆయన ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతూ అక్షయ్ పెట్టిన పోస్ట్‌కు ప్రియదర్శన్ బదులిస్తూ 'పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు అక్షయ్. బదులుగా నేను నీకో బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను. త్వరలో మనం 'హేరా ఫేరి 3' చేయబోతున్నాం. అక్షయ్, సునీల్‌శెట్టి, పరేశ్ రావల్... మీరు సిద్ధంగా ఉన్నారా' అంటూ ట్వీట్ చేశారు. అలాగే ప్రియదర్శన్, అక్షయ్ కలయికలో తెరకెక్కుతోన్న 'బూత్ బంగ్లా' చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

మరో హిట్ కోసం

'జరా హట్కే జరా బచ్కే' చిత్రం సూపర్‌హిట్ అయిన తర్వాత దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్‌తో విక్కీ కౌశల్ మరో చిత్రం చేస్తున్నారు. ఈ కాంబినేషన్‌లో ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ఛావా'. ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. రష్మిక మందన్న కథానాయికగా నటించిన ఈ చిత్రానికి ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందించారు.



ప్రెజర్ కుక్కర్‌ని ఉపయోగిస్తున్నారా..!

వంట త్వరగా పూర్తి కావడంతోపాటు గ్యాస్ ఆదా అవుతుందని అందరూ ప్రెజర్ కుక్కర్లనే ఉపయోగిస్తున్నారు. కుక్కర్‌ని వాడేటప్పుడు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం!

- కుక్కర్‌లో కనీసం రెండు గ్లాసుల నీళ్లు పోసి... ఆహార పదార్థాలు వేసిన గిన్నె అమర్చాలి. ఈ గిన్నెలో కూడా తగినన్ని నీళ్లు పోసి మూతపెట్టిన తరవాతనే కుక్కర్ మూత బిగించి విజిల్ పెట్టాలి. కుక్కర్‌లో నీళ్లు తక్కువైతే అది మాడిపోతుంది. గిన్నెలోని పదార్థాలకు నీళ్లు చాలకపోతే అవి ఉడకవు.
- కుక్కర్‌లో నేరుగా పప్పు, కూరగాయలు వేసి ఎక్కువ నీళ్లు పోసి పెద్ద మంట మీద ఉడికిస్తే వాటి నుంచి అధికంగా నురగ, ఆవిరి వస్తాయి. ఆవిరి బయటికి వచ్చే మార్గంలో ఆహార పదార్థాలు పొంగి ఇరుక్కుంటే విజిల్ మోగక కుక్కర్ పేలిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే మంట మధ్యస్థాయిలో ఉండేలా చూసుకోవాలి. కుక్కర్ మూతపై ఉండే విజిల్, ఆవిరి వెలువడే రంధ్రాలను తరచూ శుభ్రం చేస్తూ ఉండాలి.



- కుక్కర్ మూతలో రబ్బర్ గ్యాస్కెట్.... సరిగా ఇమిడి ఉండేలా చూసుకోవాలి. వదులుగా మారినా, అక్కడక్కడా పగిలినట్లు కనిపించినా వెంటనే దాన్ని మార్చాలి. లేదంటే కుక్కర్‌లోని ఆవిరి మొత్తం బయటికి వచ్చేస్తుంది. పదార్థాలు సరిగా ఉడకవు. గ్యాస్ వృథా అవుతుంది.
- కుక్కర్ హ్యాండిల్‌కు ఉండే స్క్రూ తరచూ వదులుగా మారుతూ ఉంటుంది. దీనిని ఎప్పటికప్పుడు పరిశీలించి బిగిస్తూ ఉండాలి. లేదంటే వంట పూర్తయ్యాక కుక్కర్ మూత తీయడం కష్టమవుతుంది.
- కుక్కర్‌లో పరిమితి ప్రకారం ఆహార పదార్థాలు వేసి వాటికి కావాల్సిన నీటిని మాత్రమే చేరిస్తే చక్కగా ఉడుకుతాయి. రుచిగా ఉంటాయి కూడా!

పెళ్లికి ముందే జంటగా ఫైనాన్షియల్ ప్లానింగ్

మనీ మ్యాటర్స్ ముందే మాట్లాడుకుంటే బెటర్ ● తద్వారా వైవాహిక బంధానికి, భవిష్యత్‌కు భరోసా

పరిణయం.. రెండు జీవితాల సంగమం. కడదాకా కలిసుండేందుకు ముడిపెట్టే బంధం. అందుకు ఇద్దరి మధ్య తరగనంత ప్రేమతో పాటు తగినంత డబ్బూ అవసరమే. ఎందుకంటే, భార్యా భర్తల సంబంధంలో డబ్బు చాలా సున్నితమైన, ప్రధాన అంశంగా మారింది. ఇరువురి మధ్య ఆర్థిక విబేధాలతో వివాహ బంధం బీటలు వారే ప్రమాదం ఉంది. ఒక్కోసారి విడాకులకూ దారి తీయవచ్చు. అందుకే, పెళ్లికి ముందే జంటగా ఆర్థిక విషయాలు, లక్ష్యాలపై చర్చించుకోవడం మేలు. తద్వారా వారి వైవాహిక జీవితంలో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను జంటగా పరిష్కరించుకునేందుకు ముందు నుంచే సిద్ధం కావచ్చు. అయితే, కాపురానికి ముందే ఇలాంటి విషయాలను ప్రస్తావిస్తే కాబోయే భర్త లేదా భార్య తనను డబ్బు మనిషి అనుకుంటారన్న సందేహం ప్రతి జంటలోనూ ఉంటుంది. కానీ, మీ దృక్పథాన్ని, లక్ష్యాన్ని నిజాయితీగా, స్పష్టంగా వివరించగలిగితే మీ భాగస్వామితో బంధం మరింత బలపడుతుంది.



పారదర్శకంగా చర్చించండి..

పెళ్లికి ముందే ఆర్థిక విషయాల్ని చర్చించినా, అందులో పారదర్శకత లేకపోతే కాపురంలో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కేవలం ఆదాయం, ఖర్చులనే కాదు కుటుంబ ఆర్థిక లక్ష్యాలనూ గుర్తించి వాటిపైనా చర్చించాలి. ఖర్చులపై పరిమితులు, భవిష్యత్ అవసరాలు.. అందుకున్న పొదుపు మార్గాలనూ చర్చలో భాగం చేయండి. అప్పుడే మీ ఆర్థిక దృక్పథం కాబోయే భాగస్వామికి స్పష్టంగా అర్థమవుతుంది. తద్వారా వైవాహిక భవిష్యత్‌కు భరోసా లభిస్తుంది.

ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోండి..

జంట ప్రయాణంలో కారు, ఇళ్లు కొనుగోలు దగ్గరి నుంచి పిల్లల చదువు, రిటైర్మెంట్ వరకు ముందే ప్లాన్ చేసుకోండి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను ముందుగానే గుర్తించడం ద్వారా ఆది నుంచే అందుకోసం పొదుపు ప్రారంభించవచ్చు.

మీ భాగస్వామి ఆర్థిక దృక్పథాన్ని అర్థం చేసుకోండి..

కుటుంబ ఖర్చులు లేదా పెట్టుబడుల గురించి చర్చించే ముందు ఆర్థిక విషయాల్లో మీ భాగస్వామి వైఖరిని అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. మీకు కాబోయే భర్త లేదా భార్య దృష్టిలో డబ్బు అంటే ఆర్థిక భరోసానా..? స్వేచ్ఛా జీవితమా..? లేదా వినోదం, విలాసాలా..? ఈ విషయాన్ని పసిగట్టగలిగితే మీ భాగస్వామి ఖర్చు చేసే విధానం, ఆర్థిక ప్రాధాన్యాలపై ఓ అంచనాకు రాగలుగుతారు. అలాగే, మీ ఆర్థిక దృక్పథంలో పోల్చి చూసుకోవచ్చు. తద్వారా వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టాక తలెత్తే అభిప్రాయ భేదాలను ముందుగానే నివారించుకునే వీలుంటుంది. అంతేకాదు, ఆర్థిక విషయాలపై ఏ కోణంలో చర్చ మొదలు పెట్టాలనే విషయంపైనా అవగాహన లభిస్తుంది. ఉదాహరణకు, మీరు పొదుపరి. కానీ, మీ భాగస్వామి ఆనందాల కోసం బాగా ఖర్చు చేస్తారనుకుందాం. ఈ సందర్భంలో ముందుగా చర్చించుకోవడం ద్వారా పెళ్లి తర్వాత మధ్యేమార్గంపై ఓ నిర్ణయానికి రావడంతో పాటు భవిష్యత్ ప్రణాళికను రచించుకునేందుకు వీలుపడుతుంది.

నీది.. నాది

డబ్బు విషయంలో భార్యాభర్తల మధ్య నీది.. నాది అనే తేడాలు రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఇద్దరూ సంపాదించే వారైతే, ఒకరి డబ్బును మరొకరు వినియోగించుకోవడం, ఎవరి సంపాదన ఎందుకోసం ఖర్చు చేయాలనే విషయాల్లో పెళ్లికి ముందే స్పష్టమైన అంగీకారానికి రావడం మేలు. అలాగే, జాయింట్ అకౌంట్లు, బీమా పాలసీలు, పెట్టుబడి పథకాలు.. వాటికి నామినీలుగా ఎవరుండాలనే విషయాలపైనా ఇరువురూ ఓ అవగాహనకు వస్తే మరింత మంచిది. జీవితంలో ఎప్పుడేం జరుగుతోందో ఎవరూ చెప్పలేరు. అందుకే, ఆర్థిక తక్షణావసరాలను తీర్చుకునేందుకు వీలుగా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. కనీసం 3 నుంచి 6 నెలల ఆర్థిక అవసరాలను తీర్చగలిగేలా ఈ నిధిని ఏర్పాటు చేసుకోవాలి. అలాగే, జీవిత, ఆరోగ్య బీమా కవరేజీని సమకూర్చుకోవడం కూడా కీలకం.



పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులకు నిన్నమొన్నటి వరకు సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) మంచి పెట్టుబడి సాధనం. అయితే మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో ఈ బాండ్స్ జారీకి ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. మరి ఇప్పుడు డిజిటల్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరుల ముందు ఉన్న మార్గాలు ఏమిటి? అయితే ఇది మీ కోసమే..

గోల్డ్ బాండ్లకు గుడ్‌బై..



బంగారంలో పెట్టుబడులకు ప్రత్యామ్నాయాలివే..

బంగారానికి, మన సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంది. వీసమెత్తు బంగారమైనా లేకుండా మన దేశంలో ఏ ఇంట్లో, ఏ శుభకార్యం జరగదంటే అతిశయోక్తి కాదు. అటు స్టేటస్ సింబల్‌గానే గాక, పెట్టుబడి సాధనంగానూ మన దేశంలో పసిడికి విపరీతమైన డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల పొదుపులో కొంత మొత్తాన్ని అయినా డిజిటల్ గోల్డ్ వైపు మళ్లించే ఉద్దేశంతో ప్రభుత్వం 2015లో సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) పథకం తీసుకొచ్చింది. గత పదేళ్లలో ఈ పథకం కింద 67 విడతలుగా 14.7 కోట్ల యూనిట్ల ఎస్‌జీబీలను ప్రభుత్వం జారీ చేసింది.

పసిడి పైపై చూపులు

అయితే మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఎస్‌జీబీ పథకానికి ఫుల్‌స్టాప్ పెట్టింది. దీంతో డిజిటల్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులకు ఒక మార్గం మూసుకుపోయింది. మరోవైపు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధర రికార్డులు సృష్టిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం 2,900 డాలర్లకు అటుఇటూగా ఉంది. దేశీయ మార్కెట్‌లోనూ 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం రూ.86,000-88,000 మధ్య తచ్చాడుతోంది. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, అంతర్జాతీయ ఉద్రిక్తతలతో ధర మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడి లాభాల కోసం డిజిటల్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులు ఈ కింది మార్గాలను అన్వేషించవచ్చు.

లిస్టెడ్ ఎస్‌జీబీలు

ప్రభుత్వం ఇప్పటి వరకు జారీ చేసిన ఎస్‌జీబీలన్నీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టయ్యాయి. డీమ్యాట్ ఖాతా ఉన్న రిటైల్ మదుపరులు ఎవరైనా ఈ రెండు స్టాక్ ఎక్స్ఛేంజీల క్యాష్ సెగ్మెంట్‌లో ఎనిమిదేళ్ల కాలపరిమితి ఉండే ఈ ఎస్‌జీబీల యూనిట్లను కొనుగోలు చేయవచ్చు. కాకపోతే వీటికి ఐదేళ్ల లాక్-ఇన్-పీరియడ్ ఉంటుంది. ఐదు, ఆరు, ఏడేళ్ల చివర్లో ఆర్‌బీఐ ఈ బాండ్స్‌కు బైబ్యాక్ సదుపాయం కల్పిస్తోంది.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

డిజిటల్ రూపంలో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులు మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అందించే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోనూ మదుపు చేయవచ్చు. ఒక్కో గోల్డ్ ఈటీఎఫ్ ఒక గ్రాము బంగారానికి సమానం. ఈ పథకాల ద్వారా సమీకరించిన నిధులను మ్యూచువల్ ఫండ్స్. ఫిజికల్ గోల్డ్‌లో పెట్టుబడులుగా పెడతాయి. ప్రతి ట్రేడింగ్ డే చివర్లో ఆ రోజు బంగారం మార్కెట్ ధర ప్రకారం ఈ యూనిట్ల నికర ఆస్తుల విలువ (ఎన్ఏవీ) ప్రకటిస్తారు. ఈ ఈటీఎఫ్‌లు కూడా లిస్టయి ఉంటాయి, కాబట్టి డీమ్యాట్ ఖాతా ఉన్న మదుపరులు ఎప్పుడు కావాలంటే అప్పుడు వీటిని అమ్ముకోవచ్చు. లేదా కొనుగోలు చేయవచ్చు. నగలు లేదా ఫిజికల్ గోల్డ్ మేకింగ్ చార్జీలతో పోలిస్తే వీటి బ్రోకరేజీ చార్జీలూ తక్కువే. గోల్డ్ ఎంఎఫ్‌లతో పోలిస్తే ఖర్చులూ తక్కువగానే ఉంటాయి. కాకపోతే ఈ ఈటీఎఫ్‌లను అమ్మాలన్నా, కొనాలన్నా ఎగ్జిట్, ఎంట్రీ లోడ్‌లు ఉంటాయి.

గోల్డ్ ఎంఎఫ్‌లు

ఇవి ఓపెన్ ఎండెడ్ పథకాలు. ఈ పథకాల ద్వారా సమీకరించిన నిధులను ఎంఎఫ్‌లు.. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో మదుపు చేస్తాయి. పసిడి పెట్టుబడుల ద్వారా మదుపరులకు దీర్ఘకాలిక సంపద సృష్టించడం ఈ పథకాల ప్రధాన ఉద్దేశం. ఫండ్ లక్ష్యానికి అనుగుణంగా ఈ పథకాల ఫండ్ మేనేజర్లు పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటారు. ఈ పథకాల ఎన్ఏవీలను కూడా ట్రేడింగ్ ముగిసిన తర్వాత ఏ రోజుకు ఆ రోజు ప్రకటిస్తారు. కాకపోతే గోల్డ్ ఈటీఎఫ్‌లతో పోలిస్తే, ఈ పథకాల నిర్వహణ ఖర్చులు కొద్దిగా ఎక్కువ. గోల్డ్ ఎంఎఫ్‌లపై రాబడులు ఫండ్ మేనేజర్ నైపుణ్యాలు, బులియన్ మార్కెట్ తీరుతెన్నులపై ఆధారపడి ఉంటాయి. డీమ్యాట్ ఖాతా లేని మదుపరులు కూడా ఈ పథకాల్లో మదుపు చేయవచ్చు.

ఎస్‌బీఐ గృహ రుణగ్రహీతలకు శుభవార్త

రెపో అనుసంధానిత రుణ రేట్లు 0.25% తగ్గింపు

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రామాణిక రుణ వడ్డీ రేట్లను తగ్గించింది. రెపో అనుసంధానిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్), బాహ్య ప్రామాణిక రుణ రేటు (ఈబీఎల్ఆర్)ను పావు (0.25) శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దాంతో ఈబీఎల్ఆర్ 9.15 శాతం నుంచి 8.90 శాతానికి దిగిరాగా.. ఆర్ఎల్ఎల్ఆర్ 8.75 శాతం నుంచి 8.50 శాతానికి తగ్గింది. తగ్గించిన వడ్డీ రేట్లు శనివారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ నెలలో ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం తగ్గించిన నేపథ్యంలో బ్యాంక్ ఆ ప్రయోజనాన్ని తాజాగా రుణగ్రహీతలకు బదిలీ చేసింది.

దీంతో ఎస్‌బీఐ నుంచి ఈబీఎల్ఆర్, ఆర్ఎల్ఎల్ఆర్ అనుసంధానిత గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు తీసుకున్నవారిపై ఈఎంఐ భారం తగ్గనుంది. కాగా, ద్రవ్య సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్), బేస్ రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్) మాత్రం యథాతథంగా కొనసాగుతాయని ఎస్‌బీఐ స్పష్టం చేసింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	101
వరంగల్	93	గుంటూరు	100
కరీంనగర్	93	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	80
కర్నూలు	93	నెల్లూరు	85
విశాఖపట్నం	93	అనంతపురం	85
గోదావరి	101		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,070 ▼	78,900 ▼	1,08,000 ▲
విజయవాడ	87,400 ▼	82,200 ▼	98,300 ▲
విశాఖపట్నం	84,840 ▼	77,770 ▼	95,950 ▼
రాజమండ్రి	86,070 ▼	78,900 ▼	99,700 ▼
ప్రొద్దుటూరు	87,600 ▼	81,120 ▼	97,000 ▼
ముంబై	85,998	78,774	97,953

స్పోర్ట్స్

నిండైన ఆత్మవిశ్వాసం.. కదనోత్సాహం

చాంపియన్స్ ట్రోఫీ 3 రోజుల్లో

దుబాయ్ చేరిన టీమిండియా







ముంబై: తొమ్మిది నెలల కిందట టీ20 వరల్డ్ కప్ గెలిచిన మధుర స్మృతులు..తాజాగా ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఆత్మవిశ్వాసం..వెరసి టీమిండియా మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి పయనమైంది. ఈనెల 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత జట్టు శనివారం దుబాయ్ పయనమైంది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి పెద్ద సంఖ్యలో తరలొచ్చిన అభిమానుల జేజేల మధ్య భారత్ బయలు దేరింది. తెల్లటి టీ షర్ట్, నల్లటి ట్రాక్ ధరించి కారులోంచి దిగిన రోహిత్‌ను చూడగానే ఫ్యాన్స్ 'రోహిత్ భాయ్', 'రోహిత్ సర్' అని పెద్ద ఎత్తున నినదించారు. వారికి చేతులు ఊపుతూ అభివాదం చేయడం ద్వారా రోహిత్ లోనికి వెళ్లిపోయాడు. కోచ్ గంభీర్, వైస్-కెప్టెన్ గిల్ సహా పలువురు క్రికెటర్లు జట్టు బస్సులో వచ్చారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతోపాటు ఇతర ఆటగాళ్లు అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ ముందుకు కదలడం విశేషం. నాలుగు గంటల ప్రయాణం అనంతరం దుబాయ్ చేరుకున్న టీమిండియా ఆటగాళ్లకు అక్కడ ఘన స్వాగతం లభించింది. కాగా, పేసర్ బుమ్రా లేకుండా చాంపియన్స్ ట్రోఫీలో తలపడుతున్న భారత్..తొలి మ్యాచ్‌లో ఈనెల 20న బంగ్లాదేశ్‌ను ఎదుర్కోనుంది. ఇక టోర్నీలో బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌ను పాకిస్థాన్‌తో 23న ఆడనుంది.

ఫుల్ జోష్‌తో..

మూడు వన్డేలలో ఇంగ్లండ్‌ను చిత్తు చేయడంతో భారత జట్టులో ఆత్మవిశ్వాసం రెండింతలైంది. ఇక చాలాకాలంగా ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న దిగ్గజ బ్యాటర్లు రోహిత్, విరాట్ ఇంగ్లండ్‌పై రాణించడం చాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియాకు శుభ సూచకం. కటక్..రెండో వన్డేలో రోహిత్ (90 బంతుల్లో 119) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడగా..అహ్మదాబాద్ మ్యాచ్‌లో కోహ్లీ వన్డేలలో 73వ హాఫ్ సెంచరీ మార్క్ చేరుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లు రోహిత్, విరాట్‌లకు ఊరటనిచ్చేవే. అయితే ఈ జోరును వారు చాంపియన్స్ ట్రోఫీలో కొనసాగిస్తేనే జట్టు మరో ఐసీసీ టైటిల్ దక్కించుకోగలుగుతుంది. అలాగే తదుపరి ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌తోపాటు, 2027 వన్డే వరల్డ్ కప్‌నకు జట్లను రూపొందించడంపై సెలెక్షన్ కమిటీ దృష్టి సారించింది. ఈక్రమంలో టీమిండియాలో చోటు నిలబెట్టుకోవాలంటే చాంపియన్స్ ట్రోఫీలో రోహిత్, విరాట్ సత్తా చాటడం ఎంతో ముఖ్యం.



గిల్‌కు పరీక్ష

వైస్-కెప్టెన్‌గా నియామకం యువ ఆటగాడు గిల్‌కు పెద్ద ప్రమోషన్‌గానే చెప్పాలి. వన్డేలలో దాదాపు 61 సగటు కలిగిన అతడు..చాంపియన్స్ ట్రోఫీలో రాణించడం చాలా కీలకం. టోర్నమెంట్‌లో అదరగొడితే గిల్‌కు తిరుగుండబోదు. ఇక..బుమ్రా పరోక్షంలో తమకు అందివచ్చిన అవకాశాలను పేసర్లు అర్ష్‌దీప్, హర్షిత్ రాణా ఏమేరకు అందిపుచ్చుకుంటారో చూడాలి. స్పిన్‌కు అనుకూలించే దుబాయ్ పిచ్‌లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా వరుణ్ చక్రవర్తి జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాల్సి ఉంటుంది.

ఆఖరి బంతి.. ఢిల్లీ విజయభేరి

ఉత్కంఠ పోరులో ముంబై ఓటమి
- షఫాలీ మెరుపు ఇన్నింగ్స్
- అదరగొట్టిన నికీ

డబ్ల్యూపీఎల్‌లో నేడు
గుజరాత్ × యూపీ
రాత్రి 7.30 నుంచి



షఫాలీ (18 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో మ్యాచ్ నరాలు తెగే ఉత్కంఠ రేపింది. ఆఖరి బంతికి ఫలితం తేలిన మ్యాచ్‌లో నిరుటి రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ రెండు వికెట్లతో నెగ్గింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 19.1 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటైంది. సివర్ బ్రంట్ (59 బంతుల్లో 13 ఫోర్లతో 80 నాటౌట్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42) మాత్రమే మెరిశారు. ఛేదనలో ఢిల్లీ 20 ఓవర్లలో 165/8 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్ షఫాలీ వర్మ (18 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43) సుడిగాలి ఆరంభం ఇచ్చింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికీ ప్రసాద్ (35), సారా బ్రైస్ (21), అలైస్ క్యాప్సీ (16) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

అరుంధతి..ఉత్కంఠ అదిమిపట్టి..: ఆఖరి బంతికి రెండు పరుగులు కావాల్సిన దశలో హైదరాబాదీ అరుంధతి రెడ్డి (2 నాటౌట్)..స్పిన్నర్ సజన బంతిని కవర్స్‌వైపు కొట్టింది. మొదటి పరుగు చేసింది. రెండో పరుగు కోసం వెనక్కు మళ్లింది. కవర్స్‌నుంచి హర్మన్‌ప్రీత్ విసిరిన బంతిని అందుకున్న కీపర్ యాస్తికా వికెట్లను గిరాటేసేలోపు అరుంధతి డైవ్ చేస్తూ క్రీజులోకి చేరింది. బ్యాటర్ రనౌటా..కాదా..అని తేల్చేందుకు పలు కోణాల్లో పరిశీలించిన మూడో అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. అంతే..ఢిల్లీలో సంబరాలు మిన్నంటగా, ముంబై డీలా పడిపోయింది.



నికీ ప్రసాద్ (35)

నికీ..భళా: ఇటీవల అండర్-19 ప్రపంచ కప్ సాధించిన భారత జట్టు కెప్టెన్ నికీ ప్రసాద్ ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున అరంగేట్రం చేసింది. తొలి మ్యాచ్‌లో సమయోచిత ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలక భూమిక పోషించింది.

సంక్షిప్తస్కోర్లు

ముంబై ఇండియన్స్: 20 ఓవర్లలో 164 ఆలౌట్ (సివర్ 80 నాటౌట్, హర్మన్ 42, సదర్లాండ్ 3/34, శిఖా పాండే 2/14).
ఢిల్లీ క్యాపిటల్స్: 20 ఓవర్లలో 165/8 (షఫాలీ 43, నికీ ప్రసాద్ 35, సారా బ్రైస్ 21, కెర్ 2/21, మాథ్యూస్ 2/32).

హాకీ అమ్మాయిల శుభారంభం

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ ప్రో లీగ్‌లో భారత్ శుభారంభం చేసింది. శనివారం ఇక్కడ జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 3-2తో ఇంగ్లండ్‌పై గెలిచింది. ఇక, ఇక్కడే జరిగిన పురుషుల హాకీ ప్రో లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత్ 1-3తో స్పెయిన్ చేతిలో పరాజయం పాలైంది.

టెన్నిస్ నెం.1 సిన్నర్‌పై మూడు నెలల నిషేధం



లండన్: ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా)తో టాప్ ర్యాంక్ టెన్నిస్ ఆటగాడు జానిక్ సిన్నర్ రాజీకి వచ్చాడు. రెండు డోపింగ్ పరీక్షలలో విఫలమైన నేపథ్యంలో వాడా తనపై విధించిన మూడు నెలల సస్పెన్షన్ ఇటలీ స్టార్ సిన్నర్ అంగీకరించాడు. ఈ విషయాన్ని వాడా శనివారం వెల్లడించింది. అయితే ఆ నిషేధిత డ్రగ్స్ తాను ఉద్దేశపూర్వకంగా తీసుకోలేదని, మసాజ్‌లో తన ఫిజియో ఉపయోగించిన ఔషధం ద్వారా శరీరంలోకి చేరిందని సిన్నర్ వివరణ ఇచ్చాడు. ఈనెల తొమ్మిది నుంచి అమలులోకి వచ్చిన సస్పెన్షన్ మే నాలుగున ముగియనుంది. దాంతో తదుపరి గ్రాండ్‌స్లామ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో జానిక్ పాల్గొనగలుగుతాడు.

గుకేష్ కంటే అర్జున్‌కే ఎక్కువ ప్రైజ్‌మనీ!



హంబర్గ్ (జర్మనీ): ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టూర్ తొలి అంచె టోర్నీ ముగిసింది. భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ గుకేష్ మొదటి అంచెలో నిరాశ జనక ప్రదర్శనతో ఎనిమిదో, చివరి స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో పాల్గొన్నందుకు గుకేష్‌కు రూ. 17.33 లక్షలు లభించాయి. టోర్నీలో ఆడకున్నా, ఫ్రీస్టయిల్ చెస్ ఆటగాళ్ల క్లబ్‌లో ఉన్నందుకు తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి.. రూ. 23.50 లక్షలు దక్కించుకోవడం విశేషం. 'నాన్ పార్టిసిపేటింగ్' సభ్యుడిగా అర్జున్‌కు ఆ మొత్తం లభించింది. టోర్నీ నిబంధనల ప్రకారం 'నాన్ పార్టిసిపేటింగ్' సభ్యులకు మొత్తం ప్రైజ్‌మనీలో కొంత వాటా లభిస్తుంది. అయితే టోర్నీ జరిగే నెలలో ఆ సభ్యుల ఎలో రేటింగ్ 2725కు మించి ఉండాలి. కాగా, ఏప్రిల్ 8 నుంచి పారిస్‌లో జరిగే రెండో అంచె గ్రాండ్‌స్లామ్ టూర్‌లో అర్జున్ ఆడతాడు. ఇక, మొదటి అంచెలో విన్సెంట్ కీమర్ (జర్మనీ) విజేతగా నిలిచాడు.

క్రికెటర్లేమీ దేవుళ్లు కాదు

జట్టులో స్టార్ సంస్కృతి సరికాదన్న అశ్విన్



న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో సూపర్ స్టార్‌డమ్ సంస్కృతిని టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తప్పుపట్టాడు. క్రికెటర్లు దేవుళ్లు కాదనీ, వాళ్లు సాధారణ జీవనం సాగించే విధానం అలవాటు చేసుకోవాలని సూచించాడు. ముఖ్యంగా భారత జట్టులో ఇలాంటి సంస్కృతి పెరిగిపోతున్నదని, దీనికి అడ్డుకట్ట వేయాలని ఒక హిందీ యూట్యూబ్ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో అశ్విన్ సూచించాడు. బ్యాటింగ్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కెరీర్‌లో ఇప్పటికే ఎంతో సాధించారని, వాళ్లు సెంచరీ చేస్తే దాన్ని ఆటలో భాగంగానే చూడాలన్నాడు. 'క్రికెటర్లు.. సూపర్ స్టార్లు కాదు. వాళ్లను దేవుళ్లుగా చూడాల్సిన అవసరం లేదు. భారత క్రికెట్ జట్టులో సూపర్ స్టార్‌డమ్, సూపర్ సెలెబ్రిటీల సంస్కృతిని ప్రోత్సహించొద్దు. ఆటగాళ్లుగా మనం సాధారణ జీవనం సాగించేలా ఉండాలి' అని ఆ ఇంటర్వ్యూలో అశ్విన్ అన్నాడు. జట్టులో సూపర్‌స్టార్ సంస్కృతి ఉండరాదని టీమిండియా చీఫ్ కోచ్ గంభీర్ కూడా ఇటీవల కాస్త తీవ్రంగా హెచ్చరించిన సంగతి తెలిసిందే.

మంత్రిగారూ.. మమ్మల్ని టోర్నీకి పంపండి

రెజ్లర్ల విన్నపం

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడాశాఖ, జాతీయ రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మధ్య సమన్వయం లేకపోవడం భారత రెజ్లర్లకు శాపంగా మారింది. వీళ్ల నిర్వాకం కారణంగా క్రొయేషియాలో జరిగిన తొలి టోర్నీకి దూరమైన రెజ్లర్లు.. ఈనెల 26 నుంచి అల్బేనియాలో జరిగే సీజన్ రెండో ర్యాంకింగ్ సిరీస్ ఈవెంట్‌కు కూడా దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రతిపాదిత డాక్యుమెంట్లను నిర్ణీత సమయంలోగా పంపడంలో డబ్ల్యూఎఫ్ఐ విఫలమైందని, అందుకే రెజ్లర్లను టోర్నీకి పంపే విషయంలో ఆమోదముద్ర వేయలేదని క్రీడాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ అంశంలో క్రీడామంత్రి మన్సుఖ్ మాండవ్య జోక్యం కోరుతూ.. ఆసియా చాంపియన్ సునీల్, అండర్-23 ఆసియా టోర్నీ విజేత మీనాక్షి సహా పదిమంది రెజ్లర్లు శనివారం ఉదయం ఆయన నివాసానికి వెళ్లారు. అయితే, మంత్రి లేకపోవడంతో మధ్యాహ్నం దాకా వేచిచూసిన రెజ్లర్లు నిరాశగా వెళ్లిపోయారు. 'మా తప్పు లేకపోయినా టోర్నీకి దూరమయ్యే పరిస్థితి వస్తోంది. మంత్రి జోక్యంతోనైనా మాకు మేలు జరుగుతుందని ఇక్కడికొచ్చాం' అని మీడియా ముందు రెజ్లర్లు వాపోయారు. సరైన నిబంధనలు పాటించలేదన్న కారణంగా ఇప్పటికే డబ్ల్యూఎఫ్ఐపై క్రీడాశాఖ సస్పెన్షన్ వేటు వేసింది. దీంతో సమాఖ్య, క్రీడాశాఖ మధ్య వివాదం కొనసాగుతోంది.

సమాజ సేవకు అంకితం కావాలి



మనుషులు లేకపోయినా వారి ఆశయాలు కొనసాగాలి
ఎన్టీఆర్ ట్రస్ట్, బసవతారకం ఆస్పత్రి శాశ్వతంగా ఉంటాయి

- యుఫోరియా మ్యూజికల్ నైట్‌లో సీఎం చంద్రబాబు
- ప్రజలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్: మంత్రి లోకేశ్
- అమరావతిలో తలసీమియా సెంటర్: బాలకృష్ణ
- అందరూ రక్తదానం చేయాలి: నారా భువనేశ్వరి

హంగామా లేకుండా ట్రస్ట్ సేవలు చేస్తోంది
నా వంతుగా రూ. 50 లక్షల విరాళం ఇస్తున్నా: పవన్



విజయవాడ/అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పేదరికం, అసమానతలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరు జీవితాంతం సమాజ సేవలో ఉండాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ 28సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తలసీమియా బాధితుల సహాయం కోసం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం రాత్రి యుఫోరియా సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మంచి సమాజం కోసం ఎన్టీఆర్ నిరంతరం తపించారన్నారు. ఆయన సతీమణి బసవ తారకం క్యాన్సర్‌తో చనిపోయినప్పుడు ఎన్టీఆర్ చాలా బాధపడ్డారన్నారు. ఒక విషాదం ఒక మంచికి విత్తనం వేసిందని, అదే బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి అని వివరించారు. మనుషులు లేకపోయినా వారి ఆశయాలు కొనసాగాలన్నారు. ట్రస్ట్, క్యాన్సర్ ఆసుపత్రి శాశ్వతంగా ఉంటాయని వెల్లడించారు. ఫ్యాక్షన్ రాజకీయాల్లో కార్యకర్తల కుటుంబాలు అనాథలు కాకుండా ఉండేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్ఆర్ఐలతో కలిసి నాంది ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, అదిప్పుడు దేశంలో పెద్ద ఎన్జీవోగా మారిందన్నారు.

ట్రస్ట్ ద్వారా ప్రజల గుండెల్లో ఎన్టీఆర్: పవన్

ఎటువంటి హంగామా లేకుండా ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు చేస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విదేశాల నుంచి ప్రముఖ వైద్యులు వచ్చి ఇక్కడ సేవ చేస్తున్నారంటే ట్రస్ట్‌పై ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుందన్నారు. ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. తనవంతుగా ట్రస్ట్‌కు రూ. 50 లక్షల విరాళం ప్రకటించారు.

నమ్మకమే చిరునామా: లోకేశ్

చిరునవ్వు, భరోసా, నమ్మకానికి ఎన్టీఆర్ ట్రస్ట్ చిరునామాగా ఉంటుందని మంత్రి లోకేశ్ అన్నారు. విద్య, వైద్యంలోనే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా ఉందన్నారు. త్వరలో రక్తనిధి కేంద్రాలు, రక్త పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

అధునాతన సదుపాయాలతో కొత్త వార్డు: బాలకృష్ణ

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో అధునాతన సదుపాయాలతో కొత్త వార్డు ప్రారంభించామని ఎమ్మెల్యే బాలకృష్ణ చెప్పారు. హైదరాబాద్‌లో ఎనిమిది పడకలతో తలసీమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన సెంటర్‌ను 25 పడకలకు పెంచుతున్నామని వెల్లడించారు. త్వరలో అమరావతిలో తలసీమియా సెంటర్ నిర్మిస్తామని చెప్పారు.

ఎన్టీఆర్ ట్రస్టుకు 28 ఏళ్లు

సమాజ సేవలో 28 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బందికి, నిర్వాహకులకు, దాతలకు చంద్రబాబు అభినందనలు తెలిపారు. 'ఆరోగ్య సంరక్షణ, విద్య, విపత్తు నిర్వహణ-సాయం, సాధికారత-జీవనోపాధి రంగాల్లో పేదలకు, ఆపన్నులకు చేయూతనిస్తున్న మీ సేవా స్ఫూర్తి ప్రశంసనీయం. మహనీయుడు ఎన్టీఆర్ ఆశయాలను నెరవేరుస్తూ... మీ కృషి ఇలానే కొనసాగాలని కోరుకుంటున్నా' అని 'ఎక్స్'లో చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ... 'ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే పేదవారి ముఖంలో చిరునవ్వు. ఎన్టీఆర్ స్ఫూర్తి, చంద్రబాబు ఆలోచన, భువనేశ్వరి ఆచరణే ఎన్టీఆర్ ట్రస్టు. ఈ ట్రస్టు నిర్వహిస్తున్న అనేక సేవా కార్యక్రమాల్లో మీరు కూడా భాగస్వాములు అవ్వండి' అని ప్రజలకు పిలుపునిచ్చారు.

మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో భువనేశ్వరి, వసుంధర, ఇతర కుటుంబ సభ్యులు



ఎన్టీఆర్ ట్రస్టు ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరికి చెక్కు ఇస్తున్న సురేశ్

బాధితుల కష్టాలు చూసి..
- నారా భువనేశ్వరి

భయంకరమైన తలసీమియా వ్యాధి బాధితుల కష్టాలు చూసి తలసీమియా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఒక్కో సెంటర్ ఏర్పాటుకు రూ.40-50 లక్షలు ఖర్చవుతుందన్నారు. దానికి నిధులను సమీకరించడానికి ఈ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశామన్నారు. యాంకర్ సుమ, సంగీత దర్శకుడు తమన్ ఏమీ ఆశించకుండా కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. అందరూ రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా చేసిన సేవలను వివరించారు. తలసీమియా వ్యాధిగ్రస్తుల చికిత్స కోసం అమెరికాలోని అట్లాంటాకు చెందిన సజ్జా సురేష్ రూ.5 లక్షల విరాళాన్ని భువనేశ్వరికి అందజేశారు.


చిత్రజ్యోతి
SINCE 1965

ఖరీదైన కానుక



నందమూరి బాలకృష్ణ నటించిన 'డిక్టేటర్', 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', 'డాకూ మహరాజ్' చిత్రాలకు తమన్ సంగీత దర్శకత్వం వహించారు. ఆ చిత్రాల విజయంలో సంగీతం ప్రముఖ పాత్ర వహించిందనే చెప్పాలి. ఇలా వరుసగా తన చిత్రాలకు పని చేస్తూ ప్రతిభ చాటుతున్న తమన్‌కు శనివారం ఓ ఖరీదైన కానుక అందించారు బాలకృష్ణ. పోర్షే కారు కొనుగోలు చేసి అతనికి ఇచ్చారు. హైదరాబాద్ క్యాన్సర్ ఆస్పత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ విషయం తెలియజేస్తూ 'తమన్ నాకు తమ్ముడితో సమానం. వరుసగా నాలుగు హిట్స్ ఇచ్చిన తమ్ముడికి ప్రేమతో కారు బహుమతిగా ఇచ్చా. భవిష్యత్‌లోనూ మా ప్రయాణం ఇలాగే కొనసాగుతుంది' అన్నారు బాలకృష్ణ.

వీరమల్లు ప్రేమగీతం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'హరి హర వీరమల్లు' చిత్రబృందం స్పెషల్ అప్డేట్‌ను పంచుకుంది. ఈ చిత్రం నుంచి 'కొల్ల గొట్టినాదిరో' అంటూ సాగే ప్రేమగీతాన్ని ఈ నెల 24న విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో పవన్ కల్యాణ్, కథానాయిక నిధి అగర్వాల్ లుక్ ఆకట్టుకుంది. ఇందులో పవన్ కల్యాణ్ పోరాట యోధుడిగా కనిపించనున్నారు. ఆయన ప్రియురాలిగా యువరాణి పాత్రలో నిధి నటిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశలో ఉంది. మార్చి 28న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏ. ఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. దర్శకత్వ బాధ్యతల నుంచి క్రిష్ వైదొలిగాక జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్నారు.

దర్శకుడిగా గొప్ప గౌరవాన్నిచ్చింది

చందు మొండేటి



"తండేల్ సినిమ పైరసీ బారినపడిందని తెలియగానే గుండెల్లో గునపంతో పొడిచినట్లనిపించింది. మన పిల్లల్ని ఎవరో కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లిపోయినంత బాధగా అనిపించింది' అని దర్శకుడు చందూ మొండేటి అన్నారు. నాగచైతన్య, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా ఆయన తెరకెక్కించిన 'తండేల్' గత వారం విడుదలై ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చందూ మీడియాతో మాట్లాడారు. 'తండేల్' చిత్రం ఘన విజయం దర్శకుడిగా తనకు గొప్ప గౌరవాన్ని అందించిందని చెప్పారు. "తండేల్ బయోపిక్ కాదు. వాస్తవిక సంఘటనల ఆధారంగా కాల్పనిక ప్రేమగాథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. అందుకే నిజజీవితంలోని వ్యక్తుల పేర్లను సినిమాలోని పాత్రలకు పెట్టలేదు. ప్రతి సన్నివేశానికి ప్రేక్షకులు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. చైతూ చాలా సిన్సియర్. ఆయన కష్టానికి తగిన ఫలితం దక్కి నటుడిగా చక్కటి ప్రశంసలు అందుకుంటున్నారు. హీరోగా నాగచైతన్యకు తొలి రూ. 100 కోట్ల సినిమా ఇచ్చినందుకు మా టీమ్‌తో పాటు నాకూ ఆనందంగా ఉంది. 'ఇది ఒక దర్శకుడి సినిమా అని రాఘవేంద్రరావు గారు ప్రశంసించడం మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది. తెనాలి రామకృష్ణుని పాత్రలో కూడా ఆయన అద్భుతంగా నటించగలరని నా నమ్మకం. అందుకే అలాంటి సినిమా చైతూతో చేయాలని దర్శకుడిగా, స్నేహితుడిగా నా కోరిక. ప్రస్తుతం సూర్యతో ఓ సినిమా కోసం చర్చలు జరుగుతున్నాయి. దాని తర్వాత 'కార్తికేయ 3' ఉంటుంది" అని చందు చెప్పారు.

సాంగ్ షూట్‌లో చిరు



చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విశ్వంభర'. యువీ క్రియేషన్స్ బేనర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. హైదరాబాద్ శంకర్‌పల్లిలో నిర్మించిన భారీ సెట్‌లో ప్రస్తుతం చిత్రీకరణ కొనసాగుతోంది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి ఇంట్రో సాంగ్‌ను తెరకెక్కిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, ఎం ఎం కీరవాణి స్వరపరిచారు. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. ఈ సందర్భంగా చిత్రబృందం పోస్టర్‌ను విడుదల చేసింది. చిరంజీవి కారు దిగుతున్న లుక్‌లో ఆకట్టుకున్నారు.



ఇన్ ప్రోగ్రెస్

బ్రహ్మా ఆనందం సంతృప్తినిచ్చింది



బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'బ్రహ్మా ఆనందం' చిత్రం ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణ పొందుతోంది. శనివారం చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. బ్రహ్మానందం మాట్లాడుతూ 'సినిమాను చూసినవారంతా మా అబ్బాయి గురించే మాట్లాడుతున్నారు. తండ్రిగా నాకు చాలా సంతోషం కలిగింది. చాలా కాలం తర్వాత ఓ మంచి సినిమా, మంచి పాత్రను చేశాననే సంతృప్తిని మిగిల్చింది' అని అన్నారు. 'హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు రాజా గౌతమ్ కృతజ్ఞతలు తెలిపారు.

స్కూటీ చుట్టూ తిరిగే బ్యూటీ



'ఆయ్', 'మారుతీ నగర్ సుబ్రమణ్యం' చిత్రాల ఫేమ్ అంకిత్ కొయ్య, నీలఖి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బ్యూటీ'. వర్ధన్ దర్శకత్వంలో అడిదాల విజయ్‌పాల్‌రెడ్డి, ఉమేశ్ కే.ఆర్.బన్సాల్ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. స్కూటీ చుట్టూ తిరిగే కథాంశంగా తెరకెక్కుతోందని మేకర్స్ తెలిపారు.

షూటింగ్ షురూ



అభినవ్ మణికంఠ, దివిజ ప్రభాకర్, తన్మయి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హే చికితా'. పృథ్వీరాజ్, ప్రభాకర్, దర్శకులు దేవీప్రసాద్, వీరశంకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ధన్‌రాజ్ లెక్కల దర్శకత్వంలో ఎస్.అశోక్ ఆర్.ఎస్.ఎస్, 'గరుడవేగ' అంజి నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్‌లోగోను దర్శకుడు అజయ్ భూపతి ఆవిష్కరించారు. తాజాగా, ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ చిత్రానికి ఎడిటర్: మధు, డీఓపీ: గరుడవేగ అంజి, సంగీతం: చరణ్ అర్జున్.

ట్రెండ్‌కు తగ్గ చిత్రం



రాజాబిరుదుల, లావణ్య రామారావు, చినబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కాలగమనం'. సుధాకర్ బుద్ధి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత ఏఎమ్ రత్నం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఈ చిత్రం ఉంది" అని చెప్పారు.

సరికొత్త సూపర్‌హీరో



అజయ్, రవి వర్మ, ఆమని, శ్రద్ధాదాస్, ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'త్రికాల'. మణి తెల్లగూటి దర్శకత్వంలో శ్రీనివాస్, రాధిక నిర్మిసున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్ మాట్లాడుతూ "ట్రైలర్ అద్భుతంగా ఉంది. తప్పకుండా అందర్నీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. నిర్మాత రాధిక మాట్లాడుతూ "పురాణాలకు కాల్పనికత జోడించి తయారుచేసిన సరికొత్త సూపర్ హీరో చిత్రం 'త్రికాల" అని తెలిపారు. అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు.





ఆయుష్ ఆస్పత్రి నుంచి.. కార్లో హైదరాబాద్ తీసుకెళ్లారు!

» హనుమాన్‌జంక్షన్ వద్ద ఓ ఇంట్లో అఫిడవిట్‌పై బలవంతపు సంతకాలు

» పోలీసులకు సత్యవర్ధన్ వాంగ్మూలం!



విజయవాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారుగా ఉంటూ యూటర్న్ తీసుకున్న ముదునూరి సత్యవర్ధన్ వాంగ్మూలాన్ని విజయవాడ పటమట పోలీసులు నమోదు చేశారు. వల్లభవనేని వంశీ అనుచరులు తనను ఎలా ట్రాప్ చేశారు.. ఎవరెవరు ఎక్కడెక్కడ తిప్పారో ఆయన వివరించారు. ముఖ్యంగా కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహన రంగారావు పేర్లను చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆయుష్ ఆసుపత్రి నుంచి కారులో హనుమాన్ జంక్షన్‌కు తీసుకెళ్లి బలవంతంగా ఓ ఇంట్లో అఫిడవిట్‌పై సంతకం చేయించుకున్నట్టు వాంగ్మూలం ఇచ్చాడు. తర్వాత అక్కడి నుంచే కారులో విజయవాడలో కోర్టుకు తీసుకెళ్లారని చెప్పాడు. ఎస్సీ, ఎస్టీ కోర్టులో న్యాయాధికారికి అఫిడవిట్‌ను అందజేశాక కారులో ఎవరెవరు హైదరాబాద్‌కు తీసుకెళ్లారో పేర్లను వివరించినట్టు సమాచారం. అక్కడి నుంచి మైహోం భూజాలోని వంశీ ఫ్లాట్‌కు తీసుకెళ్లారు. రాత్రంతా చిత్రహింసలు పెట్టిన తర్వాత అదే కారులో వైజాగ్‌లో ఉంటున్న వంశీ స్నేహితుల గెస్ట్‌హౌస్‌కు తరలించినట్టు వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. పోలీసులకు 161 వాంగ్మూలం ఇచ్చిన సత్యవర్ధన్ సోమవారం కోర్టులో న్యాయాధికారి ముందు ఇచ్చే అవకాశం ఉంది.

కొత్త దుప్పట్లు ఇవ్వండి

ఆ బ్యారక్‌లో ఉండను.. ఈ టాయిలెట్ వాడను.. నాకు ప్రత్యేకంగా మంచం కావాలని విజయవాడ జిల్లా జైలు అధికారులపై చిందులు తొక్కిన వల్లభనేని వంశీ.. తాజాగా కొత్త దుప్పట్ల కోసం పట్టుబట్టారు. అయితే ఖైదీలెవరికీ కొత్త బెడ్‌షీట్లు ఇవ్వరని, ఉతికినవి మాత్రమే ఇస్తామని అధికారులు చెప్పినట్లు తెలిసింది. ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నా కోర్టు ఆదేశాలు ఉండాల్సిందేనని మరోసారి స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో వంశీ మరో మాట మాట్లాడలేదని తెలిసింది.

ప్రభుత్వ భూమి.. వైసీపీ నేతల కబ్జా

టీడీపీ గ్రీవెన్సుకు పోటెత్తిన భూబాధితులు

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా గడివేముల మండలంలో ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారని, ఆ భూమిని వారినుంచి విడిపించి పేదలకు పంచాలని టీడీపీ ప్రజా వినతుల కార్యక్రమంలో గడివేములకు చెందిన మాలిక్ భాష ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను చెప్పుకొనేందుకు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. వీరిలో అధిక శాతం భూ సంబంధిత సమస్యలపైనే ఫిర్యాదులు ఇచ్చారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొత్త వజ్రకూటంలో తన తండ్రి మరణానంతరం వారసత్వంగా తనకు వచ్చిన భూమిని తనకు తెలియకుండా వేరే వ్యక్తుల పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని పిల్ల దేవానందం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రమణ్యం, తెలుగు యువత ఉపాధ్యక్షుడు రిష్వంత్ పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర వచ్చేలా చూడండి: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అగ్రివాచ్, రియల్ టైమ్ గవర్నెన్స్ అనుసంధానంతో ఎప్పటికప్పుడు కూరగాయల ధరలను పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. రైతులకు కనీసమద్దతు ధర వచ్చేలా చేయటంతోపాటు వినియోగదారులకు కూడా కనీస ధరలకు ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టంచేశారు. శనివారం విజయవాడ క్యాంప్ నుంచి ధరల పర్యవేక్షణపై వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలన్నారు. రైతుబజార్లలో సబ్జీ కూలర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. 2025-26 నుంచి పీఎం కిసాన్ సొమ్ము జమ కావాలంటే రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని చెప్పారు.

ఉక్కు ఉద్యోగుల జీతాలు.. 65 శాతమే!

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు సకాలంలో ఇవ్వాలంటూ కూటమి నేతలు ఎన్నో విజ్ఞప్తులు చేశారు. ఉక్కు మంత్రి కుమారస్వామి అలానేనంటూ హామీ ఇచ్చారు. ఆ హామీని హుళక్కి చేస్తూ, విన్నపాలను తోసిరాజంటూ ఉక్కుయాజమాన్యం వ్యవహరిస్తోంది. పూర్తి జీతాలు ఇవ్వడంలేదు. బకాయిలు విడుదల చేయడం లేదు. నెలలో సగం రోజులు పూర్తయిన తరువాత అంతకు 2నెలల ముందు జీతంలో 35% నుంచి 65% మాత్రమే ఇస్తున్నారు. తాజాగా డిసెంబరు జీతంలో 65శాతం ఉద్యోగుల ఖాతాల్లో వేశారు. స్టీల్ ప్లాంటులో ఉద్యోగులు, కార్మికులు అందరికీ కలిపి జీతాల కోసం నెలకు రూ.80 కోట్లు అవసరం. ప్లాంటు తయారు చేసిన ఉత్పత్తులు విక్రయిస్తే నెలకు సగటున రూ.2,000 కోట్లు వస్తున్నాయి. కార్మికులు కూడా అరకొర ముడి పదార్థాలతోనే రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో 110 శాతం ఉత్పత్తి తీస్తున్నారు. అయినా వారి కష్టాన్ని యాజమాన్యం గుర్తించ నిరాకరిస్తోంది. సెప్టెంబరు జీతాల్లో 50 శాతం, అక్టోబరు 35 శాతం, నవంబరు 35 శాతం, డిసెంబరు 35 శాతం, జనవరి 100 శాతం జీతాలు ఇవ్వాల్సి ఉంది.

విశాఖ స్టీల్‌ప్లాంటులో 1,100 మంది వీఆర్ఎస్?

» రెండు రోజుల్లో నోటీసులు

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటులో సుమారు 1,100 మందికి వీఆర్ఎస్ ఇవ్వనున్నట్టు తెలిసింది. వీఆర్ఎస్‌కు సుమారు 1,613 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1,240 మందికి యాజమాన్యం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. అయితే 1,100 మందికి వెంటనే వీఆర్ఎస్‌కు అవకాశం కల్పించనుంది. మిగిలిన 140 మందికి సంబంధించి చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని, వారు వాటిని పరిష్కరించుకుని కమిటీకి అప్పీల్ చేసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. తొలి విడత 1,100 మందికి సోమ, లేదా బుధవారాల్లో (మంగళవారం ప్లాంట్ ఆవిర్భావ దినోత్సవం) వీఆర్ఎస్‌కు నెల రోజుల ముందస్తు నోటీసులు ఇవ్వనున్నట్టు సమాచారం.

గుర్తింపు పొందితేనే 'వెటర్నరీ'గా పరిగణిస్తాం

» ఎస్‌వీసీలో నమోదు కాకుండా వెటర్నరీ పదం వాడరాదు: కౌన్సిల్ చైర్మన్

అమరావతి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్(ఏపీఎస్‌వీసీ)లో నమోదు కాకుండా ఏదైనా సంస్థలు, ఎవరైనా వ్యక్తులు తమ పేర్లలో 'వెటర్నరీ' అనే పదాన్ని వాడరాదని వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ పీవీ లక్ష్మయ్య స్పష్టం చేశారు. గ్రామీణ లైవ్‌స్టాక్ యూనిట్లు, రైతు సేవా కేంద్రాలను వెటర్నరీ సంస్థలుగా పరిగణించరాదని, అధికారికంగా గుర్తింపు పొందితేనే వెటర్నరీ సంస్థలుగా పరిగణిస్తామని పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్‌లో వెటర్నరీ భాగస్వామ్య సంస్థల సమావేశం నిర్వహించి, వెటర్నరీ వృత్తి నిబంధనలు, నైతిక ప్రమాణాలు, సేవలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

కొనసాగిన ఎండ తీవ్రత

విశాఖపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమ, కోస్తాలో పలు చోట్ల శనివారం ఎండ తీవ్రత కొనసాగింది. వాయవ్య దిశ నుంచి వీస్తున్న పొడిగాలుల ప్రభావంతో వేడి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కర్నూలులో 37.1డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శివారు ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో రాత్రి పూట చలి పెరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా కుంతలంలో 7.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తాలో పలుచోట్ల ఉదయం మంచు కురిసింది. రానున్న 24 గంటల్లో పలుచోట్ల మంచు కురుస్తుందని వాతావరణశాఖ తెలిపింది. తర్వాత 2 రోజుల్లో రాయలసీమలో ఎండ ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని పేర్కొంది.

రంగ రంగా..!

కిడ్నాప్ కేసు కీలక నిందితుడు వంశీ ముఖ్య అనుచరుడే!!

» సత్యవర్ధన్‌ను అతడి బంధువు ద్వారా ట్రాప్ చేసిన మోహన రంగారావు

» కొమ్మా కోట్లుతో కలిసి కిడ్నాప్ స్కెచ్

» ఈ ఇద్దరి కోసం పోలీసుల గాలింపు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ మూకల దాడిపై పోలీసులకు ఫిర్యాదుచేసిన ముసునూరి సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల వ్యవహారంలో వంశీ కీలక అనుచరులకు ఉచ్చు బిగుస్తోంది. ముఖ్యంగా ఆయనకు గుండెకాయలాంటివాడైన ఓలుపల్లి మోహన రంగారావు అలియాస్ రంగా పేరు ఈ కేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. వంశీ ఎమ్మెల్యేగా ఉన్నన్నాళ్లు తన వ్యవహారాలను, సెటిల్మెంట్లను, ఆర్థిక లావాదేవీలను చక్కబెట్టడానికి చుట్టూ అరాచక వలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈయన అనుంగు సన్నిహితుల్లో కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కోట్లు, రంగా కీలక వ్యక్తులు.. వంశీకి అత్యంత విశ్వాసపాత్రులు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి వేధించిన వ్యవహారంలో విజయవాడ పటమట పోలీసులు నమోదు చేసిన కేసులో 11 మంది నిందితులు ఉన్నట్లు పేర్కొన్నారు. దర్యాప్తు ముందుకు సాగేకొద్దీ ఈ సంఖ్య పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగా పేరు తెరపైకి వచ్చింది. వంశీకి సంబంధించిన రాజకీయ వ్యవహారాలన్నీ ఇతడే చూస్తుంటాడు. సత్యవర్ధన్ అంశాన్ని కూడా డీల్ చేశాడు. వంశీ ఎమ్మెల్యేగా ఉండగా గన్నవరంలో నివాసం ఉంటూ కార్యకలాపాలు నిర్వహించిన రంగా.. ప్రస్తుతం ఏలూరుకు మకాం మార్చేసినట్లు తెలుస్తోంది.

సత్యవర్ధన్‌కు టచ్‌లోకి ఇలా..

గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి, ధ్వంసం, వాహనాల దహనం కేసులో వంశీ అనుచరులు, వైసీపీ కార్యకర్తలు పలువురు అరెస్టయి జైలుకెళ్లిన సంగతి తెలిసిందే. దాడి ఫిర్యాదు వెనక్కి తీసుకుంటే ఈ కేసు వీగిపోతుందన్న ఉద్దేశంతో.. రంగా మొదట సత్యవర్ధన్ గురించి తెలుసుకున్నాడు. సత్యవర్ధన్ బంధువు ద్వారానే అతడిని పిలిపించి మాట్లాడాడు. తర్వాత కొమ్మా కోట్లుతో చర్చించి.. ఇద్దరూ కలిసి సత్యవర్ధన్‌ను ట్రాప్ చేసి కిడ్నాప్ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. వీరిద్దరూ ఇప్పుడు మాయమయ్యారు. వీరి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

'సంకల్పసిద్ధి' మోసం

గన్నవరంలో మధ్యతరగతి వ్యక్తి అయిన రంగా అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తాడు. ఏకంగా బీఎండబ్ల్యూ కారులో తిరిగే స్థాయికి ఎదిగాడు. వంశీ గన్నవరం రాజకీయాల్లో అడుగుపెట్టిన తర్వాత రంగా ఆయన పంచన చేరాడు. అత్యంత విశ్వాసపాత్రుడిగా మారిపోయాడు. వంశీని ఎవరైనా కలవాలంటే ముందుగా రంగాను కలవాల్సి ఉంటుంది. వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని కుదిపేసిన 'సంకల్పసిద్ధి' కుంభకోణంలో ఇతడి పాత్ర ఉన్నట్లు అప్పట్లో భారీగా ఆరోపణలు వచ్చాయి. రూ.500 కోట్ల ఈ స్కాంను రంగాయే నడిపించాడని విజయవాడ పోలీసులు గుర్తించారు. ఇది మల్టీలెవల్ మార్కెటింగ్ మోసం. గన్నవరం నియోజకవర్గానికి చెందిన గుత్తా వేణుగోపాలకృష్ణ, ఆయన కుమారుడు కిరణ్ డైరెక్టర్లుగా సంకల్పసిద్ధి ఈకార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో ఏర్పాటు చేశారు. కొద్దినెలల క్రితం ఏలూరు రోడ్డులో అరండల్‌పేటకు మార్చారు. దీనిని ప్రధాన కార్యాలయంగా, మహాత్మాగాంధీ రోడ్డులో ఉన్న ఆఫీసును బ్రాంచ్ కార్యాలయంగా ఉపయోగిస్తున్నారు. సంస్థలోకి సభ్యులను ఆకర్షించడానికి నిర్వాహకులు వివిధ ప్లాన్లను వదిలారు. ఒక్కసారి రూ.10వేలు పెట్టుబడి పెడితే 300 రోజుల్లో (11నెలలు) రూ.30 వేలు పొందవచ్చని ప్రకటించారు. ఒక వ్యక్తి ఒకసారి రూ.10 వేలు డిపాజిట్ చేస్తే రోజుకు రూ.100 చొప్పున 300 రోజులపాటు చెల్లిస్తారు. అదనంగా రూ.20వేలు లాభం ఇస్తామని సంకల్పసిద్ధి ప్రచారం చేసింది. 10వేలు డిపాజిట్ చేసిన వెంటనే ఒక డిజిట్ వ్యాలెట్‌కు సభ్యుడి బ్యాంకు ఖాతాను లింక్ చేశారు. ఈ వ్యాలెట్‌ను సభ్యులతో ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. సంస్థ రోజువారీగా ఇచ్చే రూ.100 నిల్వ ఈ వ్యాలెట్‌లో కనిపిస్తుంది. ఆ మొత్తం బ్యాంకు ఖాతాలో జమ కాకపోయినా.. వ్యాలెట్‌లో ఉన్న మొత్తం ఖాతాలో పడినట్లు చూపిస్తారు. పెరుగుతున్న నిల్వ డిజిటల్ వ్యాలెట్‌లో మాత్రమే కనిపిస్తుంది. కొన్ని రోజులు గడిచాక ఈ డబ్బులను మరో ప్లాన్‌లో పెట్టుబడిగా పెట్టించారు.



ఓలుపల్లి మోహన రంగారావు

- వేణుగోపాలకృష్ణ, కిరణ్ 20 ఎకరాల్లో ఆగ్రోఫామ్ కొనుగోలు చేశారు. అందులో వచ్చిన లాభాలను సభ్యులకు ఇస్తున్నామని ప్రచారం చేసుకున్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో ఉన్న సంకల్పసిద్ధి ఈకార్ట్‌లో అన్నిరకాల నిత్యావసర సరుకులను ఉంచారు. ఇందులో రూ.1,000 సరుకు కొనుగోలు చేసిన వారికి రూ.200-300 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తామని నమ్మించారు.
- ఒక సభ్యుడు మరో సభ్యుడిని చేర్పిస్తే అందులోనూ కమీషన్ ఉంటుందని చైన్ లింక్ విధానాన్ని అమలు చేశారు.
- ఇక రూ.లక్షల్లో వసూలు చేయడానికి సంకల్ప రిఫరల్ ప్లాన్‌ను అమలు చేశారు. ఇందులో మొత్తం ఐదు దశలు ఉంటాయి. ఈ ప్లాన్‌లో రూపాయిని రూపాయిగా కాకుండా పీవీ అనే కోడ్‌తో పిలిచేవారు. ఈ ప్లాన్ల ద్వారా మొత్తం రూ.500 కోట్ల వరకు ప్రజల నుంచి వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మొత్తం కుంభకోణానికి మోహనరంగారావే కర్త, కర్మ, క్రియ అని ప్రచారం జరిగింది.

దళిత యువకుడిని కిడ్నాప్ చేసినందుకే వంశీ జైలుకు

» తప్పు చేసినవారిని చట్టబద్ధంగా శిక్షిస్తాం: లోకేశ్



గన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): 'దళిత యువకుడిని కిడ్నాప్ చేసినందుకే మాజీ ఎమ్మెల్యే వంశీ జైలుకు వెళ్లారు. అన్ని వాస్తవాలు బయటకు వస్తాయి. ఎలాంటి సందేహమూ లేదు. న్యాయబద్ధంగా అన్ని చర్యలూ తీసుకుంటాం' అని మంత్రి లోకేశ్ అన్నారు. శనివారం గన్నవరం విమానాశ్రయం వద్ద ఆయన మాట్లాడారు. '2019-24 నడుమ మమ్మల్ని అడుగడుగునా ఇబ్బంది పెట్టారు. ఇంటి నుంచి బయటకు కూడా రానివ్వలేదు. ప్రభుత్వాన్ని నిలదీస్తే కేసులు పెట్టారు. దేవాలయంగా భావించే టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేశారు. గన్నవరం పార్టీ ఆఫీసును ధ్వంసం చేసి వాహనాలను తగులబెట్టారు. యువగళం 90 బహిరంగ సభల్లో ప్రజలకు రెడ్‌బుక్ చూపించి.. టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన అధికారులపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చాను. తప్పుచేసిన వారందరిని చట్టపరంగా శిక్షిస్తాం' అని లోకేశ్ తెలిపారు.

వంశీ ఇంట్లో సుదీర్ఘ సోదాలు

గచ్చిబౌలి నివాసంలో సెల్‌ఫోన్ల కోసం పోలీసుల గాలింపు

విజయవాడ/రాయదుర్గం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలిలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇంట్లో విజయవాడ పోలీసులు శనివారం సుదీర్ఘంగా సోదాలు నిర్వహించారు. అరెస్టుకు ముందు పోలీసుల నుంచి నోటీసు అందుకున్న తర్వాత తన సెల్‌ఫోన్లను ఆయన మాయం చేశారు వాటి కోసం విజయవాడ పటమట పోలీసులు వేట మొదలుపెట్టారు. ఇన్‌స్పెక్టర్, ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లతో వెళ్లిన బృందం రాయదుర్గం పోలీసుల సహకారంతో గచ్చిబౌలిలోని మైహోమ్ భూజా గేటెడ్ కమ్యూనిటీ 11వ అంతస్తులోని వంశీ ఇంట్లో తనిఖీలు నిర్వహించింది. గంటన్నర సోదాలు జరిపి కీలక ఆధారాలు సేకరించింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ దాడి కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, బెదిరించి.. ఫిర్యాదుతో తనకు సంబంధం లేదంటూ ఆయనతో న్యాయాధికారికి అఫిడవిట్ ఇప్పించాక.. ఆయన్ను కారులో హైదరాబాద్‌కు తరలించారని పోలీసులు కోర్టుకు ఇచ్చిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. సత్యవర్ధన్‌ను తీసుకెళ్లిన కారును ఇప్పటికే వారు గుర్తించారు. మైహోం భూజాలోకి ఏ మార్గంలో తీసుకెళ్లారో ఆరా తీస్తున్నారు. అందులో మూడు సెల్లార్లున్నాయి. ఎఫ్ బ్లాక్‌కు సంబంధించిన పార్కింగ్ సెల్లార్‌కు వెళ్లే.. వచ్చే మార్గాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. వంశీ ఇంట్లో ఫోన్లను ఎక్కడ రహస్యంగా ఉంచారో తెలుసుకునేందుకు సోదాలు నిర్వహించారు. ఏడీసీపీ జి.రామకృష్ణ ఈ నెల 13న హైదరాబాద్‌లో వంశీ ఇంటికి వెళ్లి ఆయనకు 47ఏ నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. అది అందుకున్నాక.. వంశీ డ్రెస్ మార్చుకొని వస్తానని చెప్పి బెడ్ రూమ్‌లోకి వెళ్లి సుమారు 45 నిమిషాలు ఫోన్‌లో పలువురితో మాట్లాడారు. తర్వాత దానిని మాయం చేసినట్లు పోలీసులు గుర్తించారు. వంశీని ఎలాంటి ఆటంకాలు లేకుండా అరెస్టు చేసి విజయవాడకు తరలించాలన్న హడావుడిలో పోలీసులు వంశీ ఫోన్‌ను స్వాధీనం చేసుకోలేదు. విజయవాడ చేరుకున్నాక ఫోన్ ఇవ్వాలని కోరగా.. ఆయన తన వద్ద లేదని చెప్పారు. కేసుకు సంబంధించిన కీలక సమాచారం ఫోన్ ద్వారా తెలిసే అవకాశం ఉండటంతో పాటు ఇంకా విలువైన సమాచారం లభించే అవకాశం ఉండడంతో పోలీసులు గచ్చిబౌలిలో తనిఖీలు నిర్వహించారు. ఇంట్లోని సీసీ ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆయన దాదాపు 5 ఫోన్లు ఉపయోగిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. వాటిని ల్యాబ్‌కు పంపితే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు. పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడ్డారు. వంశీ అనుచరుల అరెస్టుకు ఒక బృందం, వంశీవద్ద కీలక సమాచారాన్ని సేకరించే పనిలో ఇంకో బృందం ఉన్నట్లు సమాచారం.

రెవెన్యూ 'ఖాళీ'!

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాలు, డివిజన్‌లోని ఆర్డీవో ఆఫీసుల్లో తగినంత మంది సిబ్బంది లేక వెలవెలబోతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం.. ప్రస్తుతం 350 తహశీల్దార్, 150 డిప్యూటీ తహశీల్దార్ (డీటీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవికాకుండా ఆఫీసు పనికి కీలకమైన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) పోస్టులు 230, సీనియర్ అసిస్టెంట్లు-210, జూనియర్ అసిస్టెంట్ పదవులు 370 వరకు ఖాళీగా ఉన్నాయి.

ఏమిటి కారణం...

జగన్ సర్కారు జిల్లాల విభజన చేసింది గానీ.. కేడర్ విభజన చేయలేదు. దీంతో ఉద్యోగులపై పెనుభారం పడింది. దీనికితోడు రీసర్వే కోసం తహశీల్దార్ కార్యాలయాల్లోని సీనియర్ అసిస్టెంట్లకు తాత్కాలికంగా డిప్యూటీ తహశీల్దార్‌గా పదోన్నతులు ఇచ్చారు. వారిని 670 మండలాల్లో రీసర్వే డీటీలుగా నియమించారు. జిల్లాలు, డివిజన్, మండలాల పునర్విభజనకు తగినట్లుగా కేడర్ సంఖ్యను పెంచలేదు. నియామకాలూ జరుగలేదు. కనీసం సర్దుబాటు కోసం పదోన్నతుల ప్రక్రియ కూడా చేపట్టలేదు. దీంతో చాలా చోట్ల డీటీలనే మండలాలకు ఇన్‌చార్జి తహశీల్దార్లుగా నియమించారు. రెగ్యులర్ డీటీలను కలెక్టరేట్‌లోని సెక్షన్ల సూపరింటెండెంట్లుగా మార్చారు. అయినా సిబ్బంది సరిపోవడం లేదని రీసర్వే అప్పీళ్లను పరిష్కరించాల్సిన ఆర్ఎస్ డీటీలను కూడా తహశీల్దార్లుగా నియమించారు. కొందరు ఉద్యోగులు కక్కుర్తికిపోయి రెండేసి మండలాలకు కలిసి ఇన్‌చార్జిగా వేయించుకున్నారు. ఇంకొందరు రీసర్వే డీటీగా ఉంటూనే మండల తహశీల్దార్‌గా లేదంటే పౌరసరఫరాల శాఖ డీటీగా ఇన్‌చార్జి పోస్టు దక్కించుకున్నారు. దీంతో మండల ఆఫీసుల్లో ఫైళ్లను ముందుకు తీసుకెళ్లే సిబ్బంది తగిన సంఖ్యలో లేకుండా పోయారు. క్రియాశీల నిర్ణయాలు తీసుకోవలసిన డీటీ, తహశీల్దార్లు కూడా లేరు. నెల్లూరులాంటి జిల్లాల్లో రెండు మండలాలకో ఇన్‌చార్జి తహశీల్దార్ ఉన్నారు. ఇదే సిబ్బంది జగన్ ప్రభుత్వ హయాంలో రీసర్వే ఎంత అద్భుతంగా చేశారో.. ఇప్పుడు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న రెవెన్యూ ఫిర్యాదులే తార్కాణం. వాటిని పరిష్కరించడానికి తగినంత సిబ్బంది లేకపోవడంతో.. పరిష్కరించేసినట్లుగా అధికారులు చూపుతున్నారు.

ఒక్కో డివిజన్లో 15 వేల ఫిర్యాదులు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అసైన్డ్ భూముల రికార్డుల పరిశీలన, గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల వంటివి భారీగా నిర్వహించింది. ప్రజల నుంచి దాదాపు ఆరు లక్షల పిటిషన్లు అందాయి. సగటున ఒక్కో రెవెన్యూ డివిజన్ పరిధిలో 15 వేలు వచ్చాయి. ఒక్కో మండలంలో ఏడు వేల విన్నపాలు వచ్చాయి. మరి.. ఇన్ని లక్షల పిటిషన్లను.. తగినంత సిబ్బంది లేని రెవెన్యూ కార్యాలయాలు ఎలా పరిష్కరిస్తాయి? ఒక ఫిర్యాదుపై విచారణ చేయాలంటే కనీసం ఒక ఆర్‌ఐ ఉండాలి. ఆయన ఇచ్చిన నివేదికపై నిర్ణయం తీసుకోవాలంటే డీటీ గానీ, తహశీల్దార్ గానీ ఉండాలి. చాలా మండలాల్లో వీరు కూడా లేరు. కూటమి ప్రభుత్వం వచ్చాక రియల్‌టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) డేటా ప్రకారం.. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి 2.80 లక్షల పిటిషన్లు వచ్చాయి. అందులో 1.75 లక్షలు ఒక్క రెవెన్యూ శాఖ పరిష్కరించాల్సినవే కావడం విశేషం. ఇందులో 99.9 శాతం పరిష్కారం అయిపోయినట్లుగా రెవెన్యూ శాఖ గణాంకాలు ఇచ్చేసింది. ఆ తర్వాత ఇదే శాఖ.. రీ సర్వే జరిగిన గ్రామాల్లో సభలు నిర్వహిస్తే 2.50 లక్షల పిటిషన్లు వచ్చాయి. అందులో 90 శాతం పరిష్కారం చేశామని.. ఈ నెలాఖరుకల్లా మిగతావి కూడా పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ తాజాగా సీఎం చంద్రబాబుకు నివేదించింది.

ఒత్తిళ్లు తట్టుకోలేక..

ఒకవైపు సిబ్బంది లేకపోవడం, మరోవైపు లక్షల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వ పెద్దలు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల ఒత్తిడి. వీడియో, టెలికాన్ఫరెన్స్‌ల్లో ఇచ్చే ఆదేశాలను మండలాలు, ఆర్డీవో ఆఫీసుల అధికారులు భరించలేకపోతున్నారు. ఫలితంగా కొందరు అధికారులు.. రైతుల సమస్యలను పరిష్కరించినట్లుగా నివేదికలు పంపిస్తున్నారు. వాటిని చూసి రెవెన్యూ శాఖ భేష్ అనుకుంటోంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరు. ఇది మొదటికే మోసం తెచ్చేలా ఉందని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి. తమ సమస్యలు పరిష్కారం కాలేదని జనం మొత్తుకుంటున్నారు.

పరిష్కారం ఇలా..

రెవెన్యూ ఆఫీసులు బలోపేతమైతేనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయి. దీనికి ఒక్కటే మార్గం.. సిబ్బంది నియామకాలు, ఖాళీల భర్తీ. ఒకేసారి వేల పోస్టుల భర్తీ సాధ్యం కాకపోవచ్చు. క్షేత్రస్థాయిలో అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులిచ్చి కొంతమేర భర్తీచేయవచ్చు. 2023 నుంచి డీటీల పదోన్నతుల సమస్య నానుతోంది. ఎన్నికల సమయంలో పదోన్నతులు ఇచ్చేందుకు అధికారులు హడావుడి చేయగా కోర్టు నిలిపివేసింది. తర్వాత రెవెన్యూశాఖ పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్టేను తొలగింపజేసే ప్రయత్నాలు చేసి పదోన్నతుల ప్రక్రియను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



రైతు శ్రీనివాసులు సాగు చేసిన దానిమ్మ తోట, తోటలో ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబు, మంత్రుల ఫొటోలు

'అనంత' రైతన్నకు టీడీపీ అండ

» పార్టీ కేంద్ర కార్యాలయం జోక్యంతో విద్యుత్ సమస్య పరిష్కారం

» దానిమ్మ తోటను కాపాడుకున్న శ్రీనివాసులు

» కృతజ్ఞతగా తోటలో సీఎం చంద్రబాబు, మంత్రులు, పార్టీ నేతల ఫొటోలు

నార్పల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కారం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయాన్ని ఆశ్రయించిన అనంతపురానికి చెందిన ఓ రైతుకు న్యాయం జరిగింది. పార్టీ నేతల చొరవతో అధికారులు విద్యుత్ కనెక్షన్ సదుపాయం కల్పించడంతో 11 ఎకరాల్లో ఎండిపోయే పరిస్థితికి చేరుకున్న దానిమ్మ తోటకు నీరు అందించి కాపాడుకున్నాడు. దీంతో సీఎం చంద్రబాబుతో పాటు పలువురు పార్టీ నేతల ఫొటోలను తోటలోని బోరు బావి వద్ద ఏర్పాటుచేసి కృతజ్ఞత తెలిపాడు. అనంతపురం జిల్లా నార్పల మండలం వెంకటాంపల్లికి చెందిన శ్రీనివాసులు 11 ఎకరాల్లో దానిమ్మ పంట సాగు చేశాడు. బోరుబావులు ఇంకిపోవడంతో 2నెలల వ్యవధిలో రూ.28 లక్షలు వెచ్చించి ఏకంగా 48 బోరు బావులను తవ్వించాడు. ఒక్క బోరులో మాత్రమే పుష్కలంగా నీరు పడింది. కానీ గిట్టని వారు ఆ రైతుపై అధికారులకు ఫిర్యాదు చేశారు. వాల్టా చట్టానికి విరుద్ధంగా బోరు బావులు తవ్వించాడని, విద్యుత్ కనెక్షన్ ఇవ్వొద్దని పిటిషన్ పెట్టారు. బాధిత రైతు 9నెలల పాటు అధికారుల చుట్టూ తిరిగినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. నీరు అందక రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన దానిమ్మ తోట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో శ్రీనివాసులు దిక్కుతోచక ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. చివరి ప్రయత్నంగా తన భార్య, కూతురుతో కలిసి గతనెల 30న మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి మంత్రి కొండపల్లి శ్రీనివాసులు, పార్టీ నేత గండి బాబ్జీని కలిసి వినతిపత్రం సమర్పించాడు. స్పందించిన వారు అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఫోన్ చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లారు. రైతు శ్రీనివాసులు వాల్టా చట్టాన్ని ఉల్లంఘించలేదని గుర్తించి, వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. తర్వాత ఆ రైతు నీరుపెట్టి దానిమ్మ తోటను కాపాడుకున్నాడు.

వైసీపీ అబద్ధాలకు కొదవ లేదు

» వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఫైర్



నంద్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలు అంత స్పష్టమైన తీర్పు ఇచ్చినా వైసీపీ అబద్ధాలకు కొదవ లేదన్నట్లుగా వ్యవహరిస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. ఐదేళ్లపాటు వైసీపీ అధికారంలో ఉండి వైద్యకళాశాలలను పూర్తిగా గాలికి వదిలేసి, ఇప్పుడు పనులు జరుగుతున్నా దుష్ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. శనివారం నంద్యాల జిల్లాలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వం ఉండటంతో ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలు, మరోవైపు పెట్టుబడులు ఊపందుకున్నాయన్నారు. గతంలో కేంద్రం 17 వైద్య కళాశాలలను మంజూరు చేస్తే.. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఐదు మాత్రమే పూర్తి చేసిందన్నారు. నంద్యాల జిల్లాలోని వైద్యకళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థులకు మౌలిక వసతులు కూడా లేకుండా చేశారని మండిపడ్డారు. 50 శాతానికి పైగా ఫ్యాకల్టీ కొరత ఉందన్నారు. మిగిలిన వైద్య కళాశాలల్లోనూ ఇదే సమస్య ఉందని పేర్కొన్నారు. గతంలో రూ.850 కోట్ల నిధులు మంజూరు చేస్తే.. కేవలం 14 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే.. వైద్యకళాశాలల విషయంలో మళ్లీ అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. భవనాలు లేకుండా ఆస్పత్రి, హాస్టళ్ల నిర్మాణం చేయకుండా మెడికల్ కళాశాలలను ప్రారంభించడం సాధ్యం కాదన్నారు. రాష్ట్రానికి మంజూరైన ప్రతి వైద్య కళాశాలనూ అన్ని మౌలిక సదుపాయాలతో పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన వైద్యవిద్యను అందించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కాగా, ప్రతి కార్యకర్త కూడా కూటమి ధర్మాన్ని పాటిస్తూ బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

కూటమిలో విభేదాలు దుష్ప్రచారమే : సత్యకుమార్

అనంతపురం ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కూటమి నేతల మధ్య విభేదాలు ఉన్నాయనేది దుష్ప్రచారం మాత్రమేనని మంత్రి సత్యకుమార్ అన్నారు. 'రాష్ట్రంలోనే కాదు... నేను ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలోనూ కూటమిలో విభేదాలు లేవు. మేమంతా కలిసే పనిచేస్తున్నాం. డిప్యూటీ సీఎం నేతృత్వంలో అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నాం. జీబీఎస్ గురించి ఆందోళన వద్దు. రాష్ట్రంలో 7 కేసులే నమోదయ్యాయి. మరణాల నేపథ్యంలో అప్రమత్తంగానే ఉన్నాం. జీబీఎస్ నియంత్రణ కోసం వాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. బర్డ్‌ఫ్లూ ఎక్కడా మనుషులకు సంక్రమించలేదు. చికెన్ విషయంలో మంత్రి అచ్చెన్నాయుడు ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. అన్ని విషయాల్లోనూ రాష్ట్రానికి, కేంద్రం పూర్తిస్థాయిలో న్యాయం చేస్తోంది' అని మంత్రి అన్నారు.


నవ్వుల పువ్వులు..
దూబగుంటలో పాండ్ కం పార్క్ పరిశీలన అనంతరం రీసైక్లింగ్ ప్లాస్టిక్‌తో తయారు చేసిన బల్లపై కూర్చొన్న సీఎం చంద్రబాబు, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి, మంత్రి నారాయణ

పేదల కోసం నెలలో ఒకరోజు..

నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్రకు.. ఆ రోజు శుభ్రత కోసమే కేటాయింపు

- అదేరోజు పింఛన్లు పంపిణీ చేస్తున్నాం.. స్వచ్ఛాంధ్ర అందరి బాధ్యత కావాలి
- లక్షల టన్నుల చెత్త వదిలిపోయిన వైసీపీ.. దాన్ని శుభ్రం చేయడం కష్టమవుతోంది
- అప్పులున్నా సంక్షేమం అందిస్తున్నాం.. కందుకూరు స్వచ్ఛాంధ్ర సభలో సీఎం చంద్రబాబు

కందుకూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్షణం ప్రజాహితం కోసం, పేదల కోసం పరితపిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అందుకే నెలలో రెండు రోజులు ప్రత్యేకంగా కేటాయించామనీ, ఒకటవ తేదీ పేదలకు పింఛన్ల పంపిణీ, ప్రతి నెల మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' సాధన దిశగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడతామని సీఎం వివరించారు. పింఛన్ల పంపిణీ బాధ్యత అధికార యంత్రాంగం చూసుకుంటే, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో మాత్రం రాష్ట్రంలోని ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని చంద్రబాబు కోరారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. దూబగుంట గ్రామంలో స్వచ్ఛాంధ్రపై ప్రజలకు అవగాహన కార్యక్రమంతోపాటు చెత్తను ప్రాసెస్ చేసే (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్) ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. "సమాజంలో వాతావరణం కలుషితం అయ్యింది. ప్రజల ఆలోచనాధోరణి మారితేనే ఈ కలుషితాన్ని తుడిచి పెట్టగలం. స్వచ్ఛమైన ఆలోచనలతోనే స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుంది. పరిసరాల పరిశుభ్రతతోనే స్వర్ణాంధ్ర సాకారం అవుతుంది. పరిశుభ్రతను బాధ్యతగా గుర్తించి ఐటీసీ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం. పాత పుస్తకాలను రీసైక్లింగ్ చేసి కొత్త పుస్తకాలుగా ఆ సంస్థ తయారు చేస్తోంది. పాత పుస్తకాలను వారికి ఇవ్వడం ద్వారా ప్రజలకు సంపద వస్తోంది. అలాగే పేపర్ తయారీ కోసం వృక్షాల నరికివేత చాలా వరకు తగ్గుతుంది. ఇలా కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పారిశుధ్య ఉద్యమాన్ని నినాదంగా తీసుకొని ముందుకురావాలి. ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించడంతోపాటు చెత్త ద్వారా సంపద సృష్టించే పద్ధతులను ప్రజలకు తెలియజేయాలి." చంద్రబాబు కోరారు.

పచ్చదనం 29 శాతమే...

'గత ప్రభుత్వం చెత్త మీద పన్ను వేసింది. ప్రజలను పీడించి పన్నులు వసూలు చేసింది. చివరికి సేకరించిన చెత్తను కూడా బయటకు తరలించకుండా ఎక్కడిదక్కడ వదిలేసి వెళ్లిపోయింది. నేను ఆ రోజు ఆ ప్రభుత్వాన్ని చెత్త ప్రభుత్వం అని విమర్శించాను. కానీ ఇప్పుడు తెలిసింది.. ఆ చెత్త ప్రభుత్వం 85లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లిపోయింది. దానిని శుభ్రం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతి నాటికి రాష్ట్రంలో చెత్త నిల్వలు కనిపించకుండా చేయాలని మున్సిపల్ శాఖను ఆదేశించాను. రాష్ట్రంలో కందుకూరులో 25 టన్నుల సామర్థ్యం కలిగిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ (ఎంఆర్ఎఫ్)ను ప్రారంభించాం. ఇలాంటివి రాష్ట్రమంతా ఏర్పాటు చేయనున్నా"మని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 29 శాతం పచ్చదనం (గ్రీనరీ) ఉందని, దానిని 50 శాతానికి పెంచగలిగితే స్వచ్ఛమైన గాలి మన సొంతం అవుతుందని, ఇందుకోసం ప్రతి ఒక్కరు మొక్కల పెంపకాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని చంద్రబాబు కోరారు. డ్వాక్రా సంఘాలు స్థాపించినప్పుడు అందరూ ఎగతాళి చేశారనీ, ఈ రోజు డ్వాక్రాలు ఆర్థిక శక్తిగా ఎదిగారన్నారు. తెలుగు యువత ప్రపంచాన్ని శాసించే స్థాయికి తీసుకెళ్లే వరకు, రాష్ట్రంలో పేదరికం లేని సమాజం ఏర్పడే వరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సీఎం అన్నారు. సమస్యలపై ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీ పరిష్కారం అయ్యేలా యంత్రాంగాన్ని నడిపిస్తున్నామని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం ఒక్క అభివృద్ధి పనీ చేయకపోగా రూ.10లక్షల కోట్ల అప్పులు నెత్తిన పెట్టేసి పోయిందని, అప్పులోళ్లను చూసి భయపడే పరిస్థితి తీసుకొచ్చిందని సీఎం మండిపడ్డారు. "అప్పులు ఉన్నా సరే సంపద సృష్టిస్తాం. అప్పు చెల్లిస్తూనే అభివృద్ధి, సంక్షేమాలను కొనసాగిస్తా"మన్నారు. గత ఐదేళ్లపాటు గుంతలు పడిన రోడ్లపై తట్టెడు మన్ను వేసిన పాపాన పోలేదనీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రూ.1,600 కోట్లు ఖర్చు చేసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రోడ్లకు మరమ్మతులు చేశామని వివరించారు. ఈ సభలో మంత్రులు పొంగూరు నారాయణ, బాల వీరాంజనేయస్వామి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ ఆనంద్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సీఎంలా గాక.. సగటు మనిషిలా...!

- భద్రతా వలయాన్ని దాటుకుని ప్రజలతో మమేకం
- వారితో మాటామంతీ.. సెల్ఫీలు

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

గంభీర వదనం.. ముక్తసరి సమాధానం.. పొరపాటున కూడా చిరునవ్వు కనిపించేది కాదు.. అధికారంలో ఉన్నా.. లేకున్నా చంద్రబాబు తీరు ఇలాగే ఉండేది. నాలుగోసారి సీఎం అయ్యాక మాత్రం ఆయన పూర్తిగా మారిపోయారు. నెల్లూరు జిల్లా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట గ్రామంలో శనివారం పర్యటించిన సీఎం .. ఓ ముఖ్యమంత్రిలా కాకుండా సగటు మనిషిలా ప్రజలతో కలిసిపోయారు. తన బొమ్మ గీసి చేతికిచ్చిన విద్యార్థినిని నవ్వుతూ దగ్గరకు తీసుకున్నారు. 'మంచి పెయింటర్వు అవుతావు.. ఏం చదువుతున్నావు.. నీ పేరేంటి..' అని అడిగి తెలుసుకున్నారు. ఆ చిన్నారితో ఫొటో దిగారు. తమ తోటలో పండిన అరటి గెలతో స్వాగతం పలికిన దంపతులను ఆత్మీయంగా పలుకరించారు. వారి ప్రేమను కాదనలేక గెల నుంచి ఒక పండు తుంచుకున్నారు. పక్షవాతంతో చక్రాల కుర్చీకి పరిమితమైన తన తండ్రి పరిస్థితిని ఓ రైతు వివరించాడు. దివ్యాంగుల పింఛను ఇప్పించాలని కోరాడు. వచ్చే నెల నుంచే పింఛను అందేలా చూడాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. డ్వాక్రా మహిళలు రీసైక్లింగ్ ప్లాస్టిక్‌తో తయారు చేసిన బెంచీలను చూసి ముచ్చట పడ్డారు. ఒక బెంచ్‌పై కాసేపు కూర్చున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని పిలిచి పక్కన కూర్చోబెట్టుకున్నారు. సార్.. మీతో ఒక ఫొటో .. అని భయం భయంగా అడిగిన డ్వాక్రా మహిళలను.. నవ్వుతూ రండమ్మా అని ఫొటోలు దిగారు.

వీడూ దేవాన్షే..!

'మీ దేవాన్ష్ పుట్టినరోజే పుట్టాడు సార్, వీడి పేరు కూడా దేవాన్షే' అని ఒక తల్లి తన బిడ్డను పరిచయం చేసింది. సీఎం ఆ బాబును ఆశీర్వదించి ముందుకు కదిలారు. హెలిప్యాడ్ వద్దకు వచ్చిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, దగుమాటి కృష్ణారెడ్డి తదితరులను చంద్రబాబు నవ్వుతూ పలుకరించారు. మిమ్మల్నెవరినీ రావద్దన్నాను కదా అని అనగా.. 'మా నియోజకవర్గాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు ముగించుకునే వచ్చాం సార్' అని నవ్వుతూనే బదులిచ్చారు.

గిరిజన చట్టాలను కాపాడతాం

వారిలో పేదరిక నిర్మూలనకు సమగ్ర ప్రణాళిక: సీఎం

- ఉగాది నుంచి 'పీ-4'కు శ్రీకారం.. సంపద సృష్టించి పేదలకు అందిస్తాం
- వెల్త్.. హెల్త్.. హ్యాపీ.. ఇదే ప్రభుత్వ నినాదం.. వీటి ప్రాతిపదికగానే స్వర్ణాంధ్ర విజన్
- గిరిజనులను ఎమ్మెల్యేలు, మంత్రులను చేసిన ఘనత టీడీపీదే
- సంత్ సేవాలాల్ సేవలు భావితరాలకు ఆదర్శం..జయంతి సందర్భంగా చంద్రబాబు నివాళులు


సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి గుమ్మడి సంధ్యారాణి

అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ప్రణాళికతో గిరిజనుల్లో పేదరికాన్ని నిర్మూలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గిరిజన చట్టాలను కాపాడతామని స్పష్టం చేశారు. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఎన్టీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, ఆయన స్ఫూర్తితో వారికి రాజకీయ అవకాశాలు కల్పించి అండగా నిలిచామని చెప్పారు. బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి చంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా గుత్తి మండలం రామ్‌జీ నాయక్ తండాలో జన్మించిన సేవాలాల్.. ప్రజలను ఎంతో ప్రభావితం చేశారన్నారు. ఆ మహనీయుడి సేవలు భావితరాలకు ఆదర్శమని.. ఆయన జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన పుట్టిన గ్రామంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు రూ.50 లక్షలు విడుదల చేశామన్నారు. గిరిజన చట్టాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గిరిజన మైదాన ప్రాంతాల్లో 'సున్నా పేదరిక ప్రణాళిక'ను అమలు చేయనున్నట్లు తెలిపారు. 'ఉగాది నుంచి పీ-4 (పబ్లిక్- ప్రైవేటు-పీపుల్- పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమానికి శ్రీకారం చుడతాం. దీని ద్వారా పేదరిక నిర్మూలనకు అడుగులు వేస్తాం. ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న 10 శాతం మంది.. అట్టడుగున ఉన్న 20% మందికి చేయూత ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. సంపద సృష్టించి పేదలకు అందిస్తాం. వెల్త్, హెల్త్, హ్యా పీ అనేది మా ప్రభుత్వ నినాదం. ఈ మూడు సిద్ధాంతాల ఆధారంగా స్వర్ణాంధ్ర విజన్-2047కు రూపకల్పన చేశాం. సమైక్యాంధ్రలో 500 మంది జనాభా ఉన్న గిరిజన తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత.. గిరిజనులను ఎమ్మెల్యేలు, మంత్రులను చేసిన ఘనత టీడీపీదే. ఉమ్మడి రాష్ట్రంలో వరంగల్‌కు చెందిన చందూలాల్‌ను మొదటి సారిగా మంత్రిని చేశాం' అని గుర్తు చేశారు.

సంత్ సేవాలాల్‌కు లోకేశ్ నివాళి

సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపించిన మార్గం ఆదర్శనీయమని మంత్రి లోకేశ్ అన్నారు. తన పాటలు, రచనల ద్వారా ప్రజలను జాగృతం చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలోనూ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రమణ్యం, పరుచూరి కృష్ణ, హాజీ హసన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వారికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదు

- మహిళలపై నోరు జారడం నీచం
- జగన్ రాజకీయ చరిత్ర ముగిసింది
- ఇప్పటికైనా ఆయన మనిషిలా బతకడం నేర్చుకోవాలి: బుద్దా వెంకన్న



విజయవాడ (వన్‌టౌన్), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'ఇంటిలో ఆడవారిని తిట్టించి పైశాచిక ఆనందం పొందినవారికి రాజకీయాల్లో ఉండేందుకు కనీస అర్హత కూడా లేదు. అన్నం తినే వాడు ఎవరైనా ఇంటిలో ఆడవారిని తిట్టిస్తాడా? జగన్ వంటి నీచుడు మాత్రమే అలా చేస్తాడు. చంద్రబాబు తన కార్యకర్తలు ఎవరైనా నోరు జారినా ఊరుకోరు. వంశీ, కొడాలి నానితో మాట్లాడించిన జగన్ రాజకీయ చరిత్ర ముగిసింది. మొన్న ప్రజలు ఛీకొట్టి 11 సీట్లు ఇచ్చారు. ఈసారి అవికూడా రావు. ఇప్పటికైనా మనిషిగా బతకడం నేర్చుకోవాలి' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పిల్ల సైకో వంశీ అరెస్టును ఖండిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టిన జగన్ నీచుడు. ఎన్టీఆర్ కుమార్తెగా, చంద్రబాబు సతీమణిగా భువనేశ్వరికి సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంది. తండ్రి, భర్త సీఎంలుగా ఉన్నప్పటికీ సొంతంగా పారిశ్రామికవేత్తగా ఎదిగి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. అటువంటి ఆమెను అవమానిస్తే, నీచంగా మాట్లాడితే జగన్ సైకోలాగా ఆనందాన్ని పొందాడు. తల్లిని, చెల్లిని గౌరవించని జగన్‌కు ఇంతకన్నా సంస్కారం ఉంటుందని అనుకోనక్కర్లేదు. విజయసాయిరెడ్డి వంటి వారే జగన్ అరాచకాలను భరించలేక బయటికి వచ్చారు. కొడాలి నాని, వంశీ, అంబటి రాంబాబు, అనిల్ యాదవ్, వెలంపల్లి శ్రీనివాసరావు, రోజాలకు శిక్షణ ఇచ్చి జగనే మాట్లాడించాడు. వంశీ అవినీతిపై 2019లోనే తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విచారణ జరిగింది. బ్రహ్మలింగయ్య చెరువు భూములు, ఇళ్ల స్థలాల కేటాయింపులో దోచుకున్నాడు. అప్పుడే అనేక సార్లు వంశీకి చంద్రబాబు హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వం రాగానే తన తప్పులను ఒప్పులుగా మార్చుకునేందుకు ఆ పార్టీలోకి వెళ్లాడన్నారు. ఉచ్చనీచాలు మరచి వ్యాఖ్యలు చేసిన వంశీని అరెస్టు చేస్తే... ప్రజలు హర్షిస్తున్నారు' అని బుద్దా అన్నారు.

మహిళల జోలికొస్తే మరణదండనే!

- డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తీవ్ర హెచ్చరిక



అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల జోలికి ఎవరొచ్చినా, అబలలపై అఘాయిత్యాలకు పాల్పడినా మరణశిక్ష నుంచి తప్పించుకోలేరని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా హెచ్చరించారు. ఇటీవల అన్నమయ్య, గుంటూరు, పల్నాడు సహా పలు జిల్లాల్లో మహిళలపై జరిగిన దాడులను రాష్ట్ర పోలీసుశాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ దాడులకు పాల్పడినవారిని అరెస్టు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా మరణశిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, న్యాయనిపుణులతో చర్చించిన డీజీపీ మహిళలపై నేరాలకు పాల్పడేవారికి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో ఎక్కడికక్కడ నిఘా పెంచాలని, సైకో రోమియోలపై ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేయాలని క్షేత్రస్థాయి పోలీసులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. న్యాయస్థానాలు, న్యాయవాదులు, జైళ్లు, ఎన్‌జీవోలు, మహిళా సంఘాలు, సమాజంలో బాధ్యత కలిగిన ప్రతి వ్యక్తితో సమన్వయం చేసుకుంటూ దేశంలోనే మహిళలకు అత్యంత రక్షణ ఉన్న రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామన్నారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ ఒక్క మహిళ భయపడాల్సిన అవసరం లేదని, ఏ చిన్న ఆపద ఉన్నా వెంటనే పోలీసులను సంప్రదిస్తే పూర్తి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఆడబిడ్డల విషయంలో తమ బిడ్డలు అదుపు తప్పకుండా యువకుల తల్లిదండ్రులు కూడా జాగ్రత్త పడాలని, వారి వల్ల కాకపోతే పోలీసులతో కౌన్సెలింగ్ ఇప్పించేందుకు కూడా సంకోచించవద్దని సూచించారు. మైనర్లు, వృద్ధులపై యాసిడ్ దాడులు, లైంగిక వేధింపులకు పాల్పడేవారి వయసు 20 నుంచి 75 సంవత్సరాల వరకు ఉంటోందని, వీరి వల్ల బాధిత కుటుంబాలతోపాటు సమాజంలోనూ శాంతి, సామరస్యాలకు విఘాతం కలుగుతోందని, ప్రజల్లో భయం, అభద్రతా వాతావరణం నెలకొంటోందని చెప్పారు. ఇలాంటి ఘోరమైన నేరాలను సీరియస్‌గా తీసుకోవడంతోపాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకోడానికి రాష్ట్ర పోలీసుశాఖ కట్టుబడి ఉందన్నారు. ఇలాంటి కేసుల్లో చట్ట ప్రకారం జీవితకాలం జైలు, మరణశిక్ష కూడా పడేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

చట్టం నుంచి తప్పించుకోలేరు

లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, ఇతర తీవ్రమైన నేరపూరిత స్వభావం, ధోరణులను కలిగి ఉన్న ఎవరైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరని డీజీపీ హెచ్చరించారు. అలాంటివారు వెంటనే తమ మార్గాలను సరిదిద్దుకోవాలని సూచించారు. వారి పట్ల పోలీసులకు ఉదాశీనత ఉండదని స్పష్టం చేశారు. అలాంటి నేరస్థులను గుర్తించడం, ట్రాక్ చేయడం, న్యాయస్థానం ముందుకు తీసుకురావడంలో పోలీసు యంత్రాంగం చురుగ్గా పనిచేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో నేరాలను పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సైబర్ సెల్స్ చురుగ్గా పని చేస్తున్నాయన్నారు. ఈ నేరస్థులకు ఆశ్రయం కల్పించడం, మద్దతు, వనరులను అందించే వ్యక్తులు, సమూహాలు, నెట్‌వర్క్‌లపైనా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

నిఘా తీవ్రతరం

నేటి డిజిటల్ యుగంలో నేరస్థులు తమ అక్రమ కార్యకలాపాలకు సైబర్ స్పేస్‌ను ఉపయోగించుకుంటున్నారని డీజీపీ తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీస్ సైబర్ క్రైం విభాగాన్ని మరింత పటిష్ఠం చేసి, వివిధ డిజిటల్ ప్లాట్ ఫారాలలో అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘాను తీవ్రతరం చేసినట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో లైంగిక వేధింపుల(డిజిటల్ వేధింపులు)కు పాల్పడటం, హింసాత్మక దాడులకు ప్లాన్ చేసేవారిని ట్రాక్ చేసి చట్టంలోని సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి విచారిస్తామని వివరించారు. నేరాల విషయంలో జీరో టాలరెన్స్ విధానంలో రాష్ట్ర పోలీసుశాఖ పని చేస్తుందని డీజీపీ చెప్పారు.

ఆ మహిళా పోలీసులను ఏం చేద్దాం?

- యూనిఫాం సర్వీసు చేయలేమని అంటున్న సచివాలయ మహిళా పోలీసులు..
- వీరిపై హోం, శిశు సంక్షేమ శాఖ మంత్రుల చర్చలు
- సీఎం సమక్షంలోనే తుది నిర్ణయం!

అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వారిని సచివాలయాల పరిధిలో శిశు సంక్షేమ విధుల కోసం తీసుకున్నారు. కానీ, ఆ తర్వాత యూనిఫాం ఇచ్చి పోలీసు డ్యూటీ చేయమన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఎటాచ్ చేసి ప్రమాదకర పనులూ చేయించారు. తమ నియామకానికీ, చేస్తున్న విధులకూ పొంతన లేకపోవడంతో వారిలో కొందరు కోర్టులను ఆశ్రయించారు. కోర్టులో ఈ విషయం నలుగుతుండగానే రాష్ట్రంలో ప్రభుత్వం మారి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు వారి సేవలను ఎలా వినియోగించుకోవాలనేది పెద్ద ప్రశ్నగా ముందు నిలిచింది. నాడు జగన్ ప్రభుత్వం నిర్వాకంతో బాధలు పడుతున్న సచివాలయాల మహిళా పోలీసుల దుస్థితి ఇదీ! వీరి సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించింది. వీరి సేవల వినియోగం విషయమై శనివారం హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఇరు శాఖల అధికారులు చర్చించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోకి వారిని తీసుకురావాలని యోచించారు. చివరకు, దీనిపై మరోసారి కలిసి మాట్లాడదామని, ఆ తర్వాత సీఎం చంద్రబాబు సమక్షంలో నిర్ణయం తీసుకుందామని ఇరువురు మంత్రులు భావించారు.

జాబ్ చార్టు ఎలా ఉండాలి?

ఒకవేళ మహిళా పోలీసులను మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయిస్తే, వారి సేవలను వినియోగించుకోవడంపై ఆ శాఖ ప్రాథమికంగా కసరత్తు చేసింది. కొన్ని విభాగాలను, సేవలను గుర్తించింది. అవి..

వన్ స్టాప్ సెంటర్లు: రాష్ట్రంలో 29 వన్ స్టాప్ సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్ల సంరక్షణ విధులు ఇచ్చే అవకాశం ఉంది.

మహిళా,శిశు గృహాలు, శక్తి సదన్లు: మహిళా హాస్టళ్లు, శిశు గృహాలు, శక్తి సదన్లలో వీరి సేవలను వినియోగించుకునే వీలుంది.

దొంగలు బాగా తెలివిమీరారు

- టెక్నాలజీ సాయంతో నేరాలను నియంత్రించాలి
- హోం మంత్రి వంగలపూడి అనిత
- డిజిటల్ ఎవిడెన్స్ ప్రాముఖ్యతపై విజయవాడలో వర్క్‌షాపు

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దొంగలు ఇప్పుడు బాగా తెలివిమీరిపోయారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నా రు. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరస్తులను పట్టుకోవడానికి పోలీసు వ్యవస్థ అప్‌గ్రేడ్ అవ్వాలని, టెక్నాలజీని ఉపయోగించుకొని నేరాలను నియంత్రించాలని సూచించారు. విజయవాడలోని జీఆర్‌టీ హోటల్‌లో శనివారం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆధ్వర్యంలో డిజిటల్ ఎవిడెన్స్ ప్రాముఖ్యతపై రాష్ట్రస్థాయి వర్క్‌షాపు జరిగింది. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా మంత్రి అనిత విచ్చేశారు. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో మహిళలు ఎక్కువ మంది ఉండటం శుభపరిణామమన్నారు. పోలీసు, న్యాయవ్యవస్థల సమన్వయంతో చాలా కేసులు ఛేదించవచ్చన్నారు. ప్రస్తుతం అన్ని కేసుల్లోనూ డిజిటల్ ఎవిడెన్స్ ఉంటోందని విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు చెప్పారు. అయితే డిజిటల్ ఎవిడెన్స్‌ను ఎలా సేకరించాలి అనే దానిపై సిబ్బందికి శిక్షణ అవసరమన్నారు. అనంతరం హోం మంత్రి అనితను ఏపీపీలు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్లు, పలుప్రాంతాల నుంచి వచ్చిన ఏపీపీలు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో హోం మంత్రి అనిత మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తప్పు చేసినట్లు అన్ని ఆధారాలు ఉన్నాయని, ఆయన అరెస్టు కక్షసాధింపు చర్య కాదని స్పష్టం చేశారు.


జ్యోతిని వెలిగించి డిజిటల్ ఎవిడెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

చిన్నారులపై లైంగిక అకృత్యాలు ఆందోళనకరం

చిన్నారులకు అవగాహన కల్పించడం అవశ్యం.. న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి బబిత

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చిన్నారులపై రోజురోజుకూ లైంగిక అకృత్యాలు పెరుగుతుండడం ఆందోళనకరమని ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం.బబిత ఆవేదన వ్యక్తం చేశారు. చాలా కేసుల్లో దగ్గరి బంధువులే అఘాయిత్యాలకు పాల్పడుతుండడం మరింత దారుణమన్నారు. చిన్నారులపై జరుగుతున్న లైంగిక నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏపీ న్యాయసేవాధికార సంస్థ ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించింది. శనివారం రాజధాని ప్రాంతంలోని శాఖమూరు గ్రామంలో విట్ న్యాయ కళాశాల విద్యార్థులతో ఇంటింటికీ తిరిగి.. చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోక్సో చట్టంపై గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని బబిత జెండా ఊపి ప్రారంభించారు. చిన్నారులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అన్నారు. నేరం జరగకుండా వారు అప్రమత్తమయ్యేలా చూడాలని చెప్పారు. రానున్న రోజుల్లో న్యాయ విద్యార్థులతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బబిత తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ ఉపకార్యదర్శి అమర రంగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎస్.జేజేశ్వరరావు, గుంటూరు జడ్జీ డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, విట్ కళాశాల ప్రిన్సిపాల్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.


శాఖమూరులో జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం.బబిత



టీడీపీలో చేరిన కౌన్సిలర్లతో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబు

టీడీపీలోకి మరో ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు

- యనమల సమక్షంలో ఇప్పటిదాకా పది మంది చేరిక

తుని రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీలో వైసీపీ కౌన్సిలర్లు వరుసగా టీడీపీలోకి చేరుతున్నారు. ఇప్పటికే నలుగురు వైసీపీ కౌన్సిలర్లు సైకిల్ ఎక్కగా, తాజాగా మరో ఆరుగురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం వీరు తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో టీడీపీలోకి చేరగా, వీరికి మాజీ మంత్రి, ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో 12వ వార్డు కౌన్సిలర్ బి.వెంకటదారేష్, 19వార్డు ఆచంట సురేష్, 24వ వార్డు కౌన్సిలర్ పులి సత్యనారాయణ, 29 వార్డు కౌన్సిలర్ దాశపర్తి రాజేశ్వరి, 30వ వార్డు కౌన్సిలర్ సిద్దిరెడ్డి గౌరీ వనజ, 20వ వార్డు కౌన్సిలర్ రాసబోయిన అప్పయ్యమ్మ ఉన్నారు. ఇంతకుముందు 23వ వార్డు కౌన్సిలర్ కర్రి శ్రీదేవి, 28వ వార్డు కౌన్సిలర్ చింతకాయల భారతి, 4వ వార్డు కౌన్సిలర్ తుమ్మలపల్లి సుశీల, 8వ వార్డు కౌన్సిలర్ నార్ల భువనేశ్వరి వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత రాజా అశోక్‌బాబు, తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, నాయకులు మోతుకూరి వెంకటేష్, కుక్కడపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు. కాగా తుని మున్సిపాలిటీలో మొత్తం 30 వార్డులనూ వైసీపీ గెలుచుకోగా, వారిలో ఒకరు మరణించారు. మిగిలిన 29 మందిలో పది మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు.

ఫిషింగ్ మెయిల్‌తో 'మేఘా'కు టోకరా!

- రూ.5.47 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు
- సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేసిన సంస్థ

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు వ్యక్తులనే కాదు.. బడా సంస్థలనూ బురిడీ కొట్టిస్తున్నారు. రూ.కోట్లు కొట్టేస్తున్నారు. తాజాగా మేఘా ఇంజనీరింగ్ సంస్థ కూడా వీరి వలలో చిక్కింది. సైబర్ నేరగాళ్లు ఈ సంస్థ నుంచి రెండు విడతల్లో రూ.5.47 కోట్లు కాజేశారు. ఫిషింగ్ ఈ మెయిల్ ద్వారా మేఘా సంస్థకు చెందిన ఈ-మెయిల్ వ్యవస్థలోకి చొరబడ్డ నేరగాళ్లు.. ఈ మోసానికి పాల్పడ్డారని కేసు దర్యాప్తు ప్రారంభించిన సైబర్ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. నేరగాళ్లు మేఘా కంపెనీ లావాదేవీలను ఫిషింగ్ ఈ-మెయిల్ ద్వారా గమనిస్తూ ఏయే కంపెనీలతో లావాదేవీలు జరుగుతున్నాయో గుర్తించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత డబ్బు అందుకున్న కంపెనీ నుంచి మేఘా సంస్థకు కన్ఫర్మేషన్ మెయిల్ వచ్చేది. దీన్నే సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకున్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన ఒక కంపెనీ నుంచి కొన్ని పరికరాల కోసం మేఘా సంస్థ ఆర్డర్ పెట్టింది. ఆ పరికరాలు అందిన తర్వాత నెదర్లాండ్ కంపెనీ నుంచి ఇన్‌వాయిస్ రావడంతో అందుకు తగ్గ మొత్తాలను మేఘా ప్రతినిధులు చెల్లించారు. ఈ క్రమంలో నెదర్లాండ్ కంపెనీ పంపించే ఈ-మెయిల్ మాదిరిగానే ఒక్క అక్షరం మార్చి సైబర్ నేరగాళ్లు మేఘాకు మెయిల్ చేశారు. తమ బ్యాంకు ఖాతా మారిందని, తదుపరి చెల్లింపులు ఈ ఖాతాకు చేయాలని పేర్కొన్నారు. మేఘా కంపెనీ ప్రతినిధులు ఈ-మెయిల్‌లో అక్షరం మారిన విషయాన్ని గమనించకుండా రెండు విడతల్లో రూ.5.47 కోట్లను కొత్త ఖాతాకు పంపారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఈ సొమ్ము అందినట్లుగా కన్ఫర్మేషన్ మెయిల్ వచ్చింది. కానీ, తమకు డబ్బు అందలేదని నెదర్లాండ్స్ కంపెనీ నుంచి మెయిల్ రావడంతో మేఘా ప్రతినిధులు అవాక్కయ్యారు. తాము మోసపోయినట్లు గుర్తించి సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేశారు. ఫిషింగ్ ఈ-మెయిల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పదేపదే హెచ్చరిస్తున్నా మోసాలు జరుగుతూనే ఉన్నాయని సైబర్ సెక్యూరిటీ అధికారులు చెబుతున్నారు.

సరికొత్తగా రహదారులు!

పీపీపీ విధానంలో రాష్ట్ర హైవేల అభివృద్ధి .. 10,200 కి.మీ. మేర విస్తరణకు ప్రణాళికలు

- ముందుగా 3,967 కోట్లతో 5,238 కి.మీ.లలో..
- నివేదికలు అందిన తర్వాత టెండర్ల ప్రక్రియ
- వీజీఎఫ్ కింద 20శాతం భరించనున్న కేంద్రం
- భూ సేకరణకయ్యే వ్యయం రాష్ట్ర ప్రభుత్వానిదే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జాతీయ రహదారుల స్థాయిలో రాష్ట్రంలో స్టేట్ హైవేల అభివృద్ధికి రంగం సిద్ధమైంది. రోడ్లపై ఎక్కడా గుంతలు లేకుండా ప్రయాణం సాఫీగా సాగిపోయేందుకు కూటమి ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో రహదారుల వ్యవస్థను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని సర్కారు విశ్వసిస్తోంది. రహదారి కారిడార్ నెట్‌వర్క్ బలపడితే రవాణా వ్యవస్థ మరింత మెరుగవుతుందని, పెట్టుబడులు కూడా వస్తాయని ఆశిస్తోంది. దీనిలో భాగంగా ఎన్‌హెచ్‌ల స్థాయిలో రాష్ట్ర ప్రధాన రోడ్ల (స్టేట్ హైవేల)ను పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో విస్తరించాలని నిర్ణయించింది. కేంద్ర సర్కారు కూడా ఇదే విధానంలో జాతీయ రహదారులను నిర్మిస్తోంది. గతంలో రాష్ట్రంలోనూ మూడు ప్రధాన రహదారులను గతంలో పీపీపీ విధానంలో అభివృద్ధి చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో 10,200 కి.మీ. మేర రహదారులను ఈ విధానంలో విస్తరించి, అభివృద్ధి చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే కొన్ని రోడ్లను ఎంపిక చేశారు. వాటి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం కొనసాగుతోంది. ఆ నివేదికలు వచ్చిన తర్వాత ఎంపిక చేసిన తొలిదశ రహదారుల నిర్మాణానికి టెండర్లు పిలవనుంది. వచ్చే 3నెలల్లో ఈ ప్రక్రియ కొలిక్కివస్తుందని ఆర్‌అండ్‌బీ వర్గాలు చెబుతున్నాయి. ప్రైవేట్ భాగస్వామ్యంలో రహదారుల నిర్మాణం పూర్తయితే వాటి నిర్వహణకు టోల్‌గేట్లు ఏర్పాటుచేసి వాహనదారుల నుంచి ఫీజులు వసూలు చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ నియంత్రణలో 45,378 కి.మీ. రహదారులు ఉన్నాయి. ఇందులో గ్రామీణ, మండల, జిల్లా కేంద్రాలతో అనుసంధానమైన జిల్లా ప్రధాన రహదారులు (ఎండీఆర్) 32,725 కిలోమీటర్లు, డివిజనల్ కేంద్రాలు, జిల్లాలను అనుసంధానించే స్టేట్ హైవేలు 12,653 కి.మీ. మేర ఉన్నాయి. రాష్ట్ర ప్రధాన రహదారుల్లో 10,200 కి.మీ. రోడ్లను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. దీనికయ్యే వ్యయంలో 20శాతం వయబులిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద కేంద్రం, మరో 20శాతం రాష్ట్ర సర్కారు ఇస్తాయి. రహదారుల విస్తరణకు అవసరమైన భూ సేకరణకయ్యే ఖర్చును కూడా రాష్ట్రమే భరిస్తుంది. మిగిలిన మొత్తం కాంట్రాక్ట్ సంస్థ భరించాలి. రహదారి నిర్మాణం తర్వాత 20 లేదా 30 ఏళ్ల పాటు కాంట్రాక్ట్ సంస్థకు అప్పగిస్తారు. ఆ సంస్థ టోల్‌ప్లాజాను ఏర్పాటుచేసి వాహనదారుల నుంచి ఫీజు వసూలు చేస్తుంది. టోల్ ఎంత ఉండాలి, ఎంత కాలం అనేది రహదారి నిర్మాణానికి అయ్యే వ్యయం, కాంట్రాక్ట్ అగ్రిమెంటు ప్రకారం నిర్ణయిస్తారు.



తొలి దశలో 5,238 కి.మీ. అభివృద్ధి

ఈ ప్రాజెక్టు తొలిదశలో రూ.3,967 కోట్ల వ్యయంతో 5,238 కి.మీ. స్టేట్‌హైవేలను అభివృద్ధి చేయాలని ఆర్‌అండ్‌బీ ప్రణాళిక రూపొందించింది. కనీసం 20 కి.మీ. పైగా పొడవైన రహదారులను గుర్తించి వాటిని విస్తరణ జాబితాలోకి తీసుకొస్తారు. దీనిలో భాగంగా ప్యాకేజీ-1ఏ కింద రూ.3,296 కోట్ల వ్యయంతో 1,307 కి.మీ. రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ కేటగిరీలో వర్క్‌లను ఏడు ప్యాకేజీల కింద విభజించారు. ఒక్కో ప్యాకేజీలో సగటున రెండు స్టేట్ హైవేలు ఉన్నాయి.

జగన్ హయాంలో రోడ్లన్నీ ధ్వంసం

ఉమ్మడి రాష్ట్రంలో రహదారుల నిర్వహణకు రూ.వేల కోట్ల బడ్జెట్ ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత ఈ బడ్జెట్ గణనీయంగా తగ్గిపోయింది. ఎక్కువగా కేంద్రం ఇచ్చే సీఆర్‌ఐఎఫ్ వంటి నిధులతోనూ, నాబార్డుతో పాటు అంతర్జాతీయంగా తీసుకొచ్చే అప్పులతోనే ప్రాజెక్టులు చేపడుతున్నారు. జగన్ హయాంలో రాష్ట్ర, జిల్లా, గ్రామీణ రహదారుల నిర్వహణ ఘోరంగా తయారైంది. నిధుల కేటాయింపు చూపినా ఆచరణలో వాటిని విడుదల చేయకపోవడంతో రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్లపై గుంతలు పూడ్చడానికి తట్టెడు మట్టి వేసేందుకు రూపాయి కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారి మరమ్మతులకు ప్రాధాన్యం ఇచ్చింది. ఈ నెలాఖరు నాటికి రోడ్లన్నీ గుంతల రహితంగా మార్చడమే లక్ష్యంగా ఆర్‌అండ్‌బీకి రూ.828 కోట్లు కేటాయించింది.

ప్యాకేజీ-1:
1. చిలకలపాలెం-రామభద్రాపురం-రాయగడ. 2. విజయనగరం-పాలకొండ. ఈ రెండు రహదారుల పొడవు 203 కి.మీ. వీటి నిర్మాణం కోసం రూ.508 కోట్ల వ్యయం కానుందని అంచనా.

ప్యాకేజీ-2
1. కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం, 2. భీమునిపట్నం-నర్సీపట్నం. ఈ రహదారుల పొడవు 192 కి.మీ. కాగా, నిర్మాణ వ్యయం రూ.480 కోట్లుగా అంచనా వేశారు.

ప్యాకేజీ-3
1. కాకినాడ- జొన్నాడ, 2. కాకినాడ- రాజమండ్రి, 3. ఏలూరు- మేడిశెట్టివారిపాలెం. ఈ మూడు రోడ్ల పొడవు 185. కి.మీ. నిర్మాణ వ్యయం రూ.463 కోట్ల మేర ఉంటుందని అంచనా.

ప్యాకేజీ-4
1. నరసాపురం-అశ్వారావుపేట, 2. ఏలూరు-జంగారెడ్డిగూడెం, 3. గుంటూరు-పర్చూరు. ఈ మూడింటి పొడవు 194 కి.మీ. నిర్మాణ వ్యయం రూ.485 కోట్లుగా అంచనా వేశారు.

ప్యాకేజీ-5
1. గుంటూరు-బాపట్ల, 2. మంగళగిరి-తెనాలి-నారాకోడూరు, 3. బెస్తవారిపేట-ఒంగోలు. ఈ మూడు రోడ్ల పొడవు 205 కి.మీ. నిర్మాణ వ్యయం రూ.513 కోట్లు అవుతుందని అంచనా.

ప్యాకేజీ-6
1. రాజంపేట-గూడూరు, 2. ప్యాపిలి-బనగానపల్లి. 150 కి.మీ. పొడవైన ఈ రహదారుల నిర్మాణ వ్యయం 375 కోట్లు కాగలదని అంచనా.

ప్యాకేజీ-7
1. దామాజీపల్లి- తాడిపత్రి, 2. జమ్మలమడుగు- కొలిమిగుండ్ల, 3. సోమందేపల్లి- హిందూపురం-తూముకుంట. 178 కి.మీ. పొడవైన ఈ మూడు రహదారుల విస్తరణ, అభివృద్ధికి రూ.445 కోట్లు వ్యయం కాగలదని ఆర్‌అండ్‌బీ అంచనా వేసింది.

ప్యాకేజీ- 1బీ
26 జిల్లాల పరిధిలో 3,931 కిమీ రహదారులను అభివృద్ధి చేస్తారు. ఇందుకు రూ.698 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు.

కేసులో చట్టపరంగా సంక్లిష్టత లేదు

- విద్యార్థిని మృతిపై సీబీఐ విచారణ సాధ్యంకాదు
- 2017 నాటి కేసుపై హైకోర్టులో సీబీఐ కౌంటర్

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చట్టపరంగా సంక్లిష్టత లేని, అంతర్రాష్ట్ర పర్యవసానాలు ముడిపడని ఓ విద్యార్థిని మృతి కేసులో తమ విచారణ సాధ్యం కాదని హైకోర్టుకు సీబీఐ తెలిపింది. కర్నూలు జిల్లా, దిన్నెదేవరపాడులోని కట్టమంచి రామలింగారెడ్డి రెసిడెన్షియల్ పాఠశాలలో 2017లో జరిగిన 10వ తరగతి విద్యార్థిని మృతిపై చెన్నై సీబీఐ ఎస్పీ రఘురామ్‌రాజన్ హైకోర్టులో తాజాగా కౌంటర్ దాఖలు చేశారు. 'పరిమిత సంఖ్యలో ఉన్న మా సిబ్బంది ముఖ్యమైన కేసుల దర్యాప్తులో నిమగ్నమయ్యారు. వనరుల కొరత ఉంది. విద్యార్థిని మృతి కేసులో రాష్ట్ర పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి 2018 మే లోనే కర్నూలు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆ తరువాత విద్యార్థిని తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. గత రాష్ట్ర ప్రభుత్వం కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం 2020లో సీబీఐ నుంచి కామెంట్స్ కోరింది. ఇది చట్టపరంగా సంక్లిష్టత ఉన్న వ్యవహారంకాదని 2021లో సీబీఐ ప్రధాన కార్యాలయానికి జవాబుఇచ్చాం. ఈ నేపథ్యంలో కేసును కొట్టివేయండి' అని సీబీఐ ఎస్పీ తన కౌంటర్‌లో కోరారు. తమ కుమార్తెను 2017 ఆగస్టు 19న అత్యాచారం చేసి హత్య చేశారని ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ తల్లిదండ్రులు 2019లో హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే గత ప్రభుత్వం డీఎస్‌పీఈ చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందని, కేసును సీబీఐ విచారణ చేపట్టేందుకు వీలుగా కేంద్రం నోటిఫికేషన్‌లో ఇవ్వలేదని ఎస్పీ వివరించారు.

పాలన వదిలేసిన పవన్‌కు డిప్యూటీ సీఎం పదవెందుకు?

- గుళ్లు, గోపురాలకు తిరుగుతున్న ఆయనకు దేవదాయ శాఖ ఇవ్వాలి: సీపీఐ రామకృష్ణ



అనంతపురం విద్య, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పరిపాలన వదిలేసి గుళ్లు, గోపురాలు అంటూ తిరుగుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు దేవదాయ శాఖ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సూచించారు. శనివారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. 'ప్రశ్నించడానికి పుట్టానని చెబుతున్న పవన్.. కాషాయ గుడ్డలు వేసుకుని గుళ్లు, గోపురాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రశ్నించడం, పాలించడం మానేసి తిరిగే పవన్ కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి అవసరమా? కేబినెట్‌లో ఉన్న ఆయన ప్రశ్నించకుండా మౌన దీక్షలు, కాషాయం అంటూ తిరగడం ఏమిటి' అని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో దేశంలో ఎక్కడా జరగని దోపిడీ మన రాష్ట్రంలో జరిగిందని ఆరోపించారు. అనాదిగా వస్తున్న చట్టాలను అధిగమించి, గిరిజన ప్రాంతాల్లో అదానీ హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులకు 2022లో ఏకంగా 2,500 ఎకరాలను కేటాయించారని మండిపడ్డారు. కూటమికి ప్రజలు 164 సీట్లను కట్టబెడితే.. మాట్లాడకుండా అదానీకి ఊడిగం చేస్తున్నారంటూ రామకృష్ణ మండిపడ్డారు.

ముగిసిన షష్ట షణ్ముఖ క్షేత్ర యాత్ర

- చివరి రోజు సోలైమలై, తిరుత్తణి ఆలయాలను సందర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్
- పూర్ణకుంభంతో జనసేనానికి స్వాగతం
- మురుగన్, సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు
- వెంట కుమారుడు అకిరా నందన్, ఆనంద్‌సాయి

చెన్నై/తిరుత్తణి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన షష్ట షణ్ముఖ క్షేత్ర యాత్ర శనివారం ముగిసింది. బుధవారం కేరళలోని ఆలయాలను సందర్శించిన ఆయన.. గురువారం తమిళనాడులోని తంజావూరు, కుంభకోణం, తిరుచ్చెందూర్ ఆలయాలు, శుక్రవారం పళని, తిరుప్పరంకుండ్రం, మదురై మీనాక్షి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం మదురై జిల్లా అళగర్ కొండల్లో కొలువైన పలముదిర్చోలై అరుల్మిగు సోలైమలై మురుగన్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ ఆలయ అధికారులు, అర్చకులు పవన్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మురుగన్‌కు ఆయన పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు క్షేత్ర విశిష్టతను వివరించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం బయల్దేరిన పవన్.. ఆలయ పారిశుధ్య కార్మికులను చూసి తన కాన్వాయ్ ఆపి వారితో కాసేపు మాట్లాడారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారితో సెల్ఫీలు దిగారు. అనంతరం వారికి ఆర్థికసాయం కూడా అందించారు.



తమిళనాడులోని సోలైమలై ఆలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

మధ్యాహ్నం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో కొలువైన శ్రీవల్లి, దేవసేన సమేత శ్రీ మురుగన్ స్వామి ఆలయానికి చేరుకున్నారు. పవన్‌కు ఆలయ అర్చకులు, తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. తిరుత్తణిలో షణ్ముఖునిగా దర్శనమిచ్చే మురుగన్‌కు ఆయన పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య విశిష్ట మంత్రోచ్చారణలతో అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచహారతులిచ్చారు. అనంతరం స్వామివారికి కుడివైపు కొలువైన శ్రీవల్లి అమ్మవారిని, ఎడమవైపు వెలసిన దేవసేన అమ్మవార్లను, ఆలయంలో ఉత్తరాన ఉన్న దుర్గాదేవిని ఆయన దర్శించుకున్నారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మంటపంలో అర్చక స్వాములు పవన్‌కు వేదాశీర్వచనాలు, స్వామివారి చందన ప్రసాదం అందజేశారు. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి చిత్ర ఆయన్ను సత్కరించారు. పవన్ వెంట ఆద్యంతం ఆయన కుమారుడు అకిరా నందన్, టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్ సాయి ఉన్నారు. ఈ సందర్భంగా పవన్ మీడియాతో మాట్లాడుతూ.. సుబ్రహ్మణ్యస్వామి ఆరుక్షేత్రాల దర్శనం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు.

భర్త ఎదుటే భార్యపై అత్యాచారం

- గిరిజన మహిళపై తమిళనాడు వాసి దుశ్చర్య

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఓ చెట్టు కింద భర్తతో కలిసి నిద్రిస్తున్న వివాహితపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. అడ్డుకోబోయిన భర్తను కొట్టి అతని కళ్ల ముందే దుశ్చర్యకు తెగబడ్డాడు. తెలంగాణ సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాదిలో ఈ దారుణం జరిగింది. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని ఓ తండాకు చెందిన దంపతులు సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా మొక్కులు చెల్లించడానికి ఈ నెల 2న తమ స్వగ్రామం నుంచి అనంతపురం జిల్లా నేరడిగొండకు కాలినడకన వెళ్లారు. అక్కడ మొక్కులు చెల్లించాక ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం రాత్రికి ఫసల్‌వాది గ్రామానికి చేరుకున్నారు. జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో భోజనం చేసి పక్కనే ఉన్న ఓ చెట్టు కింద నిద్రపోయారు. విద్యాపీఠం ఆలయంలో పెయింటింగ్ పనులు చేస్తున్న తమిళనాడుకు చెందిన మాధవన్ (34) సదరు వివాహితపై కన్నేశాడు. అర్ధరాత్రి సమయంలో భర్త కళ్ల ముందే ఆమెపై అత్యాచారం చేశారు. అడ్డుకోబోయిన భర్తను రాయితో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. నిందితుడి నుంచి తప్పించుకున్న భర్త 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు మాధవన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

దొంగను పట్టుకోబోయి.. రైలు ఢీకొని..

ఢిల్లీలో 'అనంత' జవాన్ మృతి



జవాన్ లక్ష్మన్న

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భార్య మెడలోని తాళిబొట్టు గొలుసును తెంచుకువెళుతున్న దొంగను పట్టుకునే క్రమంలో రైలు కిందపడి జవాన్ లక్ష్మన్న(32) మృతి చెందారు. ఈ ఘటన ఢిల్లీలో శుక్రవారం రాత్రి జరిగింది. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి చెందిన లక్ష్మన్న, 2014లో బీఎస్‌ఎఫ్ జవానుగా ఉద్యోగంలో చేరారు. డిసెంబరులో ఆయన జమ్మూ కశ్మీర్‌కు బదిలీ అయ్యారు. లక్ష్మన్నకు ఐదేళ్ల క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాకు చెందిన లక్ష్మితో వివాహమైంది. నెల క్రితం లక్ష్మన్న సెలవుపై సకుటుంబ సమేతంగా సొంతూరికి వచ్చారు. 16న విధుల్లో చేరాల్సి ఉండడంతో బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం రాత్రి హజరత్ నిజాముద్దీన్ ఈస్ట్ రైల్వేస్టేషన్‌కు 50 కి.మీ. దూరంలో రైలు నెమ్మదిగా వెళ్తున్న సమయంలో లక్ష్మి మెడలోని మంగళ సూత్రాన్ని ఒక దొంగ లాక్కొని పరుగులు తీశాడు. దొంగను పట్టుకునేందుకు రైలు నుంచి లక్ష్మన్న కిందకు దూకగానే పక్క ట్రాక్‌పై వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో లక్ష్మన్న అక్కడికక్కడే మృతి చెందారు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో లక్ష్మి స్పృహ తప్పి పడిపోయారు. అక్కడే ఉన్న మరో జవాను లక్ష్మన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విధుల్లో చేరటానికి వెళ్లిన కుమారుడి మృతి వార్త విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

పాత్రధారులెవరో తేలింది!

- లడ్డూ కల్తీ నెయ్యి సూత్రధారుల కోసం ఇక వేట
- దర్యాప్తుపై బృందానికి సీబీఐ దిశానిర్దేశం

తిరుపతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూల తయారీకి నాణ్యత లేని నెయ్యి సరఫరా చేసిన కేసులో పాత్రధారులెవరన్నది సిట్ బృందం దాదాపుగా తేల్చేసింది. ఇక సూత్రధారుల కోసం వేట మొదలుపెట్టబోతోంది. ఇప్పటి వరకూ చేసిన దర్యాప్తు ఆధారంగా ఈ వ్యవహారంలో టీటీడీకి సంబంధించిన 12 మంది అధికార, అనధికార ముఖ్యుల ప్రమేయం ఉందని సిట్ భావిస్తోంది. వారిపై దృష్టి సారించిన అధికారులు అందులో ఇద్దరిని విచారణకు పిలిచేందుకు నోటీసులు సిద్ధం చేస్తున్నారని, మరో ముగ్గురిని నేరుగా అరెస్టు చేసే అవకాశముందని సమాచారం. విచారణ మరో రెండు మూడు నెలలు కొనసాగనుందని, అప్పటికిగానీ కేసు ఒక కొలిక్కి వచ్చే అవకాశం లేదని సమాచారం.

ఏ ప్రశ్న వేసినా ఒకే రకమైన సమాధానం!

శుక్రవారం జ్యుడిషియల్ కస్టడీ నుంచి కోర్టు ద్వారా తమ కస్టడీకి తీసుకున్న ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్, భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్, వైష్ణవీ డెయిరీ సీఈవో వినయ్‌కాంత్ చావ్డాలను సిట్ అధికారులు రెండవ రోజైన శనివారమూ విచారించారు. సిట్‌కు నేతృత్వం వహిస్తున్న సీబీఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు, సీబీఐ డీఐజీ మురళీ రాంబా శనివారం కూడా ప్రధాన నిందితులు నలుగురినీ వేర్వేరుగా ప్రశ్నించారు. ఏ ప్రశ్న వేసినా నలుగురూ కూడబలుక్కున్నట్టు ఒకే రకమైన సమాధానం ఇచ్చారని తెలిసింది. శనివారం రోజంతా ఈ నలుగురినే ప్రశ్నించారని, టీటీడీకి సంబంధించి ఎవరినీ పిలవలేదని సమాచారం.



సిట్ అధికారులకే ఎదురు ప్రశ్నలు!

నిందితులు నలుగురినీ సిట్ అధికారులు ప్రశ్నిస్తుండగా, పలు సందర్భాలలో నిందితులే సిట్ అధికారులను ఎదురు ప్రశ్నించారని సమాచారం. గతేడాది జూలైలో ఏఆర్ డెయిరీ సరఫరా చేసిన నాలుగు నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించినట్టు టీటీడీ ఎప్పుడు సమాచారం ఇచ్చింది? అన్న ప్రశ్నకు ఆ డెయిరీ ఎండీ అసలు తాము టీటీడీకి నెయ్యే సరఫరా చేయలేదని, ఇక తిరస్కరించినట్టు టీటీడీ తమకు ఎందుకు సమాచారం ఇస్తుందని ఎదురు ప్రశ్నించినట్టు తెలిసింది. నాణ్యత లేదన్న కారణంగా టీటీడీ నెయ్యిని తిరస్కరించిందని తమకు వైష్ణవి డెయిరీ ప్రతినిధుల నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందిందని చెప్పినట్టు తెలిసింది. టీటీడీ తిరస్కరించిన ట్యాంకర్లు కూడా తమ డెయిరీకి రాలేదని, వైష్ణవి డెయిరీకి వెళ్లాయని చెప్పినట్టు సమాచారం. ఆ ట్యాంకర్లన్నీ భోలేబాబా డెయిరీ నుంచి వైష్ణవీ డెయిరీ ద్వారా టీటీడీకి సరఫరా అయ్యాయే తప్ప తమ డెయిరీకి ఎలాంటి సంబంధమూ లేదని సమాధానమిచ్చినట్టు తెలిసింది.

సిట్ బృందంతో సీబీఐ అధికారుల భేటీ

తిరుపతి సిట్ కార్యాలయంలో దర్యాప్తు బృందంతో సీబీఐ అధికారులు సమావేశమయ్యారు. ఇప్పటి వరకూ కొనసాగిన దర్యాప్తు గురించి సమీక్షించుకున్న అనంతరం తదుపరి దర్యాప్తు ఎలా చేపట్టాలన్న దానిపై దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. టీటీడీ అధికారులు, పాలకమండలికి సంబంధించిన వ్యక్తులను ఎవరెవరిని విచారించాలో లోతుగా చర్చించినట్టు సమాచారం. కల్తీ నెయ్యి సరఫరాలో టీటీడీ పరంగా 12 మంది ప్రమేయం ఉందని సిట్ భావిస్తున్నట్టు సమాచారం. అందులో పాలకమండలి, పాలనా విభాగం, మార్కెటింగ్ విభాగం, పర్చేజెస్, టెక్నికల్ కమిటీల్లోని కొందరు సభ్యులు, నెయ్యికి సంబంధించిన నిపుణులు, ల్యాబ్, విజిలెన్స్ విభాగాల కీలక వ్యక్తులున్నారు. వారందరినీ విచారించే ఆస్కారం ఉంది. ఇదివరకు పనిచేసిన ఓ కీలక అధికారి, పాలకమండలికి చెందిన ముఖ్యులొకరిని విచారణకు హాజరు కావాల్సిందిగా పిలిచేందుకు నోటీసులు సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. మిగిలిన వారిలో ముగ్గురిని నేరుగా అదుపులోకి తీసుకునే, అరెస్టుకు సైతం అవకాశాలున్నాయని తెలిసింది. ఇక సిట్ దర్యాప్తులో టీటీడీ అధికార యంత్రాంగం ప్రధానంగా ల్యాబ్‌కు సంబంధించి ఇబ్బంది ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది. సిట్ బృందంలో ప్రభుత్వం ఓ డీఎస్పీని, ఓ సీఐని అదనంగా కేటాయించిన సంగతి తెలిసిందే. పల్నాడు జిల్లా కారంపూడి సీఐ శ్రీనివాసరావు శనివారం తిరుపతికి చేరుకుని సిట్ విధుల్లో చేరారు. తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ నరసింగప్ప సోమవారం చేరనున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.